

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-4-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 86 పేజీలు: 12 వెల: 6.50


మీ పొలాలన్నీ ఖాళీ చేయండి: పంజాబ్ రైతులకు బిఎస్ఎఫ్ ఆదేశం

5లో

భారత్ కోసమే 130 అణ్వాయుధాలు: పాక్ మంత్రి

# అమరావతి నిర్మాణానికి రూ. 49వేల కోట్లతో టెండర్లు

## మియావాకి విధానంతో పచ్చదనం

### ఐకానిక్ భవనాలు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు

### మెట్రో నగరాలకు ధీటుగా అమరావతి

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విజయవాడ,ఏప్రిల్27,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యావరణం, పౌరజీవనం మధ్య సమతుల్యం పాటిస్తూ అత్యంత సౌకర్యవంతమైన నగరాలకు దీటుగా రాజధాని అమరావతిని ఆధునీకంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. అత్యున్నత జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వాతావరణంతో అభివృద్ధి చెందే నగరంగా మాస్టర్ ప్లాన్ రూపొందిందని తెలిపారు.. స్థిరత్వం, రహదారుల అనుసంధానం, జీవన ప్రమాణాలు, నవీకరణ, వారసత్వ పరిరక్షణ, అన్ని వర్గాలు కలిసి ఉండేలా ఈ ప్రణాళికలో అత్యంత ప్రాధాన్యతను ఇస్తామన్నారు.'ఎక్స్' వేదికల్లో చేసిన పోస్టులను అనుసరించి అమరావతి రాజధాని నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. నవనగరాలుగా నిర్మితమయ్యే అమరావతిలో విద్య, వైద్య, ప్రభుత్వ, క్రీడా, న్యాయ, ఆర్థిక, పర్యాటక, మీడియా, ఎలక్ట్రానిక్స్ సిటీలు ఉంటాయి. కేవలం 58 రోజుల్లో రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలు సమీకరణకు ఇచ్చిన విధానాన్ని ప్రధాని నరేంద్రమోడీకి వివరించిన విషయాన్ని సిఎం చంద్రబాబు ప్రస్తావించారు.

గ్రీన్, బ్లూ కాన్సెప్ట్‌తో రాజధానిలో 30 శాతం పచ్చదనం, నీటి ప్రవాహానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇన్నర్,ఔటర్ రింగ్ రోడ్లను 4 జాతీయ రహదారులతో అనుసంధానించేలా గ్రిడ్ రోడ్ నెట్వర్క్ విధానం చేపట్టనున్నారు. భూగర్భ కారిడార్ ద్వారానే నీరు, మురుగునీరు, వరద నీరు, శుద్ధి చేసిన నీటి పంపిణీతో పాటు విద్యుత్, ఐసీటీ సరఫరా జరగనుంది. ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా 2015 అక్టోబర్‌లో శంకుస్థాపన చేసుకున్న రాజధాని అమరావతి నిర్మాణం, 2019 వరకూ నిర్మాణ పనులు ముందుకు సాగాయి.అనంతర కాలంలో టిడిపి అధికారాన్ని చేజార్చుకుంది. ఈ క్రమంలో రాజధాని పనులు >>2



## పహల్గాం ఉగ్రదాడికేసు

# ఎన్ఐఎకు అప్పగింత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పహల్గాం దాడి ఘటనపై భారత భద్రతా బలగాలు, జమ్ముకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు జరుపుతున్నారు. తాజాగా ఈ కేసును కేంద్రం జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎకు అప్పగించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు తాజాగా ఈ కేసును జమ్ముకశ్మీర్ పోలీసుల నుంచి ఎన్ఐఎ అధికారికంగా తీసుకుంది. ఉగ్రవాదుల దాడి మరుసటి రోజు నుంచే ఎన్ఐఎ బృందాలు పహల్గాంలో విచారణను ప్రారంభించాయి. ఘటన జరిగినప్పుడు ఉగ్రవాదులను చూసిన పర్యాటకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు.

అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటన సమయంలో ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పహల్గాంలోకి ప్రవేశించే, నిష్క్రమించే ప్రాంతాల్లో ఫోరెన్సిక్ బృందం సహాయంతో తనిఖీలను ముమ్మరం చేశామని తెలిపారు. బైసరన్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ముష్కరులు కాల్పులు జరిపిన విషయం తెలుసుకొని >>2



కూలీలతో కలిసి పనులు చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## ఇటుకలు మోసిన ఎమ్మెల్యే సునీత

**రామగిరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** నిత్యం రాజకీయలు, అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉండే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కూలీగా మారిపోయారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఇటుకలు, ఇసుక మోస్తూ శ్రమదానం చేశారు. ఇదంతా దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల కోసం చేశారు ఆమె. రామగిరి మండలం నసనకోటలో వెలిసిన దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను చాలాఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తన అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టారు. వీటిలో పంచాయతీవాసులుస్వచ్ఛందంగా పాల్గొంటూ >>2

# పాఠశాల విద్యలో సంస్కరణలు

## ఇకపై 9 రకాల బడులు

### కొత్త ప్రణాళికల అమలుకు విద్యాశాఖ కసరత్తు



**విజయవాడ, ఏప్రిల్27, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పాఠశాల విద్యలో కొత్త సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయి. నూతన విద్యా విధానంలో తొమ్మిది రకాల పాఠశాలలు రాబోతున్నాయి. ఆ దిశలో ప్రాథమిక విద్యాశాఖ పరిధిలో అధికారులు ప్రాథమికంగా జాబితాను రూపొందించారు. ఇప్పటివరకుఉన్న 6రకాల బడుల స్థానంలో 9 రకాల బడులు రానున్నాయి. ఉన్నత పాఠశాల ల్లోనే 4 రకాలు రానున్నాయి. ప్రాథమిక బడుల్లో 45 మంది లోపు ఉంటే బేసిక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పిలుస్తారు. 45 మంది కంటే విద్యార్థులు ఎక్కువ ఉంటే తరగతికో టీచర్‌ను కేటాయిస్తారు. వీటిని ఆదర్శ ప్రాథమిక, ఉన్నత స్కూల్స్‌గా ఏర్పాటు చేస్తారు.

1 నుంచి 10 తరగతులు ఉండే బేసిక్, ఆదర్శ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 900 వరకు ఏర్పడనున్నాయి. ఇంటర్మీడియట్‌తో ఉన్నవి హైస్కూల్ ప్లస్‌లుగా కొనసాగుతాయి. కొన్ని ప్రాథమికోన్నత బడులు ఉంటాయి. మొదట్లో వీటిని ఉన్నతీకరించడం లేదంటే హోదా తగ్గించాలని భావించారు. కానీ, క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా 240కి పైగా ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఐదు రకాల బడులను తీసుకురావాలని విద్యాశాఖ భావించింది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితుల నేపథ్యంలో ఇవి తొమ్మిది రకాలుగా మారాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ స్కూల్స్ అందుబాటులోకి రానున్నాయి. పూర్వ ప్రాథమిక విద్య 1, 2 (ఎల్‌కేజీ, యూకేజీ) ఉండే బడులను శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్‌గా ఏర్పాటు చేస్తారు. అంగన్‌వాడీలనే ఇలా మార్పుచేస్తారు. ఇవి మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉండనున్నాయి.

పిపి 1, 2తో పాటు ఒకటి, రెండు తరగతులు కలిపి ఫౌండేషనల్ బడులుగా ఉంటాయి. పిపి 1, 2తోపాటు 1 నుంచి 5 తరగతులు ఉండే వాటిని బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేస్తారు. ఒకటి నుంచి ఐదు తరగతుల్లో 45 మంది లోపు పిల్లలు ఉండే వాటిని బేసిక్ ప్రాథమిక స్కూల్స్‌గా పరిగణిస్తారు. పిపి 1, 2, ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండి, 45 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్నవి ఆదర్శ ప్రాథమిక బడులుగా ఉంటాయి. ప్రాథమికోన్నత బడులు కొనసాగుతాయి. క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా యూపీ బడులను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. 6,7,8 తరగతుల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొన్నింటిని ఉన్నత పాఠశాలలుగా మరికొన్నింటిని ప్రాథమిక స్కూల్స్‌గా మార్పు చేశారు. స్థానిక పరిస్థితుల కారణంగా కొన్నింటిని యథావిధిగా కొనసాగిస్తున్నారు.

6 నుంచి 10 తరగతులు ఉండే ఉన్నత పాఠశాలలు ఉంటాయి. 1 నుంచి 10 తరగతులు ఉండే బేసిక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు. జీఓ117 రద్దుతో గతంలో ఉన్నత పాఠశాలలకు తరలించిన 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చి, ప్రాథమిక బడుల్లో విలీనం చేయడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో వాటిని అక్కడే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. వీటికి 1, 2 తరగతులను చేర్చుతారు. 1 నుంచి 10 తరగతులు ఉంటే ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు >>2



## 15 నిమిషాల రోడ్ షో

### గంట సమయం బహిరంగ సభ

### ప్రధాని మోడీ షెడ్యూలు ఇదే

**విజయవాడ ఏప్రిల్ 27 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీ అమరావతి షెడ్యూల్ ఖరారు ఖరారైంది. మే 2 న సాయంత్రం 4 గంటలకు రాజధాని అమరావతి పునఃనిర్మాణ శంకుస్థాపన చేయనున్నారు. 15 నిమిషాలు రోడ్డు షో, గంట పాటు సభ ఉంటుంది. ఈ కార్యక్రమం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం వెనక బహిరంద సభ వేదికను ఎంపిక చేసింది అక్కడి నుంచే రాజధాని పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల కోసం మంత్రుల కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ మే 2వ తేదీ మధ్యాహ్నం >>2

## కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్య

### గుంతకల్లు సమీపంలో ఘటన



లక్ష్మీనారాయణ (ఫైల్)

**గుంతకల్లు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంఆర్‌పిఎస్ నేత చిప్పగిరి లక్ష్మినారాయణ ఆదివారం మధ్యాహ్నం దారుణహత్యకు గురయ్యారు. మధ్యాహ్నం 2 గంటలసమయంలో గుంతకల్లు నుండి సొంతూరు చిప్పగిరికి వెళుతుండగా గుంతకల్లు రైల్వే వంతెన వద్ద ప్రత్యర్థులు అశోక్ లేలాండ్ టిప్పర్‌తో వాహనాన్ని ఢీ కొట్టారు. ముందస్తు పథకం ప్రకారం అక్కడే మాటు వేసి వున్న ఎనిమిది మంది గుర్తు తెలియనివ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేసి లక్ష్మినారాయణను >>2

# కమ్యూనిస్టు కుట్రలు కట్టడి చేసిన అంబేద్కర్

### -కేంద్రమంత్రి కిషన్ రెడ్డి





ఆదివారం విజయవాడలో అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సభలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్27,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ సమైఖ్యత,సమగ్రత కాపాడేందుకు రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వం ప్రగతిపథంలోకి అడుగులు వేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.అంబేద్కర్ కరుడుగట్టిన దేశభక్తుడు, జాతీయవాది అంబేద్కరని శ్లాఘించారు. కమ్యూనిస్టులు దేశంలో విప్లవం పేరిట చేసిన ప్రయత్నాలను ఆయన ఎదురించారు. దేశాన్ని విభజించేందుకు కమ్యూనిస్టులు చేసిన కుట్రపూరిత ఆలోచనలను ప్రతిఘటిస్తూ, సైద్ధాంతికంగా ముందుకు నడిచారన్నారు. విజయవాడ నగరం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మేధావుల సదస్సుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసారు,ఈ సందర్భంగా కేంద్రమంత్రి అంబేద్కర్ ఇతర దేశాల మతాలల్లో చేరలేదన్నారు.హిందు మతంలో అంతర్భాగంగా ఉన్న బౌద్ధమతంలో చేరారన్నారు.మోడీ రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ విష ప్రచారం చేసిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పట్ల అత్యంత గౌరవం భావంతో భారతీయ జనతాపార్టీ ఉందన్నారు.అంబేద్కర్ పట్ల గౌరవం లేనందునే కాంగ్రెస్ 1975లో అత్యవసర పరిస్థితిని విధించిందన్నారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందన్నారు.విపక్షనేత రాహుల్ గాంధీ >>2

## రీసెటిల్‌మెంట్ పాలసీకి సిఆర్‌డిఎ కార్యాచరణ

**విజయవాడ,ఏప్రిల్27,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని పరిధిలో కొత్తగా తీసుకొచ్చిన రీసెటిల్‌మెంట్ పాలసీని అమల్లోకి తెచ్చేందుకు సిఆర్‌డిఎ అధికారులు కార్యాచరణను అమలు చేసున్నారు. రీసెటిల్‌మెంట్ పాలసీలో భాగంగా స్థలానికి స్థలం, ఇంటి నిర్మాణానికి ఖర్చు ఇస్తామని బాధితులకు అధికారులు స్పష్టం చేసారు. రాజధాని పరిధిలో ఉన్న ఆర్టిరియల్ రోడ్లు కొన్ని గ్రామాల మధ్యలో నుండి వెళుతున్నాయి. వాటిని విస్తరించాలంటే ఇళ్లను అనివార్యంగా తొలగించాల్సి ఉంది. ఒక్కో రోడ్డు 150 అడుగులకు పైబడి ఉండటంతో ఇళ్లు కోల్పోయే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. దీనికి సంబంధించి రెండు నెలల క్రితం సిఆర్‌డిఎ రీసెటిల్‌మెంట్ పాలసీ పేరుతో డ్రాఫ్ట్‌ను విడుదల చేసింది. గ్రామాల్లోనూ ఇక నుండి ఇళ్లను తీసుకుంటారని, ఖర్చు తగ్గించుకునేందుకు కొత్త పాలసీని ప్రవేశపెడుతున్నారనే విషయాన్ని చెప్పింది.

ప్రస్తుతం దీన్ని అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నిడమర్రుతోపాటు కురగల్లు, రాయపూడి, ఐనవోలు, తుళ్లూరు, శాఖమూరు, మందడం, దొండపాడు గ్రామాల్లో నుండి రోడ్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం వాటిల్లోనూ ఇళ్లు కోల్పోయే వారికి రీసెటిల్‌మెంట్ పాలసీ ప్రకారం స్థలాలు, నష్టపరిహారం ఇస్తామని అధికారులు చెబుతున్నారు.త్వరలో ఆయా గ్రామాల్లోనూ పూర్తిస్థాయి సర్వే నిర్వహించనున్నట్లు సమాచారం. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన సిఆర్‌డిఎ దానికి అనుగుణంగా గ్రామాల్లో భూములు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. తొలివిడతగా మంగళగిరి మండలంలోని నిడమర్రులో ఇళ్ల తొలగింపునకుసర్వేచేశారు.సర్వేప్రకారం సుమారు >>2

## ఒక పక్క వానలు, మరో పక్క ఎండలు

### విచిత్రంగా ఎపి వాతావరణం

**విజయవాడ,ఏప్రిల్27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు విచిత్రంగా ఉన్నాయి. పగలు ఎండలు అదరగొడుతున్నాయి, సాయంత్రం అయితే మబ్బులు కమ్మి ఈదురుగాలులు వీస్తున్నాయి,. కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి.ఎండతో నిమిత్తం లేకుండా ఉదయం మొదలు సాయంత్రం వరకు విపరీతమైన ఉక్కపోత ఉంటుంది.దీంతో పిల్లలు,వృద్ధులు ఇబ్బంది పడుతున్నాయి. గరిష్ట శీతలీకరణ స్థాయిలో ఎసిలు ఉన్నా, ఆ చల్లదనం కుడా ఉపశమనం ఇవ్వనంతగా ఉక్కపోత ఉంటుంది. ప్రధానంగా రాయలసీమ, ఉమ్మడి గోదావరి,ఉమ్మడి కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎండ తీవ్రత సగటున 43.5 డిగ్రీలుగా ఉంది. ఇక వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాగల 48 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి >>2

# వేసవిసెలవుల్లో సిఫార్సులకు 'బ్రేక్'!

### మేనెల 1నుండి జులై 15వరకు స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకే దర్శనాలు



**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు.. ఆపై దేశం నలుమూలల నుండి కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో విఐపి బ్రేక్ దర్శనాలకు తిరుమల తిరుపతి దేవస్థానం "బ్రేక్"వేసింది. వేసవిసెలవులు ముగిసే వరకు మేనెల 1వతేదీ నుండి జులై 15వతేదీ వరకు పూర్తిగా సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అంతేగాక మే 1వతేదీ నుండి విఐపి బ్రేక్ దర్శనాల సమయాన్ని మార్పుచేస్తూ ప్రయోగాత్మకంగా అమలుచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. మేనెల 1వతేదీ నుండి ఉదయం 6గంటలకు విఐపి బ్రేక్ దర్శనాలు అమలుచేయనున్నారు. అదీ స్వయంగా తిరుమలకు వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే విఐపి బ్రేక్ దర్శనాలు కల్పిస్తామని టిటిడి ప్రకటించింది. ఈ నేపథ్యంలో వేసవిసెలవులు ముగిసేవరకు సామాన్యభక్తులకు ఏడుకొండల వెంకన్న దర్శనాలకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు ప్రణాళికలు అమలుచేయనున్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, భక్తులు >>2

## కస్టడీనుంచి జైలుకు ఐపిఎస్ పిఎస్‌ఆర్



**విజయవాడ,ఏప్రిల్27, ప్రభాతవార్తప్రతినిధి:** ముంబయి నటిని వేధించిన కేసులో అరెస్టైన సీనియర్ ఐపీఎస్ అధికారి పిఎస్‌ఆర్ ఆంజనేయలును సిఐడి అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో విజయవాడ జిల్లా జైలు నుంచి ఆయన్ను కస్టడీలోకి తీసుకున్న సిఐడి అధికారులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల తర్వాత సిఐడి కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ కేసులో కీలకవిషయాలపై ఆంజనేయులును ప్రశ్నించి.. ఆయన నుంచి సమాచారం రాబట్టి స్టేట్ మెంట్ రికార్డ్ చేయాలని సిఐడి అధికారులు భావించారు. అనూహ్యంగా ఆంజనేయులు ఇవాళ ఉదయం అస్వస్థతకు గురయ్యారు. దీంతో అధికారులు ఆయన్ను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిఎస్‌ఆర్ ఆంజనేయులు అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రి వద్దకు వైఎస్‌ఆర్సీ నేత మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు వెళ్లారు.

వైద్య పరీక్షల అనంతరం సిఐడి కార్యాలయానికి పిఎస్‌ఆర్‌ను సిఐడి పోలీసులు తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఉదయం 10 గంటలకు పీఎస్‌ఆర్ ఆంజనేయులును కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాల్సి ఉంది. అయితే పీఎస్‌ఆర్‌కు బిపి హెచ్చుతగ్గుల కారణంగా ఆయన్ను >>2



టిసిఎస్ వరల్డ్ 10కె బెంగళూరు 2025 రైడ్‌లో పాల్గొన్న మహిళా బైక్ రైడర్లు

# రూ. 49 వేల కోట్లతో టెండర్లు

>> నిలిచిపోయాయి. గత ఏడాది తిరిగి అధికారం లోకి వచ్చిన సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభానికి చర్యలు చేపట్టింది. ఇందుకు కేంద్ర సహకారం, ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఇతర ఆర్థిక సంస్థలు నిధుల సమకూర్చ డానికి సహకారం అందించేందుకు ముందుకు వచ్చాయి. దాంతో రాజధాని నిర్మాణ పనులు గాడిన పడ్డాయి. అంతేకాకుండా మే 2వ తేదీన అమరావతి పునః ప్రారంభం పేరిట ప్రధాని నరేంద్ర మోడీతో దాదాపు రూ.లక్ష కోట్ల పైగా వివిధ ప్రాజెక్టు పనులు శంకుస్థాపన చేయించే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. వెలగపూడి సచివా లయం వెనుక దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో ఇందుకు చేపట్టినఏర్పాట్లు తుదిదశకు చేరుకు న్నాయి.

**అమరావతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

ప్రధాని నరేంద్ర మోడీకి అధికారికంగా ఆహ్వానం పలికేందుకు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనతో దాదాపు గంటన్నరపాటుభేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణంపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సిఎం మోడీకి వివరించారు. సంప్రదాయేతర ఇంధన వనరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వను న్నారు. అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గ్రీన్ ఫీల్డ్ మోడల్‌లో నిర్మించనున్నారు. అసెంబ్లీ, సచివా లయం, హెచ్ఒడి కార్యాలయాలు, హైకోర్టులు ఐకానిక్ భవనాలుగా నిర్మించనున్నారు. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.77,250 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందిస్తే రూ.49 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఐకానిక్ భవనాలతో పాటు నివాస భవన సముదాయాల నిర్మాణానికి రూ.12,700 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ యూటిలిటీ కారిడార్లతో కూడిన రోడ్లు, వరద నిర్వహణ పనులు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.16,200 కోట్లు ఖర్చు చేయనున్నారు.

భూసమీకరణ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20,100 కోట్లు కలిపి మొత్తంగా 49 వేల కోట్ల రూపాయల పనులకు టెండర్లు పిలిచారు. దీనికి రూ.15 వేల కోట్లు కేంద్ర పూచికత్తుతో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ రుణం అందించాయి. మరో 11 వేల కోట్ల రూపాయల హడ్కో రుణం సమకూరింది. అన్ని వసతులు పోను ప్రభుత్వం వద్ద దాదాపు 4 వేల ఎకరాల మిగులు భూమి ఉంటుందని అంచనా. ఎకరా 20 కోట్ల రూపాయల చొప్పున ఆ భూమిని తనఖా పెట్టినా స్వయం ఆర్థికాభివృద్ధి నగరంగా అమరావతి అభివృద్ధి చెంద నున్నట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో వివరించారు. రాజధాని అమరావతి నగరం రూ.30,885.5 కోట్ల పెట్టుబడుల్ని ఇప్పటికే ఆకర్షించింది. విద్యారంగంలో బిట్స్ అమరావతి, ఎక్స్ ఎల్ఆర్ఐ, విట్, ఏఐఐఎంలు, వైద్య రంగంలో ఈఎస్ఐతో పాటు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రులు తమ సంస్థల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. ఆతిథ్య రంగంలో హిల్టన్, మారియట్, నోవోటెల్, క్రోన్ ప్లాజాలు హోటళ్ల నిర్మించనుండగా, బ్యాంకింగ్ రంగంలో ఆర్బీఐ, ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, నాబార్డ్‌లు తమ క్యార్యాలయాల ఏర్పా టుకు సముఖత వ్యక్తం చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలైన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్, విదేష్ భవన్, హడ్కో, హెచ్‌పీసీఎల్‌లు అమరావ తిలో ఏర్పాటు కానున్నాయి. భారతదేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతిలో ఏర్పాటు కానుంది. దీనికి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐఐటీ మద్రాస్‌లు తమ సహాయ సహకారాలు అందించనున్నాయి.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుతో పాటు సిఐఐ ఆధ్వర్యంలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ అమరావతిలో ఏర్పాటు కానుంది. 1575 ఎకరాల్లో ఎజిసిలో ప్రభుత్వ భవనాల సముదాయాలను నిర్మించనున్నారు. శాసనసభ, సచివాలయం, హైకోర్టు, రాజ్‌భవన్, సీఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదా యాలు సైతం ఇందులోనే వస్తాయి. న్యాయమూ ర్తులు, మంత్రులు, కార్యదర్శుల బంగ్లాలు కూడా ఏజీసీలోనే నిర్మితమవుతున్నాయి. వచ్చేనెల 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్లు దాఖలు చేసేందుకు గడువు నిర్దేశించారు.

బిడ్లను అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఓపెన్ చేస్తారు. ఐకానిక్ టవర్ల నిర్మాణానికి గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.2,703 కోట్లతో టెండర్లను పిలిచారు. ప్రస్తుతం మొదటి ప్యాకేజీ కింద 1,126.51 కోట్ల రూపాయలతో జిఎడి టవర్, రెండో ప్యాకేజీలో 1,897.86 కోట్ల రూపాయలతో రెండు టవర్లు, మూడో ప్యాకేజీ కింద 1,664.45 కోట్ల రూపాయలతో మరో టవర్లను నిర్మించనున్నారు. వచ్చే 3 ఏళ్లలో ప్రారంభానికి నోచుకునే విధంగా 21వ శతాబ్దపు భవిష్యత్తు రాజధాని నిర్మాణంలో ప్రధాని నరేంద్రమోడీ పాల్గొనసుండటం ఓ అరుదైన ఘట్టంగా పవర్ పాయింట్‌లో అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాజధాని అమరావతిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు జపాన్‌లో అనుసరి స్తున్న మియావాకి విధానం ద్వారా రాజధానిలో వేగంగా పచ్చదనం విస్తరింపచేయవచ్చన్న మోడీ సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. మియావాకి విధానం అనేది స్థానిక మొక్కలతో గ్రీనరీని వేగంగా, సమర్థవంతంగా సృష్టించడానికి ఉపయోగించే ఒక పద్ధతి. జపాన్‌కి చెందిన అకిరా మియావాకీ అనే వృక్షశాస్త్రవేత్త ఈ పద్ధతిని అభివృద్ధి చేశారు. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలోనే వేగంగా, దట్టంగా చెట్లను పెంచడం సాధ్యమవుతుంది.

# సిఫార్సులకు 'బ్రేక్'!

>> పెద్దసంఖ్యలో తిరుమలకు వస్తున్నారు. ఇప్పటికే ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకొంటుండగా 70వేలమంది భక్తులకు స్వామివారి దర్శనం చేయిస్తున్నారు. ఆలయంలో పూర్తిగా మహాలఘు విధానం అమలుచేస్తున్నారు. ఏప్రిల్ 15వతేదీ నుండే కొండకు వచ్చే భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. దీంతో సర్వదర్శనానికి 20గంటల సమయం పడుతోంది. టైమ్‌స్లాట్ భక్తులకు ఏడెనిమిది గంటలు దర్శనం సమయం కేటాయిస్తుండగా, 300 రూపాయలు ఎస్ఇడి ప్రత్యేక దర్శనాలకు ఆరుగంటల సమయం కేటాయిస్తున్నారు. సాధారణ సామాన్యభక్తులు నేరుగా తిరుమలకు చేరుకుంటే సాధారణరోజుల్లోనే 10గంటల సమయం నిరీక్షించాల్సి వస్తుండగా వారాంతంలో ఈ రద్దీ పెరిగి 20గంటలు దర్శనం సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులతో కీలకంగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకున్నారు. మే 1వతేదీ నుండి జులై 15వరకు పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు రద్దుచేశారు. ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేనే వారికి ఉదయం 6గంటలకే విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తారు. దీనివల్ల రాత్రిసమయాల్లో వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో వేచివుండే భక్తులను వేకువజామున సుప్రభాతసేవ నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా స్వామివారి దర్శనానికి అనుమతినిస్తారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, విఐపిలు కూడా గమనించి టిటిడికి సహకరించాలని కోరారు.

**నిర్ధేశిత సమయానికి క్యూలైన్లోకి రావాలి:**

తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సామాన్యభక్తులు టైమ్‌స్లాట్ దర్శనాలకు వచ్చే వారు టోకెన్‌పై నిర్ధేశించిన సమాయనికి వైకుంఠం క్యూలైన్లోకి ప్రవేశించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి విజ్ఞప్తి చేశారు. వేసవిరద్దీతో క్యూలైన్లలో ప్రవేశించే అన్ని దర్శనాల టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నారు. ముందుగా వచ్చి తిరుమలలో ఇబ్బంది పడవద్దని, సమయానికి వచ్చి క్యూలైన్లో ప్రవేశిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, సమయానికి క్యూలైన్లోకి రావాలని కోరారు.

# కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్య

>> కారులో నుండి బయటకు లాగి వేట కొడవళ్లతో కిరాతకంగా నరికి చంపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే కారు నడుపుతున్న లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్‌తో పాటు మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా వుండగా గత 19ఏళ్ల క్రితం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కెడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు దంపతుల హత్య కేసులో లక్ష్మీనారాయణ ముద్దాయిగా వున్నాడు. పాత కక్షలే హత్యకు దారి తీసినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

**ప్రాణహాని ఉందని హోం మంత్రికి ఫిర్యాదు :**

ప్రత్యర్థుల నుండి తనకు ప్రాణహాని వుందని తనకు బందోబస్తు కల్పించాలని కోరుతూ లక్ష్మీనారాయణ రాష్ట్ర హోం మంత్రి అనితకు నెలన్నర క్రితమే విన్నవించినట్లు ఆయన అన్న కుమారుడు కరెంట్ గోవింద్ వాపోయాడు. అయినా పోలీసులు సరైన చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించాడు.

**దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా :**

హత్యకు గురైన లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏరియా ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. లక్ష్మీనారాయణ హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్‌పి జగదీష్ ఆదివారం రాత్రి గుంతకల్లుకు చేరుకుని ధర్నా చేస్తున్న దళిత సంఘాల వారితో మాట్లాడుతూ లక్ష్మీనారాయణ హత్య విషయమై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్‌పి హామీ ఇచ్చారు.



తమిళనాడులోని కోయంబత్తూరులో వ్యవసాయం వర్సిటీ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

# మరో పక్క ఎండలు

>> మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.. కోస్తా ఆంధ్ర, రాయలసీమలో ఆదివారం, సోమవారం తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పలుచోట్ల పడే అవకాశం ఉందని.. 30 40 కిమీ వేగంతో ఈదురుగాలులు కూడా వీయవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది.. ఇక దక్షిణ కోస్తాలో చూస్తే ఆదివారం, సోమవారం వాతావరణం పూర్తిగా పొడిగా ఉండే అవకాశం ఉంది. ఆదివారం అల్లూరి జిల్లా కూనవరం, కాకినాడ జిల్లా జగ్గంపేట, కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాల్లో తీవ్ర వడగాలులు, 17 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని.. జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 28-04-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
శు.పాడ్యమి రా.9.12
భరణి రా.9.39
వర్జ్యం ఉ.8.14-9.39
దు.మ.12.31-మ.1.22, 2) 3.03-3.54
శుభసమయం : ఉ.7.10-7.45, సా.5.00-6.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** ఉద్యోగాలలో పని ఒత్తిడులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. పనులలో అవాంతరాలు.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపంగా దాలుస్తాయి. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**సింహం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో చికాకు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలలో చురుకుగా పాల్గొంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**తుల :** చిన్ననాటి స్నేహితులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందతాయి.

**వృశ్చికం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు ప్రేయస్కరం.

**ధనుస్సు:** పరిస్థితులు అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగాలలో పురోభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** సన్నిహితుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**కుంభం:** ప్రముఖుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మీనం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. స్వల్ప ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇటుకలు మోసిన ఎమ్మెల్యే సునీత

>> శ్రమదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సునీత కూడా వారితో కలిసి శ్రమదానం చేశారు. సిమెంట్ ఇటుకలు మోస్తూ.. అలాగే ఇసుక గంపలు అందుకుంటూ పనులు చేశారు. మండుటెండలో కూడా ఆమె ఈ పనులు చేశారు. అనంతరం గ్రామస్థులతోనే కలిసి గుడి మెట్ల వద్ద భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే నెల 14,15,16 వ తేదీలలో 1అమ్మవారి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. పంచాయతీ వాసులంతా ఐక్యంగా నిర్వహించుకునే ఈ ఉత్సవాల కోసం శ్రమదానం చేయడం నా బాధ్యత అన్నారు. ఇది నా ఊరు అని.. నేను ఇక్కడ పనుల్లో పాలుపంచుకోవడం నా బాధ్యత అని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# కస్టడీనుంచి జైలుకు ఐపిఎస్ పిఎస్ఆర్

>> కస్టడీలోకి తీసుకోవడంలో ఆలస్యమైంది. దాదాపు గంట ఆలస్యంగా కస్టడీలోకి తీసుకుని విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. మూడు రోజుల పాటు పిఎస్ఆర్‌ను ప్రశ్నించాల్సి ఉంది. ఈ 3 రోజుల విచారణలో కీలక విషయాలు బయటపడతాయని భావిస్తున్నారు. దీనివెనకున్న సూత్రధారులు, కీలక పాత్రధారుల, అంతిమ లబ్ధిదారులు ఎవరనే విషయం బయటపడుతుందని చెబుతున్నారు. ముంబై నటిని వేధించి ఆమె ఓ పారిశ్రామికవేత్తపై పెట్టిన కేసు ఉపసంహరించుకునేలా చేయడంలో మొత్తం కుట్రపన్నిందెవరనే విషయం విచారణలో బయటపడుతుందని సిఐడి అధికారులు భావిస్తున్నారు. న్యాయవాదుల సమక్షంలో సాయంత్రం 5 వరకు పిఎస్ఆర్ ఆంజనేయులు విచారణ కొనసాగవలసి ఉండగా ఆయన అస్వస్థత కారణంగా వాయిదా పడింది.

# 15 నిమిషాల రోడ్ షో

>> 3 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు అమరావతిలోని హెలిప్యాడ్‌కు ప్రధాని చేరుకుంటారు.

అక్కడి నుంచి ప్రధాన వేదిక వరకు 1.1 కి.మీ మేర రోడ్డు షో ఉంటుంది. ఈ రోడ్డు షో 15 నిమిషాలపాటు సాగనుంది. 3.45 గంటల నుంచి 4 గంటల వరకు అమరావతి పెవిలియన్ సందర్శన ఉంటుంది. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభ జరగనుంది. అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం సభలో ప్రధాని మోడీ ప్రసంగిస్తారు. సాయంత్రం 5.10 గంటలకు హెలికాప్టర్‌లో ప్రధాని బయల్దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 5.20కి గన్నవరం నుంచి ఢిల్లీ బయల్దేరి వెళతారు.

# ఎన్ఐఎకు అప్పగింత

>> తొలుత సిఆర్పీఎఫ్ క్విక్ యాక్షన్ టీమ్ స్పందించింది. మొత్తం 25 మంది కమాండోలతో కూడిన బృందం రాళ్లు, బురద మార్గంలో దాదాపు 40.45 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి ఘటనా స్థలానికి చేరుకుంది. వెంటనే పహల్గాం చుట్టూ సిఆర్పీఎఫ్ యూనిట్ చెక్‌పోస్టులు, ఘటనా స్థలానికి సమీపంలో సురక్షిత పాయింట్లను ఏర్పాటుచేసింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని పర్యాటకులను ఇతర ప్రాంతాలకు తరలించారు.

ఇదిలా ఉండగా ఎన్ఐఎ చేతికి కీలక ఆధారాలు చిక్కాయి. బైసారన్‌కు వచ్చే టూరిస్టులకోసం రీల్స్‌ను చిత్రించే ఒక స్థానిక వీడియోగ్రాఫర్ దాడిమొత్తాన్ని కెమేరాలో బంధించాడు. దాడిజరిగే సమయంలో ఆతడు ఒక చెట్టుపై దాక్కొని మొత్తం చిత్రీకరించాడు. ఆ విడియోల ఆధారంగా జరిగిన దారుణం వరుసక్రమంలో తెలుసుకనేందుకు ఎన్ఐఎకు కీలకంగా మారాయి. ఉగ్రవాదులు రెండుగ్రూపులుగా విడిపోయి లోయలో వేరువేరు దిక్కులనుంచి కాల్పులు జరిపినట్లు గుర్తించారు. తొలుత ఇద్దరు ఉగ్రవాదులు సందర్శకులను ముస్లిం మతాచారం పాటించాలని బెదిరించారు.

తర్వాత సుమారు నలుగురిని కాల్చివేసారు. పర్యాటకులు తలోదిక్కుకు పారిపోగా జిప్‌లైన్ అనే ప్రదేశంనుంచి మరో ఇద్దరు ఉగ్రవాదులు బయటకు వచ్చి కాల్పులు ప్రారంభించారు. ఈఫోటోగ్రాఫర్ ప్రాణాలు కాపాడుకోడానికి పరుగెత్తి తూటాలను తప్పించుకోడానికి చెట్టుకొమ్మపై దాక్కున్నాడు. తర్వాత మొత్తం చిత్రీకరించాడని ఒక సీనియర్ అధికారి వెల్లడించాడు. ఉగ్రవాదులు స్థానికులనుంచి రెండుఫోన్లు కూడా లాక్కునట్లు గుర్తించాయి. వీటి ఆధారంగా ట్రాకింగ్‌చేసి ఉగ్రవాదులున్న ప్రాంతాలను గుర్తించే అవకాశం ఉందని చెపుతున్నారు. దాడి తర్వాతనుంచి అవి స్విచాఫ్ అయినట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో ఎకె47, ఎం4 రైఫిల్ ఖాళీ తూటాలను గుర్తించారు.

# సిఆర్‌డిఏ కార్యాచరణ

>> 78 ఇళ్లు తొలగించాల్సి ఉందని గుర్తించినట్లు తెలిసింది. ఇక రాజధాని అమరావతి విస్తరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పుడున్న 54 వేల ఎకరాలకు తోడు అదనంగా 44,676 ఎకరాలు సమీకరించనున్నారు. దీనికోసం మూడు మండలాల పరిధిలో 11 గ్రామాలను గుర్తించారు. కొత్తగా సేకరించే గ్రామాలతో కలిపి రాజధాని ప్రాంతం మొత్తం లక్ష ఎకరాలకు చేరుకుంటుంది. వారం రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు సమీకరణకు నోటిఫికేషన్ ఇవ్వగానే సిఆర్‌డిఏ సమీకరణ ప్రక్రియ చేపట్టనుంది. 2015లో తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలో ప్రస్తుత రాజధానిగా నిర్ణయించిన ప్రాంతంలో సమీకరించిన భూముల్లో రైతులకు ఇప్పటి వరకూ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వలేదు. కొత్తగా మరోసారి పూలింగు అంటే రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇన్నర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాలతోపాటు, ఎర్రుపాలెం, నంబూరు రైల్వేలైన్‌కు అవసరమైన భూములను కలిపి సమీకరణ చేయనున్నారు.

రాజధాని పరిసరాలల్లో స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు భూ సమీకరణ చేస్తామని, అభ్యంతరాలున్నా రైతులందరూ అంగీకరించినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా పూలింగ్ చేపట్టబోయే గ్రామాల్లో తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం, వడ్డమాను రెవెన్యూ గ్రామాలను పూర్తిగా చేర్చారు. హరిశ్చంద్రాపురంలో 2,429 ఎకరాలు, వడ్డమానులో 1,937 ఎకరాలను సమీకరించనున్నారు. పెదపరిమిలో 6,513 ఎకరాలు తీసుకోనున్నారు. అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురంలో 3,360 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167, కర్లపూడిలో 2,947, మోతడకలో 2,345, నిడుముక్కలలో 2,013 ఎకరాలు సమీకరణ కింద తీసుకోనున్నారు. తాడికొండ మండల పరిధిలో తాడికొండలో 12,797 ఎకరాలు సమీకరణ పద్ధతిలో తీసుకోనున్నారు. కంతేరులో 3,671, మంగళగిరి మండలం కాజలో 4,492 ఎకరాలు మొత్తం 44,676 ఎకరాలు సమీకరణ కింద తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే కార్యాచరణ ప్రారంభించేందుకు వీలుగా సిఆర్‌డిఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కట్టడి చేసిన అంబేద్కర్

>> రాజ్యాంగం పట్ల గౌరవభావం లేకుండా వ్యవహరిస్తుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితోనే ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని ప్రజలు కూలదేసారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ అంబేద్కర్‌ను అనేక విధాలుగా అవమానించారన్నారు. దేశంలో అరాచకశక్తుల కుట్రలను తమ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యలను అణివేస్తామన్నారు. ప్రధాని మోడీ ఎంపీగా పార్లమెంటులోకి అడుగుపెడుతుండగా అక్కడి మెట్లను మొక్కిన విషయం మరువకూడదన్నారు. రాజ్యాంగాన్ని పటిష్టం చేస్తూ ప్రధాని పనిచేస్తున్నారు. అంబేద్కర్ జన్మించిన ప్రాంతంలో అద్భుతమైన స్మారక కేంద్రం ఏర్పాటుకు, ఆయన బౌద్ధాన్ని స్వీకరించిన ప్రాంతాల్లో అంబేద్కర్ స్మారక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. బాబా రాజ్యాంగం రాసిన ఢిల్లీలోని భవనాన్ని, అంబేద్కర్ ఆర్థిక శాస్త్రం చదువుకున్న లండన్‌లోని భవనాన్ని కొనుగోలు చేసామన్నారు. మొత్తం అయిదు ప్రాంతాల్లో బాబా సాహెబ్ స్మారక కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. పార్లమెంట్ భవనంలో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటుకు భారతీయ జనతాపార్టీ పోరాటం సాధించి, విజయం సాధించామన్నారు. దక్షిణ భారతదేశంలో కూడా అధికారంలోకి వస్తామన్నారు. తమిళనాడు, తెలంగాణలో బిజెపి ప్రభుత్వాలు వస్తాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారు. అంబేద్కర్ ఉత్సవాలని ఎన్నో సంవత్సరాల నుంచి ఎంతో ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్నామన్నారు. అంబేద్కర్ జయంతి అనేది ఏప్రిల్ 14వ తేదీన కాకుండా ఒక 10 రోజులపాటు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని బిజెపి నిర్ణయించిందన్నారు. అంబేద్కర్ ఒక దళిత సామాజిక వర్గంలో జన్మించి అనేక ఒడిదుడుకులు ఎదురుకున్నారు. విద్యార్థి దశ నుంచి ఎన్నో అవమానాలకి గురయ్యారు. ఒక మేధావిగా ఆయన ఎదిగి అనేక పోరాటాలు చేసారు. బడుగు బలహీన వర్గాల్లో చైతన్యం నింపారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసారు.

**దేశ భక్తి కలిగిన వ్యక్తి అంబేద్కర్**

కమ్యూనిస్ట్ సిద్ధాంతాలని కాదన్నారని అంబేద్కర్‌ని ఓడించాలని, అవమానపర చాలని అనేక విధాలుగా ఇబ్బందులకి గురిచేసారు. స్వాతంత్ర ఉద్యమంలో అంబేద్కర్ కీలక పాత్ర వహించారు. అంబేద్కర్ ఎంపీగా పోటి చేస్తే ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేసారు. కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పి కొట్టి పార్లమెంట్‌కి పంపించేలా మేధావులు కీలక పాత్ర వహించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహరించింది. కాంగ్రెస్ అధికారాన్ని నిలుపుకోవడం కోసం రాజ్యాంగాన్ని అనుకూలంగా మార్చుకు న్నారు. రాజకీయ సంక్షోభం తీసుకురావాలని అత్యవసర పరిస్థితులు రావాలని కాంగ్రెస్ కోరుకునేది రాజకీయ స్వలాభం కోసం ఆనాడు కాంగ్రెస్ పాలన ఉండేది. మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన అంబేద్కర్ రాజీనామా చేసేలా కాంగ్రెస్ వ్యవహరించింది. అడుగడుగునా అంబేద్కర్ ని అవమానపరిచేలా కాంగ్రెస్ చేసింది. ఎన్నో కష్టాలుపడ్డ అంబేద్కర్ దేశం బలంగా ఉండాలి ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని కోరుకునేవారు. అంబేద్కర్ ఒక మేధావి అయినప్పడికి అనేక రకాలుగా కాంగ్రెస్ అవమానపరిచింది. మొదటి సారి ప్రధాని మోదీ ఎన్నిక అయినప్పుడు అంబేద్కర్ కి నివాళులు అర్పించి పార్లమెంట్ లోకి అడుగుపెట్టారు. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బిజెపి ప్రభుత్వం పని చేస్తుంది. రాజ్యాంగాన్ని మరింత శక్తీవంతంగా ఉండాలని మోడీ ప్రభుత్వం పని చేస్తుంది. రాజ్యాంగానికి గౌరవంఉండేలా మోడీప్రభుత్వంఉంటుంది. అంబేద్కర్ అంతిమ సంస్కారం చేసిన స్థలాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు.

# పాఠశాల విద్యలో సంస్కరణలు

>> చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 45 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే ఇక్కడ తరగతికి ఒక్క టీచర్‌ను కేటాయిస్తారు. రాష్ట్రంలో 294 హైస్కూల్ ప్లస్‌లు కొనసాగనున్నాయి. వీటిల్లో 1 నుంచి 12 లేదా 6 నుంచి 12 తరగతులు ఉంటాయి. గత సర్కార్ లో హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇంటర్మీడియట్ బోధనకు ఉపాధ్యాయులనే నియమించారు. దీంతో వీటిని పాఠశాల విద్యలోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కీలకం. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా ప్రతి స్కూల్‌లో ప్రవేశాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ నుంచి డిఇఒ, హెచ్‌ఎంలకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం ఉన్న దానికంటే 10 శాతం పెంపు ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి క్లస్టర్ పరిధిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ తక్షణమే చేపట్టాలని, దీని పర్యవేక్షణ బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొన్నారు. అంగన్వాడీ, డిఆర్‌డిఏ , గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమన్వయంతో డ్రైవ్‌ను క్లస్టర్ హెచ్‌ఎంలు నిర్వహించాలి. ప్రతి స్కూల్ ను హెచ్‌ఎంలు సందర్శించాలి. ప్రస్తుతం పిపి1 (ప్రీ-ప్రైమరీ1), పిపి2 చదువుతున్న చిన్నారుల డేటాను అంగన్వాడీ కార్యకర్తలు సేకరిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం ఆ చిన్నారులందరూ కచ్చితంగా ప్రభుత్వ స్కూళ్లలో ఒకటో తరగతిలో చేరేలా చర్యలు తీసుకోవాలి.

ఆయా గ్రామాల్లో ఉన్న 18 సంవత్సరాలలోపు వయసువారందరూ అంగన్వాడీ, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, యూపీ, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్, కెజిబివిలు, నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో ఎక్కడో ఒక చోట తప్పనిసరిగా చేరాలి. ప్రైవేటు స్కూళ్లకు మాత్రం వెళ్లకూడదు. సంవత్సరం పాటు పిల్లలను ట్రాక్ చేస్తూనే ఉండాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అర్హులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల పర్యవేక్షణలో ఉచితంగా బోధన ఉంటుందని తల్లిదండ్రులకు చెప్పి పిల్లలను చేర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



అలిపిరి నడకమార్గంలో యాత్రికుల లగేజీలను తనిఖీ చేస్తున్న పోలీసులు, ఘాట్‌లో లింకురోడ్డులో వాహనాల తనిఖీలు

# నడకదారుల్లో గట్టి నిఘా

## తిరుమలలో మఠాలు, విశ్రాంతి గృహాల్లో ఏకకాలంలో తనిఖీలు

**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు ఉన్న ఘాట్‌రోడ్డు మార్గంతోబాటు రెండు కాలినడక మార్గాల్లో తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం, ఆక్టోపస్ బలగాలు గట్టి నిఘా ఉంచాయి. ప్రత్యేక బృందాలతో యాత్రికులు బసచేసే గోగర్భమ్‌డ్యామ్ సమీపంలోని మఠాలలో, వసతిసముదాయాలు, విశ్రాంతి గృహాల్లో ఏకకాలంలో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ 24గంటలూ అణువణువూ నిశితంగా పరిశీలించి, యాత్రికుల పేరుతో గదుల్లో దిగిన, బసచేస్తున్న వారి వివరాలు, ఆధార్‌కార్డులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువ జామున 3గంటల నుండి అలిపిరి నడకమార్గం, 5గంటల నుండి శ్రీవారిమెట్టుమార్గాల్లో తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది బృందాలుగా విడిపోయి మెట్లమార్గంలో యాత్రికులను, వారి లగేజీలను తనిఖీ చేశారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడితో హిందూ పుణ్యక్షేత్రం తిరుమలపై కేంద్ర నిఘా వర్గాలు, రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ఫోకస్‌పెట్టింది. కొండకు వస్తున్న వారెవరు, వారి లగేజీలను నిశితంగా పరిశీలించిన తరువాత అనుమతి నిస్తున్నారు. తిరుమల ఆర్టీసి బస్టాండుతోబాటు అతిధిగృహాల్లో బసచేసిన వారి వివరాలను తెలుసుకుంటున్నారు. ఆయా విశ్రాంతి గృహాలు, అతిధిగృహాల్లో మేనేజర్లు, సిబ్బందికి పోలీసులు స్పష్టమైన సూచనలు, జాగ్రత్తలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ నేతృత్వంలో సిఐలు, ఎస్ఐలు, ఆక్టోపస్ బలగాలు, విజిలెన్స్ సిబ్బంది భారీసం ఖ్యలో బృందాలుగా విడిపోయి బాంబుడిస్పోజల్ టీమ్స్, పోలీసు జాగిలాలు, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేస్తున్నారు. తిరుమల అంతటా ఏకకాలంలో వందలసంఖ్యలో భద్రతా బలగాలు వేలాదిమంది యాత్రికుల కదలికలపై, లగేజీలపై డేగకన్నేసి తనిఖీలు కొనసాగిస్తు న్నారు. యాత్రికులు కూడా పోలీసులకు సహకరించాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద వస్తువులు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

**ప్రతి వాహనం అణువణువూ తనిఖీ:** ఉగ్రదాడితో తిరుమలను అప్రమత్తంచేసిన పోలీసు ఉన్నతాధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులు, టిటిడి విజిలెన్స్ అధికారులు శ్రీవారి దర్శనం కోసం వస్తున్న భక్తుల వాహనాలను, చివరకు ఆర్టీసి బస్సులను వాటిలోని సామాగ్రిని, భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ప్రయాణీకుల లగేజీలను స్కానింగ్ యంత్రాల్లో మరింత నిశితంగా పరిశీలన చేసిన అనంతరం తిరుమలకు పంపుతున్నారు. అలిపిరి నుండి తిరుమలలోని దేవదేవుని ఆలయం వరకు బాంబ్‌డిస్పోజల్ టీమ్ పోలీసులు, పోలీసు జాగిలాలు జల్లెడపడుతున్నాయి. శ్రీవారి ఆలయం నలువైపులా, ఆలయానికి ఎదురుగా ఉన్న గొల్లమండపంపైన ఏపిఎస్‌పి ,ఏఆర్ పోలీసులను మరింత అప్రమత్తం చేసి అలర్ట్‌గా ఉండాలని ఎప్పటికప్పుడు వాకీటాకీల ద్వారా హెచ్చరిస్తున్నారు. కొండపై సిసికెమెరాల పనితీరును మరింతగా అదనపు సిబ్బందితో నిఘా ఉంచి కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పటి ష్టం చేశారు. అక్కడి సిబ్బందితో నిరంతరాయంగా జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ, డిఎస్పీ, సిఐలు, రిపీటర్‌ల ద్వారా జాగరూకతతో వ్యవహరించాలని ఆదేశిస్తున్నారు. ముఖ్యంగా తిరుమలలో కల్యాణకట్ట, అన్నదానం కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్,వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి ఉద్యానవనాలు ప్రాంతాల్లో సిసికెమెరాలను మరింత క్షుణ్ణంగా పర్యవేక్షి స్తున్నారు. ఎక్కడైనా, ఎవరైనా అనుమానాస్పదంగా, కొత్తగా తచ్చాడుతున్నా క్షణాల్లో కనిపెట్టేలా సిబ్బంది అలర్ట్‌గా ఉన్నారు.

# తిరుమల సమాచారం

### ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు భారీ విరాళాలు

## ఇద్దరు దాతలు రూ.2కోట్లు అందజేత

**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న వివిధ ట్రస్ట్‌లకు దాతలు భారీగా విరాళాలందిస్తున్నారు. ఆదివారం ఉదయం సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్పొరేట్






సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)క్రింద 1.50కోట్ల రూపాయలు చెక్కును అందించారు. ఉదయం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి ఆ బ్యాంకు సంస్థ జోనల్ హెడ్ కె.ధారాసింగ్‌నాయక్, రీజనల్ హెడ్ ఈ.వెంకటేశ్వర్లు ఈ విరాళాలను అందజేశారు.

**రూ.50లక్షలు ఆపన్నహృదయ పథకానికి:** అలాగే తమిళనాడు చెన్నైకి చెందిన పాన్ ప్యూర్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండి ఎం.పొన్నుస్వామి, ఈడి ఎంపి సూర్యప్రకాశ్ 50లక్షలు రూపాయలు చెక్కును ఆదివారం అందజేశారు. ఈ విరాళాలను వెంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌లో బాగంగా వెంకటేశ్వర ఆపన్నహృదయ పథకానికి వినియోగించాలని దాత టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కోరారు.

## నగరవనంలో చెట్ల నరికివేతపై విచారణ

### విశ్రాంత పిసిసిఎఫ్ రాక

**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతి కపిలతీర్థం సమీపం లోని నగరవనం(దివ్యారామం)లో పచ్చనిచెట్లు నరికివేయడంపై ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. చెట్లునరకడం, ఆపై పర్యావరణానికి దెబ్బతీసేలా వ్యవహరించడం, కంచేను కూడా తొలగించడంపై సామాజిక మాధ్యమంలో వచ్చిన వార్తలతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. అసలు యాత్రాస్థలం తిరుపతిలో అటవీశాఖ పరిధిలోని దివ్యారామంలో చెట్లను ఎందుకు తొలగించారు?కంచే ఎందుకు తీసేశారనే కోణంలో విచారణ సాగనుంది. ఆదివారం ఉదయం విశ్రాంత పిసిసిఎఫ్ మల్లిఖార్జునరావు తిరుపతికి చేరుకున్నారు. అటవీశాఖ సరిహద్దుకంచే తీసేయడంలో వన్యప్రాణులు నగరరోడ్లపైకి వచ్చే ప్రమాదం ఉంది. తక్షణం మరమ్మతులు చేసి కంచే వేయాలని ఆదేశించారు. ఇందులో సీనియర్ సిటిజన్లు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడం,వాక్‌ట్రాక్ ఏర్పాటు కూడా ఉంది.

## హిట్ 3 విజయం సాధించాలని వేడుకున్నా

### శ్రీవారి దర్శనంలో సినీనటుడు నాని

**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తాజా చిత్రం హిట్ 3 విజయవంతంగా విడుదల కావాలని, ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు సినీనటుడు నాని తెలిపారు. ఆదివారం వేకువజామున తిరుమలేశుని సుప్రభాతసేవలో సినీనటుడు నాని, నటి శ్రీనిధిశెట్టి చిత్ర బృందంతో కలసి దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్ర సాదాలు అందజేశారు. ఇటీవల షూటింగ్ పూర్తి చేసుకున్న



హిట్ 3 విడుదలకు సిద్ధమైందని, చిత్రం విజయవంతం కావాలని కోరారు.

## మొదటిఘాట్‌లో వాహనం బోల్తా




**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుండి తిరుపతికి దిగుతున్న యాత్రికుల వాహనం మొదటి ఘాట్‌లో అదుపుతప్పింది. మొదటిఘాట్‌లో చివరన వినాయకుని ఆలయం వద్ద వాహనం టైర్ పేలడంతో బోల్తాపడింది. తుఫాన్ వాహనం బోల్తాతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. యాత్రికులు గాయాలతో బయటపడ్డారు. బాధితులను రుయాకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే అలిపిరి ఏవిఎస్ఒ ప్రభు తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని వాహనాన్ని క్రిందకు తరలించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎండ తీవ్రతకు వాహనం టైర్ పేలిందని డ్రైవర్ తెలిపారు. తిరుమలకు కాలం చెల్లిన వాహనాలను అనుమతించడం, యాత్రికులు ఆ వాహనాల్లో వస్తుండటంతో ఘాట్‌లో ప్రమాదాలకు గురవుతున్నాయని పోలీసులు తెలిపారు.

## 'కల్తీనెయ్యి' కేసులో కదిలిన 'సిట్'

### మరో ఇద్దరు నిందితులు కస్టడీలోకి

**తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో కీలక సూత్రధారులెవరని తేల్చేవిషయంలో సిబిఐ సిట్ మళ్ళీ దర్యాప్తు ప్రారం భించింది. ఈ కేసులో కల్తీ జరిగిందనే ఆరోపణలపై భోలేబాబాడెయిరీలో పనిచేసే ఆశిష్‌ను అరెస్టు చేయగా, ఆ డెయిరీకి చెందిన పుడ్ జిఎం హరిద్వార్, ఎ12 హరిమోహన్‌లను ఆదివారం సిట్ అధికారులు నెల్లూరు కోర్టునుండి కస్టడీకి తీసుకున్నారు. ఐదురోజుల పాటు వారిని తిరుపతి అలిపిరిలోని టిటిడి భవనంలో విచారణ చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు టెండర్లు, ఎలా కల్తీ చేశారు, ఎవరి ప్రమేయం ఉందనే అంశాలపై ప్రశ్నలు సంధించినా ముభావంగా సమాధానాలు చెప్పారనేది తెలుస్తోంది. ఇంకా నాలుగురోజులు వారిని కస్టడీలోఉంచుకుని కీలక సూత్రధారులను తేల్చేపనిలో నిమగ్నం కానున్నారు. లడ్డూతయారీలో నెయ్యిసరఫరా చేసిన డెయిరీలు కల్తీచేశాయనే నిర్ధారణకు సిబిఐ సిట్ అధికారులు కూడా వచ్చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో ట్విస్ట్‌ను వీడించి అసలైన వారిని పట్టుకోవాలని దూకుడు పెంచారు. "కల్తీనెయ్యి" కేసులో ఇంకా సస్పెన్స్ ఎందుకో!?




కీలక సూత్రధారులెవరో తేల్చేదెన్నడు?? అనే కథనం రెండురోజుల క్రిందట "వార్త"ప్రధానంగా ప్రచురించింది. గోప్యత పాటిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో టెండర్లు పిలిచి దక్కించుకుని ,అర్హత సామర్థ్యం లేకపోయినా నెయ్యిసరఫరా చేసేలా సహకారమందించిన వారెవరని తేల్చడంలో సిట్ అధికారులు ఇప్పటికే ఆధారాలు సేకరించినా మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది అనే కథనంతో సిట్ అధికారులు కదిలారు. కోర్టులో ఉన్న వారిని సిట్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఈ కల్తీనెయ్యి వ్యవహారంలో ఇప్పటికే ఆరుమంది పాత్రధారులను అరెస్టు చేసిన విషయం విదితమే.

## ఇండోనేషియా వర్సిటీతో ఎస్వీయూ ఒప్పందం

**తిరుపతి విద్య, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ఇండోనేషియా బాండుంగ్లో లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీతో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పలుఅంశాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.బోధన, పరిశోధన రంగాల్లో రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారం అంది పుచ్చుకోవాలని నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం వర్సిటీలో ఇండోనేషియా యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ మిత్ర డి జమల్ బృందంతో ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఇందులో భాగంగా రిజిస్ట్రార్ భూపతి నాయుడు నేతృత్వంలో జూలై నెలలో



ఇండోనేషియాలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం పర్యటించనుంది.మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సీకే జయశంకర్,ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు, ఇంటర్నేషనల్ డీన్ ప్రొఫెసర్ ఎస్ కిషోర్ బృందం ఇండోనేషియాలో పర్యటించనున్నారు.

## సత్వరం ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్లకు డిఎస్పీలు మే 5న చలో విజయవాడ

### రాష్ట్ర బహుజనసేన అధ్యక్షుడు చందు

**చిత్తూరు రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరంలో గుట్టు చప్పుడు కాకుండా 98 మంది ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్ల డిఎస్పీ పోస్టులను రద్దు చేసిందని రాష్ట్ర బహుజనసేన అధ్యక్షులు చందు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్ డిఎస్పీలు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంను పక్కాగా అమలు చేయడంతో పాట ఎస్సీ, ఎస్టీ బాధిత వర్గాలకు మెరుగైన సత్వర న్యాయం అందించడానికి, చట్టంను పటిష్టంగా అమలు చేయడానికి జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సుల మేరకు 2014 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీసు స్టేషన్ డిఎస్పీల వ్యవస్థ ఏర్పాటు అయ్యిందన్నారు. గత ప్రభుత్వం 2024 సంవత్సరంలో ఈ వ్యవస్థను రద్దు చేసినప్పటికి ఆపై రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభఉత్వానికి ఈ విషయం తెలిసినప్పటికీ దీని గురించి ఏ మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించకుండా చట్టంను నీరుకార్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తే తిరుగుబాటు ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై మే 5వ తేదీన ఎస్సీ, ఎస్టీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు, కలసివచ్చే రాజకీయ పార్టీలతో కలిసి విజయవాడ నడిబొడ్డున మహాధర్నా కార్యక్రమంను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బహుజనసేన కార్యదర్శి గోవిం దప్ప, చిత్తూరు జిల్లా అధ్యక్షులు సతీష్, ఉపాధ్యక్షులు కుమార్, నాయకులు హరివర్ధన్, బాలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం: మాజీ మంత్రి నాగార్జున

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కూటమి పాలకులు విద్యను నిర్వీర్యం చేస్తున్నారని వైకాంగ్రెస్ నేత,మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు చదువుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా అమ్మ ఒడి ద్వారా ప్రతీ తల్లి ఖాతాలో 15 వేల రూపాయలు జమచేశారని, ఏపీలో గొప్ప సంస్కరణకు జగన్ ఆధ్యుడని ఆయన తెలిపారు. చంద్రబాబు అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరుమార్చారని, ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ 15 వేలు ఇస్తామని ఊదరగొట్టారన్నారు. ఇంటింటికి వెళ్లినీకు 15 వేలు నీకు 15 వేలు అని చెప్పి నమ్మించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఖజానా ఖాళీ అయ్యిందని చంద్రబాబు చెబుతున్నాడన్నారు మేరుగ నాగార్జున. తల్లికి వందన పథకాన్ని ఇన్స్టాల్మెంట్‌లో ఇస్తామంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రతీ కుటుంబాన్ని ఆదుకుని చదివించిన జగన్‌ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఇచ్చిన మాట తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత జగన్‌ది అని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబు తీరు ఓడదాటే వరకూ ఓడ మల్లన్న దాటిన తర్వాత బోడిమల్లన్న అన్న చందంగ ఉందని, మంచినీరు దొరకడం లేదేమో కానీ ఏపీలో ముందు ఏరులై పారుతోందన్నారు. తల్లికి వందనం పథకానికి ఎలాంటి షరతులు పెట్టకుండా వెంటనే ఇవ్వాలని సామాజిక విప్లవంలో పేటెంట్ తెచ్చుకున్న జగన్ ఆలోచనలు అమలు చేయాలని ఆయన కోరారు. 72919 కోట్లను విద్య కోసం జగన్ మోహన్ రెడ్డి ఖర్చు చేశారని ఆయన అన్నారు.

## ప్రభుత్వ వైద్యకళాశాలలు, జిజిహెచ్‌లో పూర్తి స్థాయి నియామకాలు

**విజయవాడ,ఏప్రిల్27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలు, సర్వజన వైద్యశాలలు(జీజీహెచ్)ల్లో నియామకాలకు చర్యలు చేపట్టింది.సుదీర్ఘకాలం నుంచి పూర్తి స్థాయి సూపరింటెండెంట్లు లేని జీజీహెచ్‌ల్లో ఖాళీలను భర్తీ చేస్తోంది. కొత్త ప్రిన్సిపాళ్లు, సూపరిం టెండెంట్ల నియామకానికి సీఎంచంద్రబాబు ఆమోదం తెలిపారు. ఆంధ్ర వైద్యకళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవిని నియ మించారు. కాకినాడ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్‌ను, నెల్లూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేశ్వరిని నియమించారు. ఒంగోలు జీజీహెచ్‌కు కొత్త సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యం, శ్రీకాకుళం జీజీహెచ్ కు సూపరింటెండెంట్‌గా డాక్టర్ అమూల్య, తిరుపతి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ నియమితులయ్యారు. విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ తిజు రావుకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు. మచిలీ పట్నం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.మన్నథరావును నియమించారు. 8 మంది ప్రొఫెసర్లకు వైద్య విద్య అదనపు డైరెక్టర్ హో దాకు పదోన్నతి కల్పించారు.ఇదే సందర్భంలో పిపిపి ప్రాతిపదికన మెడికల్ కాలేజీల నిర్మాణం, రాయితీ ఒప్పందాలు, ఆర్ఎఫ్‌పీల పరిశీలనకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ కొద్దిరోజుల కిందటే ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో బోధనాసుపత్రుల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి కేపీఎంజీ కన్సల్టెన్సీ ఓ నివేదికను సమర్పించింది. ఈ నివేదికపై అధ్యయనంచేసి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకుగానూ ప్రభుత్వం ఈకమిటీని నియ మించింది. వైద్యారోగ్యకుటుంబసంక్షేమశాఖ కమిషనర్ నేతృత్వంలో కమిటీని నియమించారు. కమిటీలో సభ్యులుగా ఏపీఎంఎస్ఐడీసీ, ఎన్టీఆర్ వైద్యసేవాట్రస్టు, వైద్యవిద్యాడైరెక్టర్ తదితరులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువ డ్డాయి.ఈమేరకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు.

## వాయులింగేశ్వరుని దర్శనం కోసం జనం బారులు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెండు రోజులుగా భక్తులు కడలి తరంగాల్లా కదలి వస్తున్నారు. ఆలయాధికారులు ఆదివారం సాయంత్రం అందించిన సమాచారం మేరకు 30వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు ప్రారంభించినప్పటి నుంచి లేని విధంగా 8766 పూజలు జరిగాయి.స్వామి అమ్మవార్ల అభిషేకాలు 139 జరిగాయి. ఒక్కరోజు టిక్కెట్లు ద్వారా ఆలయానికి రూ.1.02కోట్లుకు పైగా వచ్చినట్లు సమాచారం. టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన భక్తులు 10442 మంది ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సందడి

**బస సదుపాయం ఓ సమస్య:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్దలతో వచ్చే భక్తులకు బస సదుపాయాలు ఓ సమస్యగా మారగా శని, ఆదివారాల్లో పొద్దుపోయాక వచ్చే భక్తులకు తిండికి తిప్పలు తప్పటం లేదు. అయితే శనివారం రాత్రి నుంచి సునామిలా భక్త జనం శ్రీకాళహస్తి చేరుకున్నారు. నెల రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల తాకిడి పెరుగుతుంది. తిరుమలేశుని దర్శనం సులభతరం చేయటంతో ఇంకా రద్దీ పెరిగింది.

**పార్కింగ్ కోసం తిప్పలు:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్ చేయటానికి ఎన్నో స్థలాలను కేటాయిస్తున్నా చాలటం లేదు. సన్నిధివీధిలో ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. కానీ ఎక్కడా నిలువ నీడ లేదు. ఎండలైతే తల మాడుపగలాల్సిందే. ఇలా భద్రత కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవస్థానం ముక్కుపిండి పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారు తప్ప వారికి కనీస సదుపాయాలే కల్పించాలనే ధ్యాస లేకపోవటం శోచనీయం. ఆదివారం ఉదయం నుంచి ఆలయానికి వచ్చిన ఇతరరాష్ట్రాల భక్తులు పడ్డ తిప్పలు వర్ణనాతీతం.

## సీనియర్ జర్నలిస్ట్ గరికపాటి శివకు జాతీయ అవార్డు

**విజయవాడ, ఏప్రిల్ 27,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక సేవకుడు, సీనియర్ జర్నలిస్ట్ గరికపాటి శివను నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ సంఘం ఘనంగా సత్కరించింది. రాజస్థాన్ రాష్ట్రం బికనీర్ లో దేశం శాంతి,ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మీడియా సంఘటితంగా పోరు నిర్వహణ, జర్నలిస్టులపై దాడులు, వారికి నెలవారి పెన్షన్లు, వైద్యసేవలకు పరిమిత తొలిగింపు, పాత్రికేయులపై దాడు వంటి అంశాలపై జాతీయ కార్యవర్గ సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో సామాజికంశాలపై ఎలక్ట్రానిక్ రంగంలో పరిష్కారాన్ని నిర్దేశించే కథనాలను అందించినందుకు శివకు అవార్డును అందించారు.ఎన్ యూ జే (ఐ) సంఘ జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ, సెక్రటరీ జనరల్ త్రివిధ నారాయణ , మహిళా కార్యదర్శి అభినయ నిఘాయన్ చేతులమీదుగా రాజస్థాన్ సాంప్రదాయంలో శివను ఘనంగా సన్మానించారు. సంఘ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్, సింహాద్రి కృష్ణ ప్రసాద్, బద్దం సుమలత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిటికి నిధుల కొనసాగింపు బాధ్యత చంద్రబాబుదే

### ప్రధాని, సీఎంకు లేఖ రాసిన వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త బ్యూరో:** కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకమైన చొరవ తీసుకుని ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్ఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్) రిజిస్ట్రేషన్‌లు పునరుద్దరించడంలో చొరవ తీసుకోవాలని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ. ఎన్నో దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సాధికారత, క్రీడల అభివృద్ధిలో ఆర్డిటి సంస్థ కీలకంగా పని చేస్తోందన్నారు. అనంతపురం జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలో ఆర్డిటి సంస్థ పలు సేవలను అందిస్తోందన్నారు. దాదాపు 3,500 గ్రామాలలో గ్రామీణ అభివృద్ధి, కుటుంబాల ఆదాయం పెంచే పనులు చేస్తూ ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన 4.5 లక్షలకుపైగా ప్రజలకు ఆర్డిటి సేవలు అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యను అందించడంతోపాటు పదే విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా బాసటగా నిలుస్తోందన్నారు. వీటితో పాటు ఆర్డిటి సంస్థ ఇప్పటి వరకు 84,791 మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. పార్టీలకు, మతాలకు సంబంధం లేకుండా దేశంలోని ఎంతో మంది ప్రముఖుల మన్ననలు ఆర్డిటి పొందిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆర్డిటి సంస్థ తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్న సేవలు తెలియనివి కావన్నారు. ఒక వేళ ఆర్డిటి విదులపై అభ్యం తరాలు ఉంటే ఏమిటో స్పష్టంగా చెప్పాలని అలా కాకుండా నిధులను అడ్డుకునే ప్రయత్నం చేయడం సమంజసం కాదన్నారు. ఎఫ్‌సిఆర్ఏ పునరుద్ధరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను ఈ సందర్భంగా మీడియాకు ఆయన విడుదల చేశారు. అంతేకాకుండా ఆర్డిటి సేవలను వివరిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సైతం ఆయన వివరించారు.



పిఎం, సీఎంలకు రాసిన లేఖను చూపుతున్న అనంత వెంకటరామిరెడ్డి

వార్త

ఏ కాలంలోనైనా, ఏ జాతికైనా దాని భవిష్యత్తు ఇరవై ఐదేళ్లలోపు వయసున్న యువకుల భావాలపైనే ఉంటుంది.

-కార్లయిల్

# విషమిస్తున్న విష సంస్కృతి!

ఆటపాటల్లో వైద్య, విద్య సాంకేతిక రంగాల్లో దేశ యువత ఎంతో కీర్తి ప్రతిష్టలు సంపాదించి భారత్‌ను ప్రపంచ పటంలో విశిష్టస్థానంలో ఉంచుతున్నదని ఒకపక్క సంతోషిస్తుంటే మరొకపక్క అనైతిక కార్యక్రమాలకు మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, వ్యాపారాలకు దేశాన్ని అడ్డాగా మారుస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతుంది. దేశంలో ఇటీవల పట్టుబడుతున్న మాదకద్రవ్యాల విక్రయాలు అక్రమ మద్యం సరఫరాలతో పెరుగుతున్న నేరాలు దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నాయనే విమర్శలను కొట్టివేయలేం. ఈ వ్యాపారంలో కీలకపాత్ర వహిస్తున్న నైజీరియన్లు పట్టుబడుతున్నప్పుడు ఎందరి పేర్లో వెలుగులోకి వస్తున్నాయి. అయితే సరైన సాక్ష్యాలు లేకపోవడంతో వెల్లడించలేకపోతున్నారు. మానవ సమాజాన్ని కాటేస్తున్న ఈ మాదకద్రవ్యాల వ్యాపారం దేశవ్యాప్తంగా చాపకింద నీరులా విస్తరించిపోతుందన్న విషయం ఏనాడో గుర్తించారు. దీన్ని అడ్డుకొని కట్టడి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలుఅంతగా సఫలీకృతం కావడం లేదు. గంజాయి లాంటి మత్తుపదార్థాల ఉత్పత్తి తెలుగు రాష్ట్రాల్లో భారీగానే జరుగుతున్నాయి. ప్రధానంగా ఖమ్మం, వరంగల్‌తోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల్లో సాగు పెరిగిపోతున్నట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో కొందరి రాజకీయ నాయకుల పాత్ర ఉన్నట్లు కూడా ఆరోపణలు వచ్చాయి. ఇక కొకైన్ బ్రౌన్‌షుగర్, చెర్రిస్ వంటి మాదకద్రవ్యాల వినియోగం అదుపులేకుండాపోతున్నది. గతంలో ఎక్కడో మూలనో, సందుగొందుల్లో రహస్యంగా ఈ వ్యాపారం జరిగేది. మాదకద్రవ్యాలు విక్రయించేవారు కానీ, వాడకందార్లు కానీ పోలీసులంటే హడలెత్తిపోయేవారు. పట్టుబడితే జీవితకాలం జైలులోనే ముగిసిపోతుందని భయపడేవారు. రానురాను పోలీసులన్నా, ఎక్సైజ్ అధికారులన్నా భయభక్తులు సన్నగిల్లడం, చట్టంలోని లొసుగులతో తప్పించుకోవడం సులభం అనే భావన పెరిగిపోవడంతో క్రమేపీ ఒక వ్యూహం ప్రకారం వాడకందార్లను పెంచుకుంటున్నారు. ఈ వ్యాపారం లాభసాటిగా మారిపోవడంతో యువత ఇందులో ప్రవేశిస్తున్నది. గతవారంలో హైదరాబాద్‌లో మత్తుకోసం ఏకంగా నొప్పి మాత్రలతో తయారు చేసి అమ్ముకునే ముఠా ఒకటి హైదరాబాద్, బాలాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఈ ఇంజెక్షన్ తీసుకున్న ముగ్గురిలో ఒక మైనర్ బాలుడు ఇంటికి వెళ్లి తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. తల్లికి తాను మత్తు ఇంజెక్షన్ తీసుకున్నానని చెప్పడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న సమయంలో మరణించాడు. మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మత్తు పదార్థాలు తయారు చేసిన మరొక యువకుడితోసహా మాత్రలు విక్రయించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మొన్న మంగళవారం ఖమ్మం నగరంలో ఏకంగా ఐదువేల కిలోలకుపైగా గంజాయి చాక్లెట్లను ఆబ్కారీ పోలీసులు పట్టుకొని అమ్ముతన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇవి ఎక్కడ తయారు అవుతున్నాయి? ఎవరు సరఫరా చేస్తున్నారు? తదితర విషయాల కోసం దర్యాప్తు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మత్తుతో తయారు చేసిన చాక్లెట్లు పెద్ద ఎత్తున సరఫరా అవుతున్నట్లు ఇటీవల తరుచుగాబయట పడుతున్నది. పోలీసులు పట్టుకుంటున్నా పాత్రధారుల వరకే పరిమితమవుతున్నారు. సూత్రధారులు బయటపడడం లేదు. మాదకద్రవ్యాల వినియోగాన్ని, వ్యాపారాన్ని నిరోధించడంలో పాలకులు విఫలమవుతున్నారనే ఆరోపణలను కొట్టివేయలేం. అనర్థాలన్నింటికి మాదకద్రవ్యాలతో పాటు మద్యం కూడా కీలకపాత్ర వహిస్తుందనేది కాదనలేని వాస్తవం. కానీ ప్రభుత్వాలకు మద్యం ఆదాయమే మహాప్రసాదంగా మారిపోయింది. యేడాది యేడాదికి పెంచుకుంటూపోతున్నారు. మద్యం వ్యాపారుల మధ్య పోటీపెట్టి రుసుము పెంచుకోవడంతో పెట్టిన పెట్టుబడి తిరిగి రాబట్టుకునేందుకు కొందరు మద్యం వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించేందుకు రకరకాల పద్ధతులను అవలంబిస్తున్నారు. అందులో భాగంగా ఎక్కువ కిక్ ఇచ్చేందుకు మద్యంలో, సిగరెట్‌లలో మాదకద్రవ్యాలను నింపి అందిస్తున్నారు. ఈ మాదకద్రవ్యాల మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియకుండాపోతున్నది. ఉన్నత చదువులు చదువుతన్న విద్యార్థులు కూడా ఈ మాదకద్రవ్యాల మత్తులో ఎలా వ్యవహరిస్తున్నారో రోడ్ల మీదనే ఘర్షణలు పడుతున్న సంఘటనలు అద్దంపడుతున్నాయి. పండుగల సందర్భంగా కొందరు పబ్ యజమానులు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న నృత్యాలు, వెకిలి చేష్టలు విషసంస్కృతికి పరాకాష్ఠగా భావించవచ్చు. ఈ విష సంస్కృతి నగరాల్లోనే కాదు పట్టణాలు దాటి క్రమేపీ జిల్లాలకు మండలాలకు చివరకు గ్రామాలకు కూడా విస్తరిస్తున్నది. గ్రామీణ జనజీవన స్రవంతిలో భాసిల్లుతున్న మన సంస్కృతి సంప్రదాయాలు ఈ నాగరికత వెల్లువలో కొట్టుకుపోతున్నాయి. వాటి స్థానంలో డిస్కో, కేబరే, క్లబ్‌లు రికార్డు డ్యాన్స్‌లు ప్రత్యక్షమవుతున్నాయి. ఇందులో మాదకద్రవ్యాలు చోటు చేసుకుంటుండడంతో యువత బలైపోతున్నది. ఈ నేరాలు పెరగడానికి ఈ విష సంస్కృతి కూడా ఒక కారణమని అధికార వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. దీనిని రూపుమాపేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు నడుం కట్టాల్సిన తరుణమిది.

నొప్పించేమాటలు, అసూయ, దురాశ, కోపం వంటి దుర్లక్షణాలు మానండి. అదే న్యాయ సంగతమైన మార్గం అవుతుంది.



తిరుక్కురళ్

దేశానికి గాని, సమాజానికిగాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.



అంబేద్కర్

# పహాల్గాం ఘటన ఓ హెచ్చరిక!

**స్వాతంత్య్రం వచ్చిన కొత్తల్లో మతపరంగాకాశ్మీర్ ప్రజలను తమవైపు తిప్పుకోవాలని పాకిస్తాన్ ప్రయత్నించిన మాట నిజం. అందులో భాగంగానే కాశ్మీర్ పండితుల మీదదాడులు ముమ్మరం చేసి మిలిటెంట్లు వారిని కాందిశీకులుగా కొన్నేళ్లు మార్చగలిగారు. తర్వాత కాశ్మీరు వాసులు ఆర్థికాభివృద్ధితో పాటు స్థిరత్వాన్ని పొందటంతో పాక్ ఉగ్రవాదం మతవాదం మిలిటెంట్లను, ఉగ్రవాదులను భారతదేశంలోకి పంపటం, నిఘా వ్యవస్థల తోడ్పాటుతో మిలటరీ చర్యలతో కొంతవరకు సద్దుమణిగా యి. పాకిస్తాన్ ఆర్థికంగా, రాజకీయ అస్థిరత్వంతో బలహీన పడటంతో దేశప్రజలు ఆ పాలకుల మీద నమ్మకాన్ని కోల్పో తున్నారు. ప్రక్కనున్న భారతదేశ ప్రగతిని బాహాటంగానే మెచ్చుకునే పరిస్థితి ఏర్పడటంతో గత్యంతరంలేక పహల్గాం లాంటి సంఘటనలను ఉగ్రవాదుల ద్వారా సృష్టిస్తున్నారు. ఇక ఈ ఎత్తుగడలకు కాలం చెల్లిందని పాక్ ప్రవర్తన మార్చుకోక తప్పదని త్వరలోనే తెలిసివస్తుంది. భారత ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటూ ఎప్పుడూ అప్రమత్తంగానే ఉండాలి.**



రావులపాటి సీతారాంరావు

శ్రీనగర్‌లోని అన్ని పక్షాలనూ, ప్రజలనూ దగ్గరకు తీసుకొని కేంద్ర ప్రభుత్వం టెర్రరిస్టులను ఆ ప్రాంతాలలో ఏకాకులను చేస్తేనే ఆశించిన ఫలితాలు రాబట్టవచ్చు! ఈ మధ్యకాలంలో ఎవరు ఏమి రాజకీయంగా మాట్లాడినా జమ్మూకాశ్మీర్‌ల లోని ప్రజలు వారి భవిష్యత్తు భారత దేశంతోనే ముడిపడి ఉందన్న నమ్మకాన్ని క్రమేపీ దృఢపర్చుకుంటున్నారు. నిన్నగాక మొన్న వెలువడిన సివిల్ సర్వీసు పరీక్షలలో ఎన్నడూ లేనివిధంగా ఈ ప్రాంతాలలోని అభ్యర్థులు ఉత్తీర్ణమవటం, యువత వారి భవిష్యత్తు కోసం భారత్‌వైపే మొగ్గుచూపుతున్నదని తేటతెల్లమవుతున్నది. మారణకాండ జరిగిన పహల్గాంలో ఒక ముస్లిం యువకుడు పర్యాటకులను కాపాడటం కోసం ప్రాణాలు ధారపోయటం ఎవరూ మర్చిపోలేరు. ఉగ్ర క్యాంపులను పూర్తిగా తుడిచిపెట్టాలి. కేంద్రం ఏచర్య తీసుకున్నా మద్దతు ఇస్తాం. ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడుదాం అని అఖిల పక్ష సమావేశం ప్రకటించడం దేశంలో ఎలాంటి విభేదాలూ, పొరపొచ్చాలు పాక్‌పై పోరాటం చేయడంలో లేవని ప్రపంచానికి చాటి చెప్పినట్లయింది. అంతమొందించేందుకు ఎంత వరకైనా పోతాం, ఆ ఉగ్రవాదులు భూమిమీద ఎక్కడదాక్కున్నా పట్టుకుంటాం అని ప్రధాన మంత్రి చెప్పడం, ప్రజావాణిని వినిపించినట్లయింది. సిమ్లా ఒప్పందం నిలిపివేతతోపాటు మరికొన్ని చర్యలు వాఘా బార్డర్ మూసివేత, వాణిజ్యం నిలిపివేత, వీసాల రద్దు, సింధూజలాల ఒప్పందం రద్దులాంటి చర్యలు నైతిక స్థైర్యాన్ని పెంచటంతోపాటు, ప్రభుత్వం రాజీలేని పోరాటం పాక్‌తో చేయబోతున్నదని స్పష్టపర్చినట్లయింది. నిఘా వైఫల్యంపై విచారణ జరిపే విషయంలో అనవసరపు ప్రచారాలూ, ఆర్భాటాలూ, పనికి రావు. ఇలాంటి 'ఇంటెలిజెన్స్' చర్యలు గుట్టుచప్పుడుకాకుండా చేస్తేనే అసలు రహస్యాలు బయటకువస్తాయి. అయితే పర్యాటకులకు భద్రత విషయంలో అన్నికట్టుదిట్టమైన చర్యలు ప్రతి పర్యాటకుడికి ధైర్యం కలిగించే రీతిలో కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటేనే పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ఈ విషయంలో ఆర్థిక కట్టుబాట్లు, సత్వరం తొలగించి అన్ని విధాలా కాశ్మీర్‌లో నార్మలసీ వచ్చిందనే అభిప్రాయం కలిగిస్తేనే కాశ్మీర్ ఆర్థికంగా కూడా కోలుకోగలదు. ఎటుచూసినా, పారామిలటరీ లోకల్ పోలీసులతోపాటు సైనిక దళాలు కనిపించే విధంగా భద్రతా చర్యలు తీసుకుంటేనే పర్యాటకులకే కాదు, అక్కడి సామాన్యులకు కూడా ధైర్యం కలుగుతుంది. పర్యాటకుల మతాన్ని బయటపెట్టి పహల్గాంలో జరిపిన దారుణమారణకాండ విద్వేషాలను భారతదేశంలో రెచ్చగొట్టటానికే! ఆ కుయుక్తుల వలలో పడకూడదు, సమైక్యత నినాదంతో భిన్నత్వంలో ఏకత్వం కలిగివున్న దేశంగా అన్ని విధాలా ప్రవర్తించటమేకాకుండా ఆచరణలో కూడా ఆ పరిణామాన్ని అన్నివిధాలా చూపించగలుగుతే ఉగ్రవాదులను, సైనిక దళాల అవసరం లేకుండానే సామాన్య ప్రజానీకం కూడా జల్లెడ పట్టినట్లు వారిని ఏరిపారివేసే సమర్థత సంపాదించుకోగలదు. ఆరోజు కోసం దేశ ప్రజలతోపాటు ప్రభుత్వాలు శక్తివంచన లేకుండా ప్రయ



త్నించక తప్పదు. పాక్ ఆర్మీ చీఫ్ అనవసరపు ప్రేలాపనలకు జీవితాంతం క్రుంగిపోక తప్పని పరిస్థితి కల్పిస్తే పాక్ ఆర్మీ చవకబారు ఎత్తుగడలకు మంగళం పాడినట్లవుతుంది. టూరిజం మీద ఆధారపడిన కాశ్మీర్ ప్రజలను పాల్గాం సంఘటన దెబ్బతీసింది. జీవనాధారాన్ని ఈ విధమైన ఉగ్రవాదుల దుశ్చర్యలతో కోల్పోవటం కాశ్మీరు వాసులు సహించలేరు. అన్నం ఉంటేనే మతం మదిలో మెదులుతుంది. కడుపు మీద కొట్టి సహకారం తీసుకోవాలనే పాక్ ప్రభుత్వ దుర్బుద్ధికి పేదల మతం, ప్రజలమతం 'ఆకలి' అనేది నిర్దుష్టంగా కాశ్మీర్ ప్రజలే తెల్పగలరు. ఆకలి ఒక్కటే కాదు, సుపరిపాలనతోబాటు దేశభక్తి, అనుబంధం, ఏ దేశవాసులకైనా ముఖ్యం అనేది చెప్పకనే చెప్పగలరు. ఇవన్నీ మృగ్యమవుతున్న పాక్ వైపు కాశ్మీరు వారు కన్నెత్తి చూసే ప్రసక్తే లేదని ఇప్పటికైనా దేశవిభజన జరిగి ఇన్నేళ్ల తర్వాతైనా పాకిస్థాన్ గుర్తించి బుద్ధిని మార్చుకొని బుద్ధిగా ఉంటేనే ఆ దేశానికి మేలు జరుగుతుంది. ఇప్పటికే ఆ దేశంలో ఇమడలేక బంగ్లాదేశ్ బయటకు వచ్చింది. బెలూచిస్థాన్ కూడా రేపోమాపో స్వతంత్ర దేశంగా మారిపోయినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. అరబ్బు దేశాలు, ముస్లిం దేశాలు ఒక్కొక్కటి పాకిస్థాన్ కుటిలనీతిని, చైనాతో ఆర్థిక సహాయం కోసం ఆమాటకొస్తే అన్ని దేశాలతోటి కేవలం లాభాపేక్షతోనే మతాన్ని అడ్డుపెట్టుకుని స్నేహం చేస్తుందని, ఇప్పటికే బహిర్గతం అవటంతో పాక్‌కు దూరంగా దేశాలు జరుగుతున్నాయి. దేశంగా ఏకాకి దశను పొందే రోజు త్వరలో పాకిస్థాన్ కు వచ్చినా ఎవరూ సానుభూతి కూడా చూపని పరిస్థితిని ఆ దేశమే కల్పించుకుంటున్నది. ఎవరు మాత్రం ఏం చేయగలరు? అమెరికా వైస్ ప్రసిడెంట్ మనదేశ పర్యటనలో ఉన్న ప్పుడు ఈ ఘటనకు తలపడటానికి కారణం జమ్మూకాశ్మీర్ కు స్పెషల్ స్టేటస్ లేకపోయినా, నార్మలసీ ఆర్థికాభివృద్ధి కాశ్మీరు సాధించింది అన్న నిజాన్ని అదేం లేదని ప్రపంచానికి చాటి చెప్పడానికి వేసిన ఎత్తుగడగా ఇతర దేశాలు గ్రహించగల్గాయి. అందుకే అన్ని దేశాలు భారతదేశానికి జరిగిన సంఘటనకు విభ్రాంతి ప్రకటించడంతోపాటు సానుభూతిని కూడా మరుక్షణమే తెల్పాయి. ఇది గమనించిన పాకిస్థాన్ సరిహద్దులలో క్షిపణుల ప్రయోగంతోపాటు లైన్‌ఆఫ్ కంట్రోల్ (ఎల్.ఓ.సి) దగ్గర చొరబాట్లు చేసే అలజడిని ప్రయత్నాలను కూడా భారతసైన్యం పారామిలటరీ దళాలు త్రిప్పి కొట్టడంతో దిక్కుతోచని స్థితిలో యుద్ధ వాతావరణాన్ని సృష్టించడానికి ఎత్తుగడలు వేస్తున్నది. అయితే భారతదేశ పౌరులు, కాశ్మీర్‌వాసులతో సహా ఉగ్రవాదాన్ని ఎదుర్కోటానికి సిద్ధంగా ఉన్నారు. 1990 నుంచి ఏదోరకమైన అలజడిని సరిహద్దు ప్రాంతాలతో పాక్‌తోబాటు మిలిటెంట్లు సృష్టిస్తున్నప్పటికి మన సైన్యం, తేలిగ్గానే త్రిప్పికొట్టున్నది. స్వాతంత్య్రం వచ్చిన కొత్తల్లో మతపరంగా కాశ్మీర్ ప్రజలను తమవైపు తిప్పుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నించిన మాట నిజం. అందులో భాగంగానే కాశ్మీర్ పండితుల మీదదాడులు ముమ్మరం చేసి మిలిటెంట్లు వారిని కాందిశీకులుగా కొన్నేళ్లు మార్చగలిగారు. తర్వాత కాశ్మీరు వాసులు ఆర్థికాభివృద్ధితో పాటు స్థిరత్వాన్ని పొందటంతో పాక్ ఉగ్రవాదం మతవాదం మిలిటెంట్లను, ఉగ్రవాదులను భారతదేశంలోకి పంపటం, నిఘా వ్యవస్థల తోడ్పాటుతో మిలటరీ చర్యలతో కొంతవరకు సద్దుమణిగాయి. పాకిస్థాన్ ఆర్థికంగా, రాజకీయ అస్థిరత్వంతో బలహీన పడటంతో దేశప్రజలు ఆ పాలకుల మీద నమ్మకాన్ని కోల్పోతున్నారు. ప్రక్కనున్న భారతదేశ ప్రగతిని బాహాటంగానే మెచ్చుకునే పరిస్థితి ఏర్పడటంతో గత్యంతరంలేక పహల్గాం లాంటి సంఘటనలను ఉగ్రవాదుల ద్వారా సృష్టిస్తున్నారు. ఇక ఈ ఎత్తుగడలకు కాలం చెల్లిందని పాక్ ప్రవర్తన మార్చుకోక తప్పదని త్వరలోనే తెలిసివస్తుంది. భారత ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటూ ఎప్పుడూ అప్రమత్తంగానే ఉండాలి. •

# పటిష్ట ప్రజారోగ్య వ్యవస్థ అవశ్యం

సంపతి రమేష్ మహారాజ్

ఒక దేశాభివృద్ధికి పటిష్టమైన విద్య, వైద్య రంగాలు మూలస్తంభం లాంటివి. వాటిని విస్మరిస్తే దేశాల పురోగతి శూన్యం. మానవ వనరుల వృద్ధి కూడా జరగదు. నేటి ఆధునిక కాలంలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో వచ్చినప్పటికీ పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య భద్రత ప్రమాదంగా మారింది. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో ఆరోగ్యం స్పృహ కొరవడడం, ప్రజల ఆర్థిక స్థితి దిగజారిపోవడం. కావున ఆరోగ్య సమస్యలకు కారణాలను తెలుసుకుంటూ సరైన చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మానవాళి తీవ్ర ఆరోగ్య ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉంది. ఆరోగ్య సమస్యలకు తొలి దశలోనే చర్యలు చేపట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వృద్ధుని వరకు వయసుతో నిమిత్తం లేకుండా అనేక వ్యాధులు చుట్టూ ముడుతున్నాయి. ముఖ్యంగా జీవనశైలి లేదా అసంక్రమిత వ్యాధులైన క్యాన్సర్, మధుమేహం, గుండెపోటు, రక్తపోటు కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. క్షయ, న్యూమోనియా, కలరా, టైఫాయిడ్, హైపటైటిస్, డెంగ్యూ, మలేరియా అమీబియాసిస్ లాంటి సంక్రామిత వ్యాధులు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. ఈ వ్యాధులు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మహమ్మారి కాలంలో కాలుష్యంతో క్యాన్సర్, ఆస్తమా, గుండె జబ్బుల తీవ్రత పెరిగిందని పలు అధ్యయనాల్లో తేలింది. జనాభా పెరుగుదల, పరిశ్రమలు వాహనాల కాలుష్యం రకరకాల రోగాలకు కారణం అవుతున్నాయి. మరోవైపు పోషకాహార లోపంఅనేది నేడు అత్యంత ప్రమాదకరంగా మారింది. స్త్రీలు, చిన్న పిల్లలు వీటి బారినపడి అనేక రోగాలకు గురికావడం జరుగుతుంది. ప్రస్తుతం ఆహార పదార్థాల కలుషితం సైతంప్రధాన సమస్యగా మారింది. పారిశుద్ధ్య వ్యవస్థలో భాగమైన స్వచ్ఛమైన తాగునీరు, మురుగునీటి వ్యవస్థ సరిగా అందకపోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికితోడు బిజీ జీవితంలో మానవుడు రోజురోజుకు శారీరక శ్రమకు దూరం కావడం వలన అనేక జీవనశైలి వ్యాధుల బారినపడుతున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కరోనా వంటి వ్యాధితో విశ్వమానవళి అల్లకల్లోలమైనది. సరైన వైద్యం అందక లక్షలాది ప్రాణాలు గాలిలో కలిశాయి. మానవ ఆరోగ్యంపై మరింత స్పృహని పెంచింది. అంతేకాకుండా వైద్య రంగంలో, మనుషుల జీవనశైలిలో పెను మార్పులు వచ్చాయి. అయినప్పటికీ ప్రతి ఏటా అంతుచిక్కని వ్యాధులతో ప్రజలు అసువులు బాస్తున్నారు. కావున ప్రతిదేశం ఆరోగ్య సంక్షోభాన్ని నివారించడానికి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. ముఖ్యంగా అధిక జనాభా గల భారత్ వంటి దేశంలో ఆరోగ్య స్పృహ మరింత పెరగాలి. దేశంలో ఎక్కడైనా ప్రతి పౌరుడికి నాణ్యతతో కూడిన ఉచిత వైద్య సేవలను పొందే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. గ్రామ ఆరోగ్యం, పారిశుద్ధ కమిటీలు క్రియాశీలకంగా పని చేసే విధంగా చూడాలి. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి. ప్రాథమిక జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో సరిపడ సిబ్బందిని , వైద్యులను నియమించాలి. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన పల్లె ,బస్తి దావాఖానాలలో మౌలిక సదుపాయాలు పెంచాలి. హాస్పిటల్‌లో అన్ని రకాల మందులను ఉచితంగా అందించాలి. శిశు సంరక్షణ గర్భిణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. వృద్ధాప్య సమస్యలకు ఉచితపరీక్షలు చేసి మందులివ్వాలి.క్యాన్సర్ వ్యాధులను గుర్తించేందుకు విరివిరిగా ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి. జనరిక్ మందులను అందుబాటులోకితేవాలి. కార్పొ రేట్ ఆసుపత్రుల నియంత్రణ, రోగుల హక్కుల రక్షణపై చర్యలు తీసుకోవాలి. వైద్యం అనేది ఒకవ్యాపారం కాకుండా సామాజిక బాధ్యత అనే స్పృహ ప్రతిడాక్టర్ కలిగి ఉండాలి. చిన్నపిల్లలు, మహిళల్లో ఎదురవుతున్న రక్తహీనత పౌష్టికా హార సమస్యను పరిష్కరించడానికి పోషణ్ అభియాన్ కార్య క్రమాన్నిపటిష్టంగా అమలుపరచాలి.అందరికీ ఉచితవైద్యాన్ని అందించే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని లక్ష్యసిద్ధితో ముందుకు తీసుకెళ్లాలి. •

# లారీ డ్రైవర్ల కష్టాలు తీరేదెన్నడు?

డి జె మోహన రావు

వ్యవసాయ రంగం తరువాత మన దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్నది రవాణా రంగమే. దేశాభివృద్ధికి ఈ రంగం వెన్నెముకలాంటిది. భారతీయట్రక్కింగ్ పరిశ్రమ మన ఆర్థిక వ్యవస్థకు ఒక బలమైన ఆధారం. ఇది మన జీడీపీలో ఆరు శాతానికి పైగా తోడ్పడుతూ లక్షలాది మందికి జీవనాధారంగా నిలుస్తోంది. ఈ కీలకమైన రంగంలో ట్రక్కు డ్రైవర్లు ఒక ముఖ్యమైన శక్తి వనరులు. మన దేశంలో సుమారు 80 లక్షల మందికి పైగా ట్రక్కు డ్రైవర్లు ఉన్నారని అంచనా. వారి సౌకర్యాలను మెరుగుపరచడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించడం నిజంగా అభినందించదగిన విషయం. 2025 నుండి కొత్తగా తయారయ్యే ఎన్2, ఎన్3 వర్గాల ట్రక్కుల డ్రైవర్ క్యాబిన్‌లో ఎయిర్ కండిషనింగ్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది. వేడి వాతావరణంలో డ్రైవర్ల అలసటను తగ్గించి వారి పని సామర్థ్యాన్ని పెంచాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2022 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం మన దేశం తన దేశీయ సరుకు రవాణాలో 70శాతం రోడ్డు మార్గం ద్వారానే నిర్వహిస్తోంది. భారతీయ రహదారులపై తిరిగే ట్రక్కుల సంఖ్య 2022లో 40లక్షలుండగా 2050 నాటికి అది 1కోటి 70 లక్షలకు చేరుకుంటుందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. రహదారి వాహనాల్లో ట్రక్కులు కేవలం 2శాతం మాత్రమే ఉన్నప్పటికీ మనదేశంలోని 28లక్షల ట్రక్కులు కలిసి సంవత్సరానికి 10 వేల కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తూ 460 కోట్ల టన్నుల సరుకును రవాణా చేస్తున్నాయి. ప్రస్తుతం వార్షిక రవాణా డిమాండ్ 2.2 ట్రిలియన్ టన్నుకిలో మీటర్లుగా ఉంది. ఇది 2050 నాటికి నాలుగు రెట్లు పెరిగి 9.6 ట్రిలియన్ టన్నుకిలోమీటర్లకు చేరుకుంటుందని అంచనా. రవాణా డిమాండ్ అనేది జనాభా, భూ వినియోగం, ఆర్థిక ప్రభావాలతో సహా వివిధ బాహ్య కారకాల కలయికతో ఏర్పడే ప్రయాణ అవసరాన్ని సూచిస్తుంది. రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల ప్రకారం, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలలో ట్రక్కులు కూడా ఒకటి. భారతదేశంలోని "రోడ్డు ప్రమాదాలు 2022 వార్షిక నివేదికలోని గణాంకాలను చూస్తే, 2022లోమొత్తం రోడ్డు ప్రమాదాలలో 32.9 శాతం (1,51,997), మొత్తం మరణాలలో 35.7 శాతం (55,571) జాతీయ రహదారులపైనే సంభవించాయి.కొంతమంది డ్రైవర్లు మద్యం లేదా వాహనాల అధిక బరువు వంటి అంశాలు ఈ ప్రమాదాలకు ముఖ్య కారణాలుగా ఉన్నాయి. జాతీయ రహదారులపై ట్రక్కు డ్రైవర్లు అనేక కష్టమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వారికి మంచి డ్రైవింగ్ అనుభవాన్ని, వారి జీవనోపాధిపై భరోసా ఇవ్వడం చాలా ముఖ్యం. ఈ డ్రైవర్లు తరచుగా సరైన ఆహారం, నిద్ర, విశ్రాంతి లేక చాలా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. చాలా మందికి వారి ట్రక్కే ప్రయాణంలో తాత్కాలిక ఇల్లు. ఈ రంగం ఎదుగుతున్నప్పటికీ, పరిష్కారానికి ప్రత్యే



క విధానం అవసరమయ్యే అనేక సంక్లిష్టమైన సమస్యలతో పోరాడుతోంది. జాతీయ రహదారులపై ప్రయాణించే ట్రక్కు డ్రైవర్లు తరచుగా తక్కువ సమయంలో సుదూర ప్రాంతాలకు సరుకు చేర్చాలనే ఒత్తిడికి గురవుతారు. దీనివల్ల వారు రోజుకు ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయాల్సి వస్తుంది. ఫలితంగా వాహనాల వేగం పెరుగుతుంది. పరిశోధనల ప్రకారం చాలామంది డ్రైవర్లు రోజుకు 14గంటల వరకు వాహనాలు నడుపుతున్నారు. ఇది ప్రమాదాల తీవ్రతను గణనీయంగా పెంచుతుంది. వారి నిరంతరాయమైన పని కారణంగా దాదాపు 50శాతం ట్రక్కు డ్రైవర్లు డ్రైవింగ్ సంబంధిత ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎక్కువసేపు కూర్చోవడం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సమయం లేకపోవడం లేదా వారికి అలవాటైన భోజనం అందుబాటులో లేకపోవడం వల్ల 70శాతం కంటే ఎక్కువ మంది డ్రైవర్లు పోషకమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. ఇది ఊబకాయం, ఎముకలు, కండరాల సంబంధిత రుగ్మతలు, అధిక రక్తపోటు, నిద్రలేమి, అధిక ఒత్తిడి స్థాయిలు, డీహైడ్రేషన్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు వారిని గురిచేస్తుంది. చాలా మంది స్థానిక భాష తెలియకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణంలో అనారోగ్యానికి గురైతే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన వైద్య సంరక్షణ పొందలేకపోతున్నారు. వాహనాలు మొరాయించినా లేదా ప్రమాదాలకు గురైనా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అంతేకాకుండా కొన్ని మార్గాల్లో దోపిడీలు సర్వసాధారణం. సరుకు దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయి. దురదృష్టవశాత్తు ఈ నేరాలను ప్రతిఘటించే డ్రైవర్లు హత్యకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. స్థానిక సమాజాల నుండి మద్దతు తరచుగా ఉండదు.ఇంటి నుండి ఎక్కువ కాలం దూరంగా ఉండటం అనేక మంది డ్రైవర్లలో మానసిక వేదనకు దారితీస్తుంది. యువత ఈ వృత్తిని స్థిరమైన కెరీర్‌మార్గంగా ఎంచుకోవడానికి వెనుకడుగు వేయడానికి ఇది ఒక కారణం. మన దేశంలో ట్రక్కు డ్రైవర్ సగటు వార్షిక జీతం సుమారు 3,14,600లేదా నెలకు 17,040,ఇది జాతీయ సగటు జీతం 72,900కంటే 19శాతం తక్కువ. ఈ రంగంలో అధికారికీకరణ ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉండటంవల్ల ట్రక్కింగ్ వాంఛనీయ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి అర్హత కలిగిన డ్రైవర్లకొరత ఇటీవలి కాలంలో ఈరంగాన్ని వేధిస్తున్న ఒక నిరంతర సమస్య. మన దేశంలో డ్రైవర్‌టూట్రక్ నిష్పత్తి ఇప్పటికీ 1000 ట్రక్కులకు 750 కంటే తక్కువగా ఉంది. దీని ఫలితంగా కొన్నిసమయాల్లో 25శాతం నుండి30శాతం ట్రక్కులు డ్రైవర్లు లేక పోవడంవల్ల ఖాళీగాఉండిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ట్రక్కు యజమానులను డ్రైవర్లకు నెలవారీ జీతంఇచ్చేలా ఒప్పించాలి. కనీస వేతన ప్రమాణాలను అమలుచేయాలి. రహదారులపై పెట్రోలింగ్‌ను పెంచడం ద్వారా డ్రైవర్లు తమ ప్రయాణాలలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించాలి. డ్రైవర్లకోసం జాతీయ రహదారులపై ప్రత్యేక విశ్రాంతిస్థలాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం. రాత్రిపూట బస చేయడానికి వసతి సౌకర్యాలు కల్పించాలి. ప్రతి 400 కిలోమీటర్లకు హైవేల వెంటవారి ప్రత్యేక అవసరాల కోసం ఆసుపత్రులను ఏర్పాటు చేయాలి. ప్రతి డ్రైవర్‌ను సమగ్ర ప్రమాదబీమా పరిధిలోకి తీసుకురావాలి. ఈ చర్యలన్నీ ఒకేసారి సాధ్యం కానప్పటికీ, డ్రైవర్లకు క్రమంగా సౌకర్యాలు కల్పిస్తే మనం నిస్సందేహంగా ఉన్నతమైన నాణ్యమైన సేవలను పొందగలం. •

# ప్రజావాక్కు



## ప్రభుత్వానికి అండగా ఉండాలి

కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాద ముస్లిం ముష్కరులు కావించిన మారణకాండ భారత్ దేశంతో బాటు అమెరికా మొదలైన దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో భారతదేశానికి అండగా నిలవగలమని హామీలిచ్చాయి. ప్రతీఉగ్రవాది జన్మలో చవిచూడని, ఊహించని రీతిలో బుద్ధిచెప్పగలమని ప్రధాని మోడి గారు బాధతో కోపంతో కఠినంగా మాట్లాడారు. పుల్వామా దాడి దరిమిలా చేసిన సర్జికల్ స్ట్రైక్ పాకిస్థాన్‌కు సరిపోయినట్టు లేదు. తమ దేశం మీద భారత్ ఎక్కడ దాడి చేస్తుందనే భయంతో పాక్ వణికిపోతోంది. ఉన్నత అధికారులతో మంతనాలు జరుపుతున్నది. పహల్గామ్ మారణకాండతో తమకు సంబంధం లేదని బుకాయిస్తున్నది. లష్కర్ ఇ తొయిబా జన్మస్థానం పాకిస్థాన్ కాదా? టెర్రరిస్టులనందరిని తుదముట్టించాలనే భారత ప్రభుత్వంతీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగినదే. ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వానికి సహకరించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సీనియర్లకు ఎక్కువ వేతనాలుండాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా శాఖకు సంబంధించి మే జూన్ నెలల్లో స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి టీచర్లకు ప్రమోషన్లుఇవ్వడానికి,ట్రాన్స్ఫర్లు చెయ్యడానికి ప్రభుత్వం సమాయత్తమవుతుంది. ఈనేపథ్యంలో ఎవరు ప్రాతినిధ్యం వారు చేస్తూఉన్నారు. ప్రమోషన్లు ఇప్పుడు ప్రాతిపదిక సీనియారిటీ అవ్వాలి కానీ గత కొన్ని దశాబ్దాలుగా అలా జరగడంలేదు. సీనియర్లకు ఎక్కువ వేతనం జూనియర్లకు తక్కువ వేతనం ఉండాలి. ఇలా జరగడానికి కారణాలు ప్రస్తుత ప్రభుత్వాధినేతలు, విద్యాశాఖ అధికారులు పరిశీలించి తగు న్యాయం చేయాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఉద్యోగుల రిటైర్మెంట్ పెన్షన్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. 20 సంవత్సరాలకు పైగా సర్వీసు పూర్తి చేసిన వారికి పూర్తి పెన్షన్ అనగా జీవితంలో సగంగతంలో వచ్చేది.10సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి కూడా సగం పెన్షన్ వచ్చే విధంగా సర్వీసులు లెక్కచేసి ప్రభుత్వ రిటైర్మెంట్ పెన్షన్ ఉద్యోగులకు ఇవ్వాలి. పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

## మిగులు టీచర్లను స్కూళ్లకే కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ కొత్తగా క్లస్టర్ అకడమిక్ టీచర్లవిధానం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. బదలీల అనంతరం మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను క్లస్టర్‌అకడమిక్ టీచర్లుగా గుర్తించి,వారిని కస్టర్లకు కేటాయించి, ఆ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లు సెలవు పెడితే వీరి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలుపుతోంది. రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా ఉన్నాయి. తెలంగాణాలో ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లను కేటాయిస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోమాత్రం ప్రాథమిక పాఠశాలలో బేసిక్ ప్రైమరీల్లో 20 వరకు ఒక టీచర్, ఫౌండేషన్ స్కూళ్లలో 30 వరకు ఒక టీచర్ మాత్రమే కేటాయిస్తున్నారు. మిగిలిన ఎస్జీటీ టీచర్లను బేసిక్ ప్రైమరీల్లో, ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండో టీచరుగా కేటాయించాలి. అప్పుడే విద్యార్థులకు మెరుగైన విద్య సాధ్యమవుతుంది.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## కల్తీని నిరోధించలేమా?

కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా అన్ని రాష్ట్రాల్లో ఆహార పదార్థాల కల్తీ విపరీతంగా పెరిగిపోతూ వున్నది. ముఖ్యంగా హోటల్స్, బేకరీలు,ఫ్రై సెంటర్స్‌లో ఎక్కువగా కల్తీ పదార్థాలు విక్రయిస్తు వున్నారు. ఆహార పదార్థాలల్లో రుచి కోసం రంగులు కలపడం,మసాలాలు అధికంగా వాడటం వల్ల అవి తిన్న వారికి జీర్ణావస్థలో మార్పులువచ్చి జీర్ణాశయం దెబ్బ తినడం, అల్సర్ల్, కాలేయ వ్యాధులు సంభవించి మృత్యువాతపడుతూ వున్నారు. సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడం వల్ల వారు ఇష్టానుసారం పదార్థాలు తయారు చేసి విక్రయిస్తు వున్నారు. కల్తీ ఆహార పదార్థాల సెంటర్‌ల మీద దాడులు చేసివానిని సీజ్ చేయాలి.

- కె. నాగరాజు, నల్గొండ

## మొక్కలకు పెంచాలి

మానవాళి ప్రతీ రోజూ కాలుష్యంతో పోరాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తూ, మొక్కల అవసరం తెలిసి కూడా వాటిని విచక్షణా రహితంగా కొట్టేస్తున్నారు. రోడ్లు వేస్తున్నారని, కాలువలు కడుతున్నారని, ఇతరత్రా అభివృద్ధి పనుల పేరిట వృక్షాలను నరికివేస్తున్నారు. వాటి స్థానంలో మరో చోటనైనా కొత్తమొక్కలు నాటడంలేదు.మనకు, భవిష్యత్తు తరాలకు మొక్కల అవసరం ఉందన్న సంగతి గ్రహించాలి.

-డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)





# మీపొలాలన్నీ ఖాళీచేయండి: పంజాబ్‌రైతులకు బిఎస్ఎఫ్ ఆదేశం

**అమృత్‌సర్, ఏప్రిల్ 27:** భారత్ పాకిస్థాన్ మధ్య భీకర యుద్ధం మరో రెండు రోజుల్లోనే ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇండియా పాక్ బోర్డర్ వెంబడి ఉన్న పంజాబ్ రైతుల పొలాలను వెంటనే కోసేయాలని బీఎస్ఎఫ్ ఆదేశాలు జారీచేసింది. 48 గంటల్లో పొలాలు ఖాళీ చేయాలని పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ సూచనచేసింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధ సన్నాహాల్లో మునిగిపోయింది. త్రివిధ దళాలను రెడీ చేసింది. ఏ క్షణమైనా దాయాది దేశం పాకిస్థాన్ కు బుద్ధి చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో48 గంటల్లో జీరో లైన్ వెంబడి పొలాలను క్లియర్ చేయండి అని రైతులకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సూచించింది. సరిహద్దు భద్రతా దళం జీరో లైన్ వెంబడి ఉన్న రైతులకు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. వేలాది మంది పంజాబ్ రైతులు జీరో లైన్ వెంబడి సరిహద్దు ప్రాంతాలకు సమీపంలో తమ పొలాలను కలిగి ఉన్నారు. వారు పండించిన పంటలు ఇప్పుడు చాలా వరకూ చేతికందాయి. దీంతో వెంటనే పంటను కోసి ఇళ్లకు తెచ్చుకోవాలని, లేదంటే, నిలువెత్తు పంటల్లో విద్రోహులు దాక్కుని దాడి చేసే ప్రమాదముందని సదరు రైతులకు ఇచ్చిన నోటీసుల్లో బీఎస్ఎఫ్ దళం వివరణ ఇచ్చింది. ఇండియా పాకిస్తాన్ మధ్య 530 కి.మీ పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ఉంది. దీని వెంబడి దాదాపు 45,000 ఎకరాల భూమిని మన రైతులు సాగు చేస్తున్నారు. అమృత్‌సర్‌లోని రొడా వాలా ఖుర్ద్‌లోని స్థానిక గురుద్వారా కూడా బిఎస్ఎఫ్ నోటీసుకు సంబంధించి ప్రకటన చేసింది. రొడా వాలా ఖుర్ద్ మాత్రమే కాకుండా, తరన్‌తరణ్, ఫజిల్కా, ఫిరోజ్‌పూర్ జిల్లాల్లోని గ్రామాలలో ఉన్న గురుద్వారాలు కూడా ఇలాంటి ప్రకటనలు చేశాయి. గురుద్వారా రైతులు వీలైనంత త్వరగా పంటలు కోయాలని కోరుతున్నాయి. ఎందు కంటే యాక్సెస్ గేట్లు త్వరలో మూసివేయ బడతా యని ఆయా గురుద్వారాలు సరిహద్దు ప్రాంత రైతులను అప్రమత్తం చేస్తున్నాయి. పొలాల్లో ఏపుగా పెరిగిన పంటలు సరిహద్దులోకి చొరబడటానికి ప్రయత్నించే విద్రోహుల అడుగుజాడల్ని కనిపించ కుండా చేస్తాయి. జీరో లైన్ వెంబడి ఉన్న ప్రాంతాలు క్లియర్ గా ఉంటే, కీలకమైన ప్రాంతాల వెంబడి నిఘా పెంచుకునేందుకు మన భద్రతా దళాలకు వీలు చిక్కుతుంది.

# పేదరికంనుంచి 17.10 కోట్లమందికి విముక్తి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనలో భారత్ దూసు కెళ్తోంది. దశాబ్దకాలంగా దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది. గత పదేళ్లలో 17.10 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011-12లో దేశ జనాభాలో 16.2 శాతం ప్రజలు దుర్భర పేదరికం (రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయం)లో మగ్గిపోయారని, 2022-23 నాటికి ఆ సంఖ్య 2.3 శాతానికి తగ్గినట్టు ఓ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం దుర్భర పేదరికంతో బాధపడుతున్నవారు పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం నుంచి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. పేదలు క్రమేణా దిగువమధ్య ఆదాయ కేటగిరీలోకి మారుతున్నారు. అలాగే దిగువమధ్యఆదాయ కేటగిరిలో ఉన్నవారు మధ్య తరగతి ఆదాయ కేటగిరిలోకి వెళ్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 69శాతం నుంచి 32.5 శాతానికి, పట్టణాల్లో 43.5 శాతం నుంచి 17.2 శాతానికి తగ్గింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం 25 నుంచి 15శాతానికి తగ్గింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో భారత్ పురోగతి సాధిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. 2021-22నుంచి యువత కంటే వేగంగా ఉపాధి పెరుగుతోందని వెల్లడించింది. ముఖ్యంగా మహిళలు, గ్రామీణుల్లో స్వయం ఉపాధి పెరుగుతోందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పట్టణ నిరుద్యోగం 6.6 శాతానికి తగ్గిందని, 2017-18 నుంచి ఇదే అతి తక్కువ అని వెల్లడించింది. ఉపాధి కోసం గ్రామీణపురుషులు పెద్ద సంఖ్యలో పట్టణాల బాట పడుతున్నారని తెలిపింది. వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల ఉపాధి మెరుగుపడినట్టు పేర్కొంది. దేశంలో మహిళల ఉపాధిరేటు 31 శాతానికి చేరినట్టు వెల్లడించింది.



# ఢిల్లీలో ఐదువేల మంది పాకిస్థానీలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పహల్గాం దాడి ఘటన అనంతరం పాకిస్తాన్‌పై భారత్ కఠినంగా వ్యవహరిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో పాకిస్తానీలను స్వదేశానికి పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనేక రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ పౌరులను తిరిగి ఆ దేశానికి పంపే పనిలో పడ్డాయి. అయితే, దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 5వేల మంది పాకిస్తానీలు పౌరులు ఉన్నట్లుగా గుర్తించారు. భారత నిఘా విభాగం ఈ మేరకు జాబితాను ఢిల్లీ పోలీసులకు అందించింది. ఢిల్లీలో నివాసం ఉంటున్న 5వేల మంది పాకిస్తానీ పౌరుల జాబితాను ఐబీ ఢిల్లీ పోలీసులకు అందించి.. స్వదేశానికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నది. విదేశీయుల ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఈ జాబితాను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక శాఖకు అందించింది. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. జాబితాలో దీర్ఘకాలిక వీసాలు కలిగి ఉన్న, మినహాయింపు పొందిన హిందూ పాకిస్తానీ జాతీయుల పేర్లు సైతం ఉన్నారు. ఈ జాబితా ధ్రువీకరణ కోసం సంబంధిత జిల్లా అధికారులకు అందించి.. వారంతా స్వదేశానికి తిప్పి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్య, ఈశాన్య జిల్లాల్లో పాకిస్తానీ జాతీయుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేశామని ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించినట్లు ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.

పరిస్థితిని సీనియర్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లుగా తెలిపారు. ఢిల్లీలో నివసిస్తున్న ఈ పాకిస్తానీ పౌరుల గురించి సమాచారాన్ని సేకరించి, వీలైనంత త్వరగా భారతదేశం విడిచి వెళ్లేలా ఢిల్లీ పోలీస్, ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక శాఖ అధికారులు అప్పగించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం సార్క్ వీసాలను రద్దు చేసింది. ఇప్పటికే వీసాలపై భారత్‌కు వచ్చిన వారంతా మే ఒకటో తేదీ వరకు దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.

# అమెరికాలో విదేశీ విద్యార్థులకు గుడ్‌న్యూస్

## బహిష్కరణపై వెనక్కి తగ్గిన అధ్యక్షుడు ట్రంప్

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 27:** ఉన్నతవిద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. వారి వీసాలు/చట్టబద్ధ హోదాలను రద్దు చేస్తూ ఇటీవల తీసుకున్ననిర్ణయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనక్కి తగ్గారు. దీంతో 187 కళాశాలలకు చెందని 1200 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసాలు, చట్టబద్ధ హోదాలను అధికారులు పునరుద్ధరించారు. అయితే వీరిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడారు. మిగిలినవారిలో కొందరు రహస్య ప్రదేశాల్లో తలదాచుకున్నారు. ఇంకొందరు క్లాసులకు వెళ్లడం లేదు. తమ వీసాలరద్దుపై న్యాయస్థానాలను విద్యార్థులు ఆశ్రయించారు. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు వీసాలరద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించాయి. ఈ క్రమంలోనే ఇమ్మిగ్రేషన్‌లోనే ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాలను తాత్కాలికంగా పునరుద్ధరించింది.

# హోమ్‌ల్యాండ్‌సెక్రటరీ బ్యాగ్ చోరీచేసిన దుండగుడు

**వాషింగ్టన్,ఏప్రిల్ 27:** అమెరికాలో దేశ అంతర్గతభద్రతకు బాధ్యత వహించే డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్రటరీ క్రిస్టీ నియోమ్ ఖరీదైన బ్యాగ్‌ను ఒక దొంగ తస్కరించాడు.సుమారు వారంరోజులపాటు పోలీసులు జల్లెడపట్టి నిందితుడిని అరెస్టుచేసారు. ఈనెల 20న క్రిస్టినియోమ్ తన కుటుంబంతో కలిసి ఈస్టర్ పార్టీ కోసం శ్వేతసౌధానికి సమీపంలో ఉన్న ది ప్యాపిటల్ బర్గర్ రెస్టారెంట్‌కువెళ్లారు. అదే సమయంలో ఓ వ్యక్తి ముదురురంగు దుస్తులు బేస్‌బాల్‌క్యాప్ ముఖానికి సర్జికల్‌మాస్క్ పెట్టుకుని లోపలికి వచ్చాడు. ఒక్కసారి చుట్టూచూసి నియోమ్‌పక్క టేబుల్‌పై కూర్చుని బ్యాగ్‌ను అపహరించుకుపోయాడు. అది ఖరీదైన గూచి బ్రాండ్ బ్యాగ్. దాని ధర రూ.3.76 లక్షలు. అందులో



3వేల డాలర్ల నగదు అంటే 2.56 లక్షలు ఆమె పాస్‌పోర్టు, డిహెచ్ఎస్ బ్యాడ్జ్ అపార్టుమెంట్ తాళం చెవులు రహస్యపత్రాలున్నాయి. దీనితో రంగంలోకి దిగిన పోలీసులు ఆ రెస్టారెంట్‌కు చెందిన సిసికెమేరా దృశ్యాలు తనిఖీచేసారు. ఒక వ్యక్తికదలికలు గుర్తించి అరెస్టుచేసారు. నియోమ్ మాట్లాడుతూ నాబ్యాగ్‌ను కాలిపక్కనే పెట్టుకున్నానని, ఓ వ్యక్తిపక్కనే కూర్చుని కాలితో దానిని కొన్ని అడుగుల దూరం లాగి దానిపై కోట్‌వేసి తీసుకుని వెళ్లిపోయాడు. ఇలాంటి ఘటనల్లో సామాన్యప్రజలేబాధితులుగా ఉంటారనే విషయం తెలుసని ఇపుడు నేరుగా తనలాంటి వ్యక్తులను కూడా టార్గెట్‌చేసారని అన్నారు. అరెస్టు అయిన దొంగ ఈస్ట్ కోస్ట్ గ్యాంగ్ సభ్యుడని విలువైన వస్తువులు చోరీచేయడంలో దిట్ట అని అన్నారు. నియోమ్‌కు రక్షణగా నిరంతరం సాధారణ దుస్తుల్లో సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ఉంటారు. వారుకూడా దొంగతనం జరిగే సమయంలో అదే రెస్టారెంట్‌లో ఉన్నారు.



# ఇడి కార్యాలయంలో అగ్నిప్రమాదం

**ముంబయి, ఏప్రిల్ 27:** దక్షిణ ముంబైలో భారీ అగ్నిప్రమాదంజరిగింది. బాలార్డ్ ఎస్టేట్‌ప్రాంతంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం ఖైసర్ ఎ హిందు భవనంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టంజరగలేదని అధికారులు తెలిపారు. ఈ భారీ అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 12 ఫైరింజన్లతో మంటల్ని ఆర్పే ప్రయత్నచేసాయి. ఆదివారం తెల్లవారుజామున ఈడీ ఆఫీస్‌లో ప్రమాదంజరగడంపై ఉన్నతాధికారులు ఆరాతీస్తున్నారు. కారింభోయ్‌రోడ్డుపై ఉన్న గ్రాండ్ హోటల్ సమీపంలోని కైసర్ ఐ హింద్ అనేభవనంలో ఆదివారం ఉదయం 2.431 గంటలప్రాంతంలో మంటలు చెలరేగినట్లు ఫైర్‌బ్రిగేడ్‌కు సమాచారం అందింది. అగ్రిప్రమాదంపై సమాచారంఅందినవెంటనే ఫైర్‌బ్రిగేడ్ బృందాలు వెంటనే సంఘటన స్థలానికిచేరుకున్నాయి. మొదట మామూలుగా కనిపించినా ఉదయం 3.30 గంటల సమయంలో మంటలు తీవ్రంగా మారడంతో దాన్ని లెవెల్2 అగ్రిప్రమాదంగా గుర్తించారు. ఈ భవనంలోని నాలుగు ఐదు అంతస్తుల్లో అగ్నిప్రమాదంజరిగినట్లుమున్సిపల్ అధికారి ఒకరు తెలిపారు. ఘటన స్థలానికి 12 ఫైరింజన్లు, ఆరు జంబోవాటర్ ట్యాంకర్లు, ఒక ఏరియల్ వాటర్‌టవర్ టెండర్, ఒక బ్రీతింగ్ ఆపరాటస్‌వాన్, రెస్క్యూవాన్, క్విక్‌రెస్పాన్స్ వాహనం అలాగే అంబులెన్స్ సైతం అందుబాటులో ఉంచారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాలేదని విచారణ సాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# క్రిమియాను ఎప్పటికీ రష్యాలో భాగంగా గుర్తించం

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**కీవ్, ఏప్రిల్ 27:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా, క్రిమియాపై రష్యా నియంత్రణను అమెరికా గుర్తించిందని.. ఇకపై క్రిమియా రష్యాతోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పష్టం చేశారు. తాజాగా ఈ విషయమై ఉక్రెయిన్ స్పందిస్తూ అమెరికా చేసిన శాంతి ప్రతిపాదనలో క్రిమియాపై రష్యా అధికారం ఉంటుందని పేర్కొనడం తమను షాక్‌కు గురిచేసిందని పేర్కొంది. క్రిమియాను తామెన్నటికీ రష్యాలో భాగంగా గుర్తించమని.. అమెరికా ప్రతిపాదనను అంగీకరించబోమని తేల్చిచెప్పింది. అమెరికా ప్రతిపాదనకు అసలు అర్థమే లేదని జెలెన్‌స్కీ పార్టీ శాసనసభ్యుడు ఒలెక్సాండర్ మెరెజ్కో అన్నారు. క్రిమియాను రష్యా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుందని దానిని ఆ దేశానికి పూర్తిగా ఇచ్చేయడం అసాధ్యమని పేర్కొన్నారు.

దీనికి తమ దేశ రాజ్యాంగంలో మార్పులు చేయాల్సి ఉంటుందని దేశవ్యాప్తంగా ప్రజల అంగీకారం తీసు



కోవాల్సి ఉంటుందని తెలిపారు. క్రిమియాను వదులుకోవడం అంటే తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి రాజకీయ ఆత్మహత్యతో సమానమని అన్నారు. దీని వల్ల ఆయన భవిష్యత్తులో ఎన్నో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా దీనిని తమ దేశంలో రాజద్రోహంగా పరిగణస్తారని ఉక్రెయిన్ ప్రభుత్వం ఎప్పటికీ అటువంటి చర్యలు తీసుకోదని అన్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు ఉక్రెయిన్ ప్రభుత్వం రాజకీయంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పటికీ తాము ఈ పోరాటాన్ని ఎన్నటికీ ఆపబోమని ఉక్రెయిన్ సైనిక అధికారులు పేర్కొన్నారు. ఈ యుద్ధం వల్ల ఎందరో సైనికులు ప్రాణాలు కోల్పోయారని.. వారి త్యాగాలకు ఫలితం కచ్చితంగా తమ దేశ ప్రజలకు దక్కాలని అన్నారు. దక్షిణ ఉక్రెయిన్‌లో నల్ల సముద్రం వెంబడి ఉన్న క్రిమియా వ్యూహాత్మక ప్రాంతం 2014లో రష్యా దానిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంపై మాట్లాడిన ట్రంప్.. క్రిమియా రష్యాతోనే ఉంటుందని చెప్పారు. అయితే. ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఇది సరైన సమయం కాదన్నారు. వారానికి ఐదువేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్‌కు సూచించారు. శనివారం వాటికన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన తర్వాత ట్రంప్ రష్యా అధ్యక్షుడిపై విరుచుకుపడ్డారు. పుతిన్‌కు యుద్ధం ఆపాలన్న ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదన్న విషయం తనకు అర్థమవుతోందని అన్నారు.




# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో వరదలు

## ఒక్కసారిగా పోటెత్తిన జీలం నది

**ముజఫరాబాద్, ఏప్రిల్ 27:** దాయాదిదేశం పాకిస్థాన్‌కు భారత్ జీలం ఝలక్ ఇచ్చింది. ముమ్ముందు బిగ్‌సినిమా ఎలా ఉంటుందో తెలిసేవిధంగా ఒక ట్రైలర్ విడుదలచేసింది. పాకిస్థాన్ అధికారులకు ఎలాంటిస మాచారం ఇవ్వకుండా భారత్ హటాత్తుగా జీలం నదిలోకి నీటిని విడుదలచేసింది. దీనితో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ర ఆజధాని ముజఫరాబాద్‌వద్ద ఒక్కసారిగా నదిలో నీటిమట్టంపెరిగి వరదలు పోటెత్తాయి నది పొంగి పొర్లుతుండటంతో హతియన్ బాలావద్ద నీటి అత్యయిక పరిస్థితిని ప్రకటించారు. హతియన్‌బాలాప్రాంతం ముజఫరాబాద్ నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో జీలం నది ఒడ్డున ఉంటుంది. నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో ఉందని స్థానిక మసీదుల్లోని మైకులద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీచేసారు. ఘరీ దుపట్టా, మజ్వాయ్ వంటి జీలం నది ఒడ్డున ఉన్నగ్రామాల్లో నివసించే ప్రజలు అకస్మాత్తుగా నీటిమట్టం పెరగడంతో భీతిల్లిపోయారు. భారత్ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లానుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌చకోతిప్రాంతం గుండా ప్రవహిస్తూ నీటిమట్టం ఒక్కసారిగాపెరిగింది. 20 నుంచి 30 అడుగులు ఎత్తున నీళ్లప్రవహి స్తున్నాయని, 1990వ దశకం దర్వాత ఈస్థాయిలో వరదరావడం ఇదే మొదటి సారనిస్థానికులు పేర్కొంటున్నారు. భారత్ చర్య అంతర్జాతీయ నిబంధనలను జల ఒప్పందాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని పాక్ ఆరోపించింది. ఈ ఘటనపై భారత్ వైపునుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. దీని వల్ల రెండుదేశాలమధ్య ఉద్రిక్తతలు మరింతపెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# భారత్ కోసమే 130 అణ్వాయుధాలు

## పాకిస్థాన్ మంత్రి ప్రేలాపనలు

**కరాచి, ఏప్రిల్ 27:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటుండడంతో దాయాది దేశం ఆందోళనకు గురవుతున్నది. అయితే, ఆ దేశ నాయకులు మాత్రం భారత్‌పై ప్రేలాపనలు పేలుతూనే ఉన్నారు. తాజాగా పాకిస్తాన్ మంత్రి హనీఫ్ అబ్బాసి అణుదాడి చేస్తామంటూ భారత్‌కు హెచ్చరికలు చేశారు. పాకిస్తాన్ వద్ద భారత్ కోసం 130 అణ్వాయుధాలను సిద్ధం చేసి ఉంచామన్నారు. భారత్ సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దుచేసి నీటి సరఫరాను నిలిపివేస్తే యుద్ధానికి సిద్ధంగా ఉం



డాలన్నారు. మన వద్ద ఉన్న సైనిక పరికరాలు, మన వద్ద ఉన్న క్షిపణులు ప్రదర్శన కోసం కాదని, మన అణ్వాయుధాలను ఎక్కడ మోహరించామో ఎవరికీ తెలియదన్నారు. నేను మళ్లీ చెబుతున్నాను ఈ బాలిస్టిక్ క్షిపణులు అన్నీ భారతదేశాన్ని లక్ష్యంగానే ఉన్నాయన్నారు. వాణిజ్య సంబంధాలు, భారత్ తన చర్యల కఠిన పరిణామాలను గ్రహించడం ప్రారంభించిందని హనీఫ్ అబ్బాసి పేర్కొన్నారు. పాకిస్తాన్ వైమానిక ప్రాంతాన్ని మూసివేయడంతో రెండు రోజుల్లోనే భారత విమానయాన రంగంలో గందరగోళం నెలకొందని.. పరిస్థితి ఇలాగే కొనసాగితే, భారత విమానయాన సంస్థలు పది రోజుల్లోనే దివాళా తీస్తాయన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత దేశం తన భద్రతా వైఫల్యాలను అంగీకరించడానికి బదులుగా పాకిస్తాన్‌ను నిందిస్తోందన్నారు. భారతదేశం నిర్ణయాల తర్వాత పాకిస్తాన్ సైతం అన్ని పరిణా మాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో త్రిదళాధిపతి భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ న్యూఢిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత భద్రతా దళాలు తీసుకుంటున్న చర్యలు, సరిహద్దులో ప్రస్తు పరిస్థితుల గురించి చర్చించినట్లు సమాచారం. మరోవైపు బిఎస్ఎఫ్ డైరెక్టర్ దిల్జిత్‌సింగ్ చైధరీ కూడా నార్త్ బ్లాక్‌కు చేరుకున్నారు. సరిహద్దులో పాక్ బలగాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వేళ ఈ వరుస భేటీలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే



పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. వీటిని జీర్ణించుకోలేని పాక్ నేతలు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఇదే సమయంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాక్ సైన్యం.. నియంత్రణ రేఖ (ఎల్ఒసి) వెంట దాడులకు పాల్పడుతోంది. వీటిని భారత సైన్యం ధీటుగా తిప్పికొడుతోంది. ఇలా సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పారామిలిటరీ, సైన్యానికి ఇచ్చిన సెలవులు రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు వెళ్లాయి. అటు జమ్మూ కశ్మీర్‌లోనూ భారీగా సైన్యాన్ని మోహరించారు.




# అరేబియా జలాల్లో విధ్వంసక క్షిపణుల పరీక్ష

**అహ్మదాబాద్, ఏప్రిల్ 27:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇప్పుడు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమైంది. ఈ మేరకు తాజాగా అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. అంతేగాక ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ప్రకటించింది. పహల్గాంలో ఉగ్రదాడితో భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో తన సన్నద్ధతను చాటేందుకు ఇండియన్ నేవీ తాజా పరీక్షలు నిర్వహించింది. సముద్రజలాల్లో ఎప్పుడైనా, ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు తాము సిద్ధమని ఇండియన్ నేవీ ప్రకటించింది. మూడు రోజుల క్రితం కూడా భారత్ ఇదే సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ తో సీ స్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించింది. గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ అయిన ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ విషయాన్ని ఇండియన్ నేవీ సోషల్ మీడియాలో తెలిపింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతితక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిణులు లాంటి వాటిని సీ స్కిమ్మింగ్ లక్ష్యాలుగా పేర్కొంటారు.

# తమిళనాడులో బాణసంచా పేలి ఏడుగురు దుర్మరణం



**చెన్నై, ఏప్రిల్ 27:** బాణసంచా కర్మాగారంలో, ఆయల రథోత్సవం సందర్భంగా జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. తమిళనాడులోని విరుదునగర్, సేలం జిల్లాల్లో ఈ ప్రమాదాలు సంభవించాయి. మృతుల్లో ఇద్దరు బాలురు, నలుగురు మహిళలు ఉన్నారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం విరుదునగర్ జిల్లా శివకాశిలోని ఓ బాణసంచా కర్మాగారంలో కార్మికులు రసాయనాల మిశ్రమాన్ని సిద్ధం చేస్తుండగా హఠాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు మరణించగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి సేలం జిల్లా కంచనాయకన్‌పట్టి గ్రామంలో ద్రౌపది అమ్మవారి ఆలయ రథోత్సవం సందర్భంగా మరో ఘటన జరిగింది. కొంతమంది బాణసంచా కాల్చగా, ఆ నిప్పు రవ్వలు ఓ మోటార్‌బైక్‌పై ఉంచిన బాణసంచా బస్తాకు అంటుకున్నాయి. ఆ బస్తాలో ఉన్న శక్తిమంతమైన టపా సులు పేలడంతో 11 యేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు, ఓ మహిళ సహా నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

# ఇరాన్‌లో పేలుడు: 25కు చేరిన మృతుల సంఖ్య

**టెహరాన్, ఏప్రిల్ 27:** ఇరాన్‌లో చోటుచేసుకున్న పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. ఇప్పటివరకు 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



750 మంది తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నాయి. దక్షిణ ఇరాన్‌లోని ఓ ఓడరేవులో జరిగిన ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌లోని అతిపెద్ద నౌకాశ్రయం సమీపంలో ఈ పేలుడు జరిగింది. పేలుడు ధాటికి సమీపంలోని భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఒక భవనం నేలకూలింది. దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. దీంతో ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న పాఠశాలలు, కార్యాలయాలను తాత్కాలికంగా మూసివేశారు. అయితే, ఇది దాడి కాదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఇప్పటికే స్పష్టం చేశారు. పోర్టులో నిల్వ ఉన్న కొన్ని కంటైనర్లు పేలడంతో ప్రమాదం జరిగిందని స్థానిక విపత్తు నిర్వహణ అధికారి మెహర్దాద్ హాసన్జాదే చెప్పారు. ఈ ఘటన సంభవించడానికి అసలు కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.



చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగిన దృశ్యం, మృతి చెందిన యువకులు(ఫైల్)

# పిడుగుపాటుకు ఇద్దరు యువకులు బలి

## మరో ఇద్దరికి గాయాలు

**కౌతాళం, ఏప్రిల్27, ప్రభాతవార్త:** కర్నూలు, జిల్లా కౌతాళం మండలంలోని కాత్రికి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పిడుగుపడి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన గ్రామంలో చోటు చేసుకుంది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తలారి బాలయ్య(22), అశోక్(20)లపై పిడుగుపడడంతో మృతిచెందారు. గ్రామంలో గురుపద, గంగ అనే మరో ఇద్దరు పిడుగుపాటుకు గురై గాయాలపాలయ్యారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. అకస్మాత్తుగా పిడుగుపడి ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఓ చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగాయి.

**ఆసుపత్రిలో అందుబాటులోని లేని వైద్యులు, ఇబ్బందులు పడిన బాధితులు:** పిడుగుపాటుకు గురై గాయాలపాలైన యువకులను కౌతాళంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి అంబులెన్సు కూడా రాలేదని వాపోయారు. కౌతాళంలో ప్రభుత్వఆసుపత్రి ఉన్నా వైద్యులు ఉండకపోవడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# అపోలో ఆసుపత్రి లీజు రద్దుపై ప్రజా దండయాత్ర

## టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో అపోలో వైద్యులు, యాజమాన్యంపై ఫిర్యాదు

**చిత్తూరు రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రభుత్వ అపోలో ఆసుపత్రి లీజును సత్వరం ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్‌తో ప్రజా దండయాత్ర పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి శ్రీకారం చుట్టినట్లు దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జీ, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకులు షణ్ముగం పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అపోలో ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తన కుమార్తె మృతి చెందిందని ఆరోపించారు. ఈ విషయంపై చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ లో శనివారం రాత్రి అపోలో ఆసుపత్రి వైద్యాధికారులు, యాజమాన్యంపై ఫిర్యాదు చేశామన్నారు. తన కుమార్తె శ్రీదుర్గ మృతికి అపోలో వైద్యాధికారులే బాధ్యత వహించాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన కుమార్తె మృతిపై తనకు న్యాయం లభించే వరకు న్యాయపోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సోమవారం నుండి అపోలో ఆసుపత్రి లీజును ప్రభుత్వం రద్దు చేసే వరకు ప్రజలతో సంతకాలు సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామన్నారు. తన కుమార్తెను



టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న షణ్ముగం

అపోలో ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకువచ్చి అడ్మిట్ చేసిన సమయంలో సిటి స్కాన్ తీయండి, కనీసం అబ్జర్వేషన్‌లోనైనా పెట్టండి అని డాక్టర్లను బ్రతిమాలడం జరిగిందని, అదేమి లేదు కేవలం తలకు గాయం అయ్యిందని తనకు రాత పూర్వకంగా రాసి ఇవ్వడం జరిగిందన్నారు. ఆపై 18 గంటల అనంతరం తలకు గాయం కావడంతోనే తన కుమార్తె మృతి చెందిదని పోస్టుమార్టంరిపోర్టు ఇవ్వడం తనకు ఆశ్చర్యం కల్గిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభారాణి, స్టేట్ మీడియా ఇన్‌ఛార్జీ ఎం.షాదీక్‌ఖాన్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు రవీంద్రరాజు, రాష్ట్ర కార్యదర్శి రుద్రయ్య, రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి పివి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటలో యువకుడి హత్య

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణశివారులోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి-64 పక్కన తిరుమలగిరి గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం ఒక యువకుడి హత్య కలకలం కలిగించింది. తలపై బలమైన బండరాళ్ళతో కొట్టటం వలన మృతి చెందినట్లు ముఖమంతా పగిలి రక్తసిక్తమై ఉంది. మృతుడు తెలంగాణలోని కోదాడ పట్టణానికి చెందిన షేక్ ఫిరోజ్ (24)గా పోలీసులు గుర్తించారు. ఉదయం వేళల్లో ఆమార్గంలో ప్రయాణించే వారు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

**ప్రైవేట్ ఉద్యోగి అనుమానాస్పద మృతి:** జగ్గయ్యపేట పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్న వేల్పుల సంగీతరావు (35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ రాజు తెలిపారు. పెనుగంచిప్రోలుకు చెందిన మృతుడు సంగీతరావు భార్య ఫ్యాన్సీ దుస్తుల దుకాణం నిర్వహిస్తూ ఇరువురు పిల్లలతో జీవిస్తున్నారు. అయితే ఆదివారం ఉదయం సంగీతరావు బలవ్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్ఐ రాజు మీడియాకు చెప్పారు. కేసు నమోదుచేసి పట్టణ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# ఒబిసి ఉద్యోగుల సంక్షేమానికి కృషి: బత్తుల

**విజయవాడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఓబిసి ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తామని సెక్రెటేరియట్ ఓబిసి ఎంప్లాయిస్ ఆరోజును శెలవు దినంగా ప్రకటించాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో అసోసియేషన్ భవనాలు నిర్మించాలని, భవన నిర్మాణాలకు 100 గజాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న బత్తుల అప్పారావు

వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, జలవనరుల శాక అసిస్టెంట్ సెక్రటరీ డా బత్తుల అప్పారావు అన్నారు. ఆదివారం విజయవాడలో ఆయన అధ్యక్షతన జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి అప్పారావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి ఏప్రిల్ 26న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, స్థలమివ్వాలని, ఓబిసి ఉద్యోగులనుండి సభ్యత్వ రుసుంతో సభ్యత్వం చేర్పించాలని, అన్ని మండలాల కార్యవర్గ కమీటీల నిర్మాణానికి ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ న్యాయశాఖ అనువాదకుడు రాజేంద్ర ప్రకాష్, సంఘం ప్రధాన కార్యదర్శి పి భూషణరావు, కోశాధికారి వై శంకరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వి కేదారేశ్వరరావు, ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి డి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# ఉగ్రదాడికి నిరసనగా రైల్వేలో శాంతి ర్యాలీ

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 27,ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా గుంతకల్లు రైల్వే డివిజనల్ ప్రధాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్‌లు ఆద్వర్యంలో జరిగిన ఈ కొవ్వొత్తుల ర్యాలీ డిఆర్ఎం కార్యాలయం నుంచి ప్రారంభమై ప్రభాత్‌నగర్ మీదుగా రైల్ క్లబ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మతం పేరిట మారణహోమం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

ర్యాలీలో డివిజన్‌లోని అన్ని విభాగాల సంబంధిత ఉన్నతాధికారులు, అనధికారులు,భారత్ స్కౌట్స్,గైడ్స్ కార్యకర్తలు,రైల్వే పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డిటి సమస్యపై కేంద్రం పెద్దలను ఒప్పించే శక్తి చంద్రబాబుకే ఉంది

## పవన్ కళ్యాణ్, సత్య కుమార్ కూడా జత కట్టాలి

**అనంతపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర , తెలంగాణ లోని పలు జిల్లాల్లో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ (ఆర్డిటి) ప్రతి సంవత్సరం జరిగే కోట్లాది రూపాయల అభివృద్ధి, సంక్షేమ , సేవ కార్యక్రమాలు శాశ్వతంగా ఆగిపోనున్నాయి.. ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులషన్ ఆక్ట్ కింద విదేశీ నిధులు ఆర్డిటి సంస్థకు వచ్చేందుకు ఈ ఏడాది కేంద్రం అనుమతి నిరాకరించడంతో ఆర్డిటి సంస్థ చిక్కుల్లో పడింది. విదేశాల నుంచి దాతలు, వివిధ సంస్థల నుంచి వచ్చే విదేశీ నిధులు ఆగిపోతే ఆర్డిటి సంస్థ పై ఆధారపడి పనిచేస్తున్న ఎన్నో పథకాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. రెండు రోజుల కిందట కొట్లాది రూపాయల ఖర్చుతో పేద మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత చదువులు చదివించే పథకానికి ఆర్డిటి నిలుపుదల ఈ ఒక్క నిర్ణయంతోనే ఎందరో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇక్కడ ఆర్డిటికి రాకుండా నిలుపుదల చేస్తే ఆ సంస్థ నేపాల్, శ్రీలంక లాంటి మరో దేశంలో అడుగు పెట్టే ప్రమాదం ఉంది అని చర్చ నడుస్తోంది.ఒక మతాన్ని ప్రోత్సహిస్తుందని కేంద్ర ప్రభుత్వానికి అందిన ఫిర్యాదు మేరకు విదేశీ నిధులు ఆ సంస్థకు రాకుండా కేంద్రం నిలుపుదల చేసినట్లు ఆ ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడైనా కిందిస్థాయిలో ఒకరిద్దరు సిబ్బంది తప్పు చేసి ఉంటే మొత్తం సంస్థ పైనే నింద వేయడం కరెక్ట్ కాదని అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. చివరకు అధికారంలో ఉన్న తెలుగు తమ్ముళ్ళు,



టిడిపి తరఫున గెలుపొందిన ప్రజా ప్రతినిధులను కూడా అంతర్గతంగా ఆ పార్టీ ముఖ్యులు అడిగితే గుడ్ సర్టిఫికెట్ ఇస్తారు. జిల్లాకు చెందిన బిజెపి, జనసేన నేతలు కూడా ఆర్డిటి చేస్తున్న కృషిని అభినందిస్తారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డిటి నీ సమస్యను గట్టెక్కించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి తరఫున కూటమి ప్రభుత్వంలో ఉన్న మంత్రి సత్య కుమార్ లాంటి వాళ్ళు నడుం బిగించి కేంద్రం పెద్దలను ఒప్పించేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని ప్రజల్లో బలంగా అభిప్రాయం అవుతోంది. సింధూ నది లేకపోతే పాకిస్తాన్ కు ఏ విధంగా ఇక్కట్లు పడుతుందో ఆర్డిటి పనులు కొనసాగకపోతే ఉమ్మడి అనంతపూర్ జిల్లా కూడా ప్రమాదంలో పడి వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం కనిపిస్తోంది. ఆర్డిటి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఇప్పటికే ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు తదితర ఎమ్మెల్యేలు ప్రకటించారు. ఆర్డిటిపై సీఎం చంద్రబాబు, ప్రధాన మోడీ స్పందించి తగిన న్యాయం చేయాలని అనంతపురం వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి లేఖలు రాశారు. సిపిఐ, సిపిఎం పార్టీలు, ఇతర ప్రజా సంఘాలు ఆర్డిటివి విషయంలో రాజకీయాలకతీతంగా పోరాడేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం అన్ని పార్టీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించేందుకు సిపిఐ సన్నాహాలు చేస్తోంది. ఆర్డిటీ వ్యవస్థాపకుడు , దివంగత విన్సెంట్ ఫెర్రర్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలపాలిట దేవుడు. జిల్లాలో ఎన్నో గ్రామాల్లో ఆర్డిటి తరఫున తనదైన శైలిలో అభివృద్ధి కార్యక్రమాలు చేసి పేరు ప్రఖ్యాతులు గడించారు. అనంతపురం జిల్లా తో పాటు ఆంధ్ర, తెలంగాణ జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఆర్డిటి సేవ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తరిస్తూ వచ్చింది. ఆర్డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ , ఇతర ఆర్డిటి డైరెక్టర్లు, వివిధ స్థాయిలో ఉన్న ప్రతినిధులు ఎంతో కృషి చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తున్నారు.కరువు పీడిత రాయలసీమ ప్రాంతంలో, తెలంగాణ లోని ఆరు జిల్లాల్లో సేవలందిస్తున్న 55 ఏళ్ల చరిత్ర కలిగిన రూరల్ డెవెలప్మెంట్ ట్రస్ట్ సేవలకు కేంద్ర ప్రభుత్వం మంగళంపాడే రీతిలో అడ్డంకులు సృష్టించడం విమర్శలకు తావిస్తోంది.ఇప్పుడు లైసెన్స్ పునరుద్ధరణ ఆపివేయడంతో నిధుల వినియోగం పై ప్రభావం పడింది. ఏడాదికి సగటున 500 కోట్లకు పైగా బడ్జెట్ ఉండేది అని తెలియ వచ్చింది. దేశంలో టాప్ 10 ఎన్జీవో లలో ఆర్డీటీ ఒకటి, విదేశీ విరాళ నియంత్రణ చట్టం కిం ద పునరుద్ధరణ కాక నిధులు నిలిపివేశారు. . ఇది ప్రతి సంవత్సరం 8.5 లక్షల మంది రోగులకు విస్తరించే 300 కోట్లకు పైగా విలువైన వైద్య సేవలు నిలిచిపోయాయి. అందులో పనిచేసే 3,000 మంది సిబ్బంది నిరుద్యోగులుగా మారతారు. యువత ఆర్డీటీ ప్రాయోజిత అనంత గ్రామీణ క్రీడా గ్రామం నుండి వారి స్పాన్సర్‌షిప్‌ను కోల్పోతారు. ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ , స్పెయిన్ నుంచి అనంతపురంకు వలస వచ్చారు. ఆయన 1969లో లాభాపేక్షలేని సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా 3,500 కంటే ఎక్కువ గ్రామాల్లో పనిచేస్తుంది, ఆర్థికంగా బలహీన వర్గాల నుండి 4.5 లక్షలకు పైగా ప్రజలుసేవలందుకుంటున్నారు. దశాబ్దాలు గా ప్రజలకు సేవ చేస్తున్న ఆర్డీటీని రక్షించడానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలి. పేద ప్రజలకు సేవచేయడానికి ఆర్డీటీని స్థాపించిన ఫెర్రర్ కుటుంబంపై అలాగేనిస్వార్థ సేవ అంది స్తున్న ఆర్డిటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది.

# అసంపూర్తిలో గ్రామ సచివాలయం

## ఎప్పటికి పూర్తయ్యేనో.. గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు

**కోవూరు (నెల్లూరు), ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** ప్రజలకు వారి ముంగిటికే వివిధ రకాల సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. కోవూరు మండలంలో మొత్తం 10 పంచాయతీలకు గానూ 16 సచివాలయాల భవనాలకు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. మొత్తం మండలంలో 16 సచివాలయాలకు మంజూరైన కేవలం పడుగుపాడు, ఇనమడుగు, గుమ్మలదిబ్బ సచివాలయాల భవనాలు మాత్రం పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో అసంపూర్తిగా కొట్టుమిట్టాడుతున్నాయి. కోవూరులోని శాంతినగర్ 6వ వీధిలో 2019 డిసెంబర్ 24వ తేదిన అప్పటి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి 40 లక్షల వ్యయంతో ఈ సచివాలయాలకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు పొందిన కాంట్రాక్టర్లు మాత్రం కోవూరు పంచాయతీ పరిధిలోని 2 ప్రాంతాల్లో మాత్రం సగం నిర్మాణాలు చేపట్టి



అసంపూర్తిగా వదిలేశారు.

**మందుబాబులకు నిలయం:** కోవూరు పంచాయతీ పరిధిలో శాంతినగర్ 6వ వీధి , తాలూకా కార్యాలయ ప్రాంగణంలోని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఈ గ్రామ సచివాలయ అసంపూర్తి భవనాలు మందుబా బులకు, అసాంఘిక కార్యక్రమాలు చేసే వారికి నిలయాలుగా మారిపోయాయి. గత రెండు సంవత్స రాలుగా ఈ భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో అవి ఎన్నేళ్లకు పూర్తవుతాయో అని గ్రామస్తులు వాపోతున్నారు. 6వ వీధిలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయంలో సిమెంట్ బస్తాలు గడ్డ కట్టి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు చొరవ తీసుకుని ఈ భవన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మార్చురీ టూ మదర్‌థెరీసా..!

## ఏడు కిలోమీటర్ల దూరం శవంతో కుటుంబం

**గంగవరం(చిత్తూరు జిల్లా), ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఇంటర్ ఫెయిల్ కావడంతో మదర్‌థెరిసా హాస్టల్ లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి యోగేష్ మృతదేహాన్ని కుటుంబసభ్యులు ర్యాలీ,ధర్నా,రాస్తారోకో,నిరసనలతో పలమనేరు, గంగవరం రహదారి పై పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నుండి పలమనేరు మదనపల్లె జాతీయ రహదారి మీదుగా మదర్ థెరిసా కళాశాల వరకు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరం నిరసనలతో అట్టుడికిపోయింది. బాధితుల కథనం మేరకు కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం గెసికపల్లెకు చెందిన సుబ్రమణ్యం మొదటి భార్య సుమతి దంపతులకు ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె సంతానం.పెద్ద కుమారుడు యోగేష్ మండలంలోని మదర్‌థెరిసా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12న ఇంటర్ ఫలితాలను విడుదల చేసింది.ఈ ఫలితాల్లో యోగేష్ మూడు సబ్జక్టులలో ఫెలవ్వడంతో కళాశాల ప్రాంగణంలోని హాస్టల్‌లోనే ఉంటూ త్వరలో ప్రభుత్వం నిర్వహించు సప్లమెంటరీ పరీక్షలు రాయడానికి చదువుకుంటున్నాడు.తాను పరీక్షలకు బయపడి మనస్థాపానికి గురై హాస్టల్‌లోని తన గదిలో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే.అయితే యోగేష్ కుటుంబ సభ్యులు మాత్రం తమ కుమారుడు కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని ఆరోపించారు.తల్లిదండ్రులు వచ్చేలోపే కళాశాల యాజమాన్యం యోగేష్ మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు.దీంతో ఆదివారం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి నందు శవపరీక్ష అనంతరం యోగేష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు చేతులపై ఆసుపత్రి మార్చురీ నుండి కళాశాల వరకు తీసుకుని వచ్చి కళాశాల ఎదురుగా రహదారిపై మృతదేహంతో బైటాయించి ధర్నా,రాస్తారోకో చేపట్టారు.విషయం తెలుసుకున్న పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్, గంగవరం అర్బన్,రూరల్,పలమనేరు,పుంగనూరు రూరల్, సిఐలు ప్రసాద్,మురళి,నరసింహరాజు, రాంభూపాల్‌లతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలతో కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకారులతో,యాజమాన్యంతో చర్చించి మృతుని కుటుంబసభ్యులకు పరిహారంతో పాటు,బాధిత కుటుంబ సభ్యుల విద్యార్థులకు ఉచిత విద్యకు హామీ ఇవ్వడంతో యోగేష్ కుటుంబ సభ్యులు శాంతించి ధర్నాను విరమించుకున్నారు. అనంతరం యోగేష్ మృతదేహాన్ని స్వగ్రామం గెసికపల్లెలో ఖననం చేశారు.

# సమరశీల పోరాటానికి సిద్ధం: కేసన శంకరరావు

**విజయవాడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** అధికారంలోకి రాకమునుపు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తరువాత ఇంకోమాటగా కులగణనపై పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని, ఇప్పటివరకు కులగణనను చేపట్టాలని తాము పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేనందున ఇకపై సమరశీల పోరాటానికి సిద్ధపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఆదివారం విజయవాడలో సంఘం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల మహాత్మా జ్యోతిరావ్ పూలే, డా బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న



అంబేద్కర్‌కు వినతిపత్రాలందిస్తున్న దృశ్యం

జనగణన తోపాటు కులగణన జరిపించాలని డిమాం డ్ చేశామని కానీ ప్రయోజనం లేకపోవడంతో ఇలా విజ్ఞాపనలను డా బిఆర్ అంబేద్కర్‌కు, జ్యోతిరావ్ పూలేకు ఇచ్చామన్నారు. బిసిలే వెన్నెముకలంటూ ప్రసంగాలు చేస్తూనే తాము శాంతియుతంగా గాందేయ పద్ధతిలో చేస్తున్న ర్యాలీని అడ్డుకుని అరెస్ట చేయడం అప్రజాస్వామికమని ఆయన ఆరోపించారు. బందర్‌రోడ్డు మున్సిపల్ స్టేడియం వద్ద నుండి బయల్దేరిన ర్యాలీ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద వున్న డా బిఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాల వరకు చేసి అక్కడ వారి విగ్రహాలకు పూలమాలలు వేసి వినతిపత్రాలందించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఎంఎస్ఎస్ మూర్తి, జి ఉమామహేశ్వరరావు, తదితర నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల బాధలను చూసి చలించిపోయా: ఎంపి ప్రభాకర్‌రెడ్డి

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** దివ్యాంగుల బాధలను చూసి చలించిపోయానని, వారి అభివృద్ధికి పాటుపడాలన్న సంకల్పంతో ఎలక్ట్రానిక్ ట్రైసైకిల్స్ అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కావలి మినీస్టేడియంలో ఆదివారం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దివ్యాంగుల ట్రైసైకిల్స్ శిబిరాన్ని వేమిరెడ్డి ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ ట్రైసైకిల్స్ దివ్యాంగులకు అందచేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడారు. దివ్యాంగులకు కదలిక ముఖ్యమని, వారి ఆత్మస్థైర్యం కోల్పోకుండా చేయడంకోసం ట్రైసైకిల్స్ అందచేయడం జరిగిందన్నారు. ఉదయగిరితో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం కావలిలో చేపట్టామన్నారు. ఇప్పటివరకు దాదాపు 850 ట్రైసైకిల్స్‌ను దివ్యాంగులకు అందచేశామన్నారు. వీటిని అందచేయడమే కాకుండా మెయిన్‌టెనెన్స్‌కూడా విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనే చేపడతామన్నారు. దివ్యాంగులు జాగ్రత్తగా వీటిని నడపాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడంలోనే తనకెంతో ఆనందంగా ఉందన్నారు. అందుకే పట్టుదలతో ఈ కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. మరిన్ని ప్రజా ప్రయోజనాల కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల



సహకారంతోనే తాను ఇలాంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నానన్నారు. వారం దరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందించే కార్యక్రమం నిర్వహించడం ఎంపి వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తాను రాజకీ యాల్లోకి రాకముందునుంచే వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి ప్రజాసేవ చేస్తున్నానన్నారు. టిటిడి బోర్డు మెంబరు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతరెడ్డిని కలిసి బిట్రగుంట వెంకటేశ్వరస్వామి కోనేరును బాగుచేయాలని కోరడం జరిగిందన్నారు. దానికి వేమిరెడ్డి దంపతులు అంగీకరించి 2కోట్ల రూపాయలతో కోనేరును బాగు చేసేందుకు హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడుతూ జీవితంలో అందరూ డబ్బు సంపాదిస్తారని, కొద్దిమందికి మాత్రమే ప్రజలకు పంచే మంచి మనసు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీని వాసులురెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీ ధర్‌రెడ్డి, బిజెపి రాష్ట్రనేత కందుకూరి వెంకటస త్యనారాయణ, జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# రాబోవు రోజుల్లో జనసేన ప్రభంజనం: సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఆ ంధ్రప్రదేశ్ లో జనసేన పార్టీ క్రమక్రమంగా బలపడుతూ గ్రామాల స్థాయిలో కూడా వేగంగా విస్తరిస్తుందని, పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ నాయకత్వాన్ని యువత స్వాగతిస్తున్నారని ఎన్‌టిఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని విజయవాడ రోడ్‌లోగల పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ క్రీయాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజర య్యారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ తమ నేత పవన్‌కళ్యాణ్ బృహత్తర కార్యక్రమం చేపట్టారని, రాజకీయ పార్టీల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కార్యక ర్తల కుటుంబాలకు భరోసా అందించేందుకు సంక ల్పించారన్నారు. ఇప్పటికే 12 లక్షల సభ్యత్వాలతో జనసేన సంస్థాగతంగా బలమైన పార్టీగా ఎదిగిందన్నారు.

# జగ్గయ్యపేటలో ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఎన్ టి ఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ఏపిఎస్ ఆర్టీసి బస్‌డిపో క్రీడా మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల జగ్గయ్యపేట ఎంఎల్ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. జగ్గయ్యపేట కోటి జిమ్ క్లాసిక్ హెల్త్-ఫిట్‌నెస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. బాడీ బిల్డింగ్, ఫిజికల్లీ ఛాలెంజెడ్, లోకల్ మెన్ ఫిజిక్ అంశాలపై మిష్టర్ కోటి తర్ఫీదులిస్తూ యువతను ప్రతిభాశాలులుగా తీర్చిదిద్దుతున్నారు. ఓవరాల్ పోటీల్లో విజేతలకు మొత్తం రూ.1.20 లక్షల నగదు బహుమతులను అందించనున్నారు. ఈపోటీల ప్రారంభోత్సవంలో శ్రీరాం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



# ఆలయంలో భక్తుల రద్దీ

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** దుర్గమ్మ దర్శనానికి ఆదివారం అమావాస్య సందర్భంగా విశే షసంఖ్యలో భక్తులు వచ్చి శ్రీ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. విశేషపూజాదికాల్లో పాల్గొన్నారు. రద్దీ నియంత్రణకు ఇఓ కె రామ చంద్రమోహన్ పలు చర్యలు తీసుకుని భక్తులకు త్వరితంగా దర్శనం అయ్యే చర్యలు చేపట్టారు.

**వైభవంగా నృత్య అర్చన:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం కళావేదికపై విజయవాడకు చెందిన నాట్యాచార్యులు నేతి రిషిత ఆధ్వర్యంలో నృత్యవిద్యార్థులు నృత్యనీరాజనాలను వైభవంగా అందించారు. తాండవ నృత్యకరీ గజానన, అఖిలాండేశ్వరి, శంబో శివ శంబో తదితర ప్రముఖ కీర్తనలకనుగుణంగానృత్యనీరాజనాల ర్పించారు. కళాకారులకు దుర్గమ్మవారి దర్శనం తో పాటు ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు.

# 30 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**శంఖవరం , ఏప్రిల్ 26 ( ప్రభాతవార్త ) :**

మనిషికి ఎంత వయస్సు వచ్చినా, ఎదుగుదలలో ఏ స్థాయికేగినా..తన చిన్న నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటే అందులో పదవ తరగతి వరకు కలసి చదివిన మిత్రుల అనుబంధమే గుర్తొస్తుంటుంది. ఆ స్నేహం విలువ, గొప్పతనం అంత మాధుర్యాన్ని, ఆనందాన్ని ఇస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. జీవన గమనంలో ఎంత దూరంలో ఉన్నా..ఎంత అలసట పొందినా ఒక్కసారి బాల్య మిత్రులు కలిస్తే ఆ ఆనందమే వేరులే. ఇదే తరహాలో కత్తిపూడి లో గల జిల్లా పరిష త్ హైస్కూలులో 1994 వ సంవత్సరంలో పదవ తరగతి వరకు కలసి చదివిన విద్యార్థులంతా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, అనుభూతి, అనుబంధాలను పంచుకున్నారు. తమ ఎదుగుదలకు, సమాజంలో గౌరవంగా జీవించేలా విధ్యాబుద్ధులు అందించిన నాటి ఉపాధ్యాయులైన ది భాష్యం వెంకట జగన్నాథ రమణమూర్తి, దిండిభట్ల విజయ సారథి , మానికొండ వేదవల్లి లను, విధ్యార్థులంతా ఆప్యాయంగా పలకరించి, వేదికపై ఆశీనులు గావించారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించారు. పూర్వ విద్యార్థులంతా చదివిన తరగతి గదులను చేసిన అల్లరిని జ్ఞప్తికి తెచ్చుకుని ఎంతగానో మురిసిపోయారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 30 ఏళ్ల తర్వాత విద్యార్థులందరినీ కలవడం



చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు మిత్రులంతా మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం వారు జీవితంలో ఏవిధంగా స్థిరపడిందీ ఒక్కొక్కరుగా చెప్పుకుంటూ సాయంత్రం వరకు తమ ఆనందాన్ని పంచుకున్నారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుండి సైతం తరలిరావడం బాల్య మిత్రుల బంధం ఎన్నటికీ మరువరానిదని ఈ పూర్వ విద్యార్థులు నిరూపించారు. విద్యార్థులు అందరూ కలిసేందుకు కృషి చేసిన సభ్యులను ఘనంగా సత్కరించారు

# భక్తులతో కిక్కిరిసిన తలుపులమ్మ లోవ



**తుని ( రౌతులపూడి), ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

తుని మండలంలోని శ్రీ తలుపులమ్మ లోవ దేవస్థానంకు ఆదివారం భక్తులతో కిక్కిరిసింది .ఆలయం తెరుచు సమయములో ఉదయం గం.6.00 ల నుండి సాయంత్రం గం.6.00 ల వరకు మాత్రమే సుమారు25000 మంది శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాదముల విక్రయం ద్వారా రూ 1,21,500లు,పూజా టిక్కెట్లు ద్వారారూ 73,380లు,కేశకండన టిక్కెట్లు ద్వారా రూ 8,940లు వాహనపూజలు టిక్కెట్లు ద్వారా రూ 1,730లు,కాటేజీలు ద్వారారూ 33,060లు ఇతర మిసిలేనియస్ డొనేషన్లు ద్వారా రూ66,458 లు వెరసి మొత్తం రూ 3,05,068 లుఆదాయం వచ్చినదని కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాధరాజు తెలిపారు. దేవాలయంలో అధునూతన పారిశుధ్య విధానానికి నూతన స్క్రబ్బింగ్ మిషిన్,జెట్ మెషిన్ను ఈవో విశ్వనాధరాజు ప్రారంభించారు.

# నేడు వైశ్య సంఘ కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి 215ఏ ఆధ్వర్యంలో మెడ్ యునైటెడ్ వారి సహకారంతో మెగా మెడికల్ క్యాంపు సోమవారం ఉదయం గం9ల నుండి సాయంత్రం గం4.00ల వరకు అమలాపురం మెయిన్ రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్ధన రావు కళ్యాణ మండపంలో నిర్వహించబడునని యెండూరి రాఘవ కుమారి తెలిపారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో రూ 5 వేలు విలువైన క్యాన్సర్, గ్యాస్ట్రో, రక్త, కళ్ళ పరీక్షలను వారి అవసరాలకు అనుగుణంగా ఉచితంగా చేయబడునన్నారు. కుల,మతాలకు అతీతంగా స్త్రీ, పురుషులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనన్నారు. ముందుగా గానీ స్పాట్లో గాని బచ్చు పార్వతీదేవి 9291256729ని, అప్పన వీరన్నని 92900 84360 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోనవలెనన్నారు.

# రాజమండ్రి డిపో నుంచి సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

**ఉమ్మడి తూర్పుగోదావరి**
**జిల్లా బ్యూరో, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి పుష్కరాలకు రాజమండ్రి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ షబ్నం ఆదివార తెలిపారు.మే 14న బయలుదేరి 8 క్షేత్రాలు దర్శించుకుని సరస్వతీ పుష్కరస్నానం అనంతరం తిరిగి వస్తుందన్నారు.భక్తులు బస్సులు సరిపడినంత మంది ఉన్నట్లయితే తగినరుసుముతో మీఊరికే బస్సు పంపించబడుతుందని తెలిపారు. భక్తులు వివరాల కొరకు 9502300189,9966666544కి సంప్రదించాలన్నారు.




# శ్రీశ్రీశ్రీ గంగాదేవి మురుగులమ్మకు ప్రత్యేక పూజలు



**అమలాపురం రూరల్ , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

అమలాపురం రూరల్ మండలం,బండారులంక గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ గంగాదేవి మురుగులమ్మ వారు ప్రతి అమావాస్య రోజున ఉగ్రరూపం లో వుంటారు. ఆరోజు అమ్మవారికి, పెరుగు అన్నం, నైవేద్యం సమర్పించిన అమ్మ వారు శాంతించి ప్రజలను చల్లగా చూస్తారని బండారులంక ప్రజల నమ్మకం. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, చంద్రకళ దంపతులు ఈ రోజు అమ్మ వారి కి పెరుగు అన్నం సమర్పించారు.

# కోదండరాముడికి బంగారు,వెండి ఆభరణాలు సమర్పణ

**అంబాజీపేట, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని పుల్లేటికుర్రు శివారు గొల్లగుంట కొప్పిశెట్టివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ కోదండరామ స్వామి వారికి భక్తుల అందజేసిన బంగారు,వెండి ఆభర ణాలను స్వామి అమ్మవార్లకు సమర్పించారు. కొప్పిశెట్టి వారిపాలెం, సానబోయినవారిపాలెం గ్రామ ఆడపడు చులు వెండి కిరీటాన్ని సమకూర్చారు. అలాగే గ్రామానికి చెందిన కొప్పిశెట్టి ఆనంద రామారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వెండి నేత్రాలు, నామాలను, అమ్మవారికి బంగారు ముక్కుపుడక సమర్పించారు. అంతకుముందు ఆలయ చైర్మన్ కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామివారికి



అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# గుబ్బాలమ్మ తల్లి జాతరలో పాల్గొన్న వైకాపా నేత మురళిరాజు



**ప్రత్తిపాడు , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

మండలంలో రాచపల్లి గ్రామంలో గల గుబ్బాలమ్మ తల్లి జాతర మహోత్సవమును ఈ సంవత్సరం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి జాగారం సందర్భంగా గరగల సంబరం కోలాటం నృత్య ప్రదర్శనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.. చిన్నారులచే ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం అమావాస్య జాతర మహోత్సవం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ వైసిపి నేత,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు జాతరలో పాల్గొన్నారు. గుబ్బాలమ్మ అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులతో కలసి దర్శించుకున్నారు.జాతర నిమిత్తం కమిటీ సభ్యులకు 5000 రూపాయలు విరాళాలు అందజేసారు. ఘంద అమావాస్య సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా చేసే అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించడం చాలా సంతోషదాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి నాని,నారిరెడ్డి వీరబాబు,సారిపల్లి గోవింద్,కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు,గుమ్మిడి రామకృష్ణ,కోలా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు..

# కులం రంగు' పూసుకుంటున్న అంబాజీపేట హైస్కూల్

**అంబాజీపేట, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

దివంగత లోక్ సభ స్పీకర్ గంటి మోహన్ చంద్ర బాలయోగి విద్యాభ్యాసం చేసిన పాఠశాలగా పేరుగాంచిన అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల ప్లస్ గా రూపాంతరం చెంది ఉన్నట్టుండి 'కులం రంగు' పూసుకొంటోంది. దివంగత నేత జిఎంసి బాలయోగి పార్లమెంటు స్పీకర్గా పనిచేస్తున్న సమయంలో అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పార్లమెంట్ భవనం ఆకృతిలో పాఠశాల భవనంను నిర్మిం చారు.ఉన్నత పాఠశాల లో గత వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలు 'కులం రంగు'ను తేటతెల్లం చేస్తుంది. స్థానిక జడ్పీ హైస్కూల్లో పీఎం శ్రీ నిధులతో చేపట్టిన పనులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో కోడిగుడ్లు మాయం అంటూ.. పాఠశాల ప్రధానోపా ధ్యాయుడుపై ఓ ఉపాధ్యాయుడు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విభేదాలు రచ్చకెక్కాయి. ఉపాధ్యాయుడి ఫిర్యాదుతో జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 21న కొత్తపేట డివైఈవో బి. రామలక్ష్మణ మూర్తి స్థానిక జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులను విచారించారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధిలో భాగంగా విద్యార్థులచే పనులు



చేయించి పీఎం శ్రీ నిధులను హెచ్ఎం డ్రా చేశారని, మధ్యాహ్నం భోజన పథకం కోడిగుడ్లు మాయం చేశారని ఉపాధ్యాయుడు ఫిర్యాదుతో విచారణ చేపట్టామని స్థానిక విలేకరులకు డివైఈవో తెలిపారు. విచారణను గోప్యంగా ఉంచుతామని, విద్యాశాఖ ఉన్నతాధికా రులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. వేరు,వేరు సామాజిక వర్గాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడుల మధ్య 'కులం రంగు' చిలికి చిలికి గాలి వానగా మారడంతో రెండు వర్గాలుగా చీలిపో యారు. ప్రధానోపాధ్యాయుడి సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఆయనకు బాసటగా నిలుస్తూ ఫిర్యాదుదారుడైన ఉపాధ్యాయుడని ఇబ్బందులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి వెళ్లడంతో ఉపాధ్యాయుల మధ్య ఏర్పడిన మనస్పర్ధలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారని తెలిసింది. ప్రధానోపాధ్యాయుడుతోపాటు ఉపాధ్యాయులలో అలజడి మొదలైంది.పాఠశాలలో పీఎం శ్రీ నిధులు అవకతవకలు జరగలేదని, ఉపాధ్యాయుడే వివిధ కారణాలతో కావాలనే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడని ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆయన సామాజిక వర్గానికి చెందిన మరో వ్యక్తి చెబుతున్నప్పటికీ, ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఉపాధ్యాయుడిపై ఎందుకు వత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు దారుడైన ఉపాధ్యాయుడి సామాజిక వర్గీయులతో పాటు ఇతర సామాజిక వర్గీయులు, విద్యార్థుల తల్లిదం డ్రులు ప్రశ్నిస్తున్నారు. తప్పు చేయనప్పుడు ప్రధానోపాధ్యాయుడు ధైర్యంగా నిలబడాలని, డివైఈఓ చేపట్టిన విచారణపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకునే చర్యలు వెలువడే వరకు ఎందుకు కంగారు పడుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానో పాధ్యాయుడితోపాటు సహచర ఉపాధ్యాయులు శాశ్వతం కాదని, ఉద్యోగ బదిలీలలో భాగంగా ఉపాధ్యాయులు వేరే పాఠశాలలకు వెళుతుంటారని, మరొకరు వస్తుంటారని,స్థానికంగా ఉన్న పాఠశాల శాశ్వతమని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంతరించుకున్న అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 'కులం రంగు' అపవాదు అంట కుండా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు సరియైన నిర్ణయం తీసుకుంటారని స్థానికులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురికి యువకులకు తీవ్ర గాయాలు



**కోనసీమ బ్యూరో ,ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త )**

మోటారు సైకిల్ పై వస్తున్న నలుగురు యువకులను లారీ ఢీకొనటంతో తీవ్రంగా గాయ పడ్డారు.వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఐపోలవరం మండలం, టీ. కొత్తపల్లికి చెందిన ఉందుర్తి బాలు, కాకినాడ గొల్లపాలెంకి చెందిన ఖండవల్లి రాజా, అయినవిల్లి మండలం, శంకరాయ గూడెం కు చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, టీ కొత్తపల్లి చెందిన బొమ్మి వినోద్ ఆదివారం యానం నుండి ఒకే మోటార్ సైకిల్ పై తిరిగి వస్తుండగా అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాయపడిన వారిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి. జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆనంద డోలికల్లో ఆనాటి విద్యార్థులు..పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక


**గోపాలపురం , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త )**

అల్లరిగా, ఆటపాటలతో చదువుకున్న ఆనాటి విద్యార్థులంతా పాతికేళ్ల తర్వాత ఒక్కసారిగా కలిస్తే ఎలా ఉంటుంది..? వారి ఆనందానికి అవధులు లేకుండా పోతుంది కదా! గోపాలపురంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరపు పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. పాతికేళ్ల కాలగమనంలో ఒక్కొక్కరు ఒక్కొక్క రీతీగా ఎక్కడెక్కడో స్థిరపడి మళ్లీ అదే పాటశాల్లో కలుసుకుని ఆనంద డోలికల్లో తెలియాడారు. వారు చదువుకున్న రోజుల్లో తీపీ జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ చిన్నపిల్లలా మారిపోయి ఆనందంగా రోజును గడిపారు. తాము చదువుకున్న పాఠశాలకు కృతజ్ఞతగా



ఎంతోకొంత సహాయం చేయాలనే ఆలోచనతో రూ.4 లక్షలు వెచ్చించి తరగతి గదులకు అదనపు షెడ్డులను నిర్మించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో అప్పట్లో వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఒకే వేధికపై తీసుకొచ్చి, దుస్సాలువాలు కప్పి, పూలమాలలు వేసి అందరికి పాదాభివందనం చేసుకున్నారు. అనంతరం గ్రూప్ డాన్సులతో ఉల్లాసంగా గడిపారు. అందరు కలిసి సహాపంక్తి భోజనం చేశారు.

# వైభవంగా తలంపులమ్మతల్లి తీర్థం..ఊరేగింపు



**తుని ( రౌతులపూడి ) ,**
**ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

తుని మండలంలోని, లోవ లో వెలసిన తలచిన కోరికలు తీర్చే తలంపులమ్మ తల్లి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం తీర్థం, ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. లోవ కొత్తూరు లోని బాలాలయంను ఎంతో సుందరంగా పుష్పాలం కారణ చేశారు. వివిధ రకాల బళ్ల వేషాలు, కళ్ళు మిరిమిట్ల గొలుపే బాణసంచా కాలుపులతో అమ్మ వారిని ఊరేగించారు. కళా వేదికపై 60 మంది నాట్య కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, నక్కపల్లి వారిచే శ్రీ బాల వినాయక సరస్వతి మ్యూజికల్ బ్యాండ్ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు పొందారు. ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ పి విశ్వనాథరాజు పాల్గొన్నారు. ఎటువంటి ఏ సంఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

# లోక కళ్యాణం కోసమే సర్వ పృష్ఠ ఆప్తో ర్యామ యాగం

## టి.టి.డి ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్ట్ అధికారి యజ్ఞేస్వర యాజులు

**అంబాజీపేట, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

సమస్త మానవాళి ఈతి బాధల నుండి బయటపడేందుకు, లోక కళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు టిటిడి ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర యాజులు ఉవాచించారు. మండలంలోని తొండవరం లో వైనతేయ నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ ఉమా తొండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో ఆదివారం సర్వ పృష్ఠ ఆప్తో ర్యామ యాగం ప్రారంభమైయింది.యాగ కర్తలుగా దువ్వూరి వెంకట సూర్య ప్రకాశ యజ్వ ,కనకదుర్గ సోమపీధిని దంపతులు వ్యవహరిస్తున్నారు. యాగ విశిష్టతను ప్రాజెక్ట్ అధికారి యాజులు వివరిస్తూ ప్రస్తుత లోకమంతా మానవ తప్పిదాల వల్ల ప్రకృతి ప్రకోపిస్తూ తన తడాఖాను చూపిస్తోందన్నారు.అయితే ప్రకృతిని శాసించడం ఎవరివల్లా కాదని, అదుపులో ఉంచేందుకు, ప్రతి కణంలో జీవశక్తిని నింపేందుకు అగ్నిదేవుని ద్వారా సమస్త దేవతలకు హవిస్సు భాగం అందించేందుకు సర్వ పుష్ఠ ఆప్తోర్యామ యాగం ఎంతగానో ఉపయోగపడు పడుతుందన్నారు. సర్వపుష్ఠ ఆప్తోర్యామ యాగంలో( మహా గ్నిచయనం) భాగంగా ప్రత్యేక ఆకారాలు కలిగిన వేయి ఇష్టకాలను( ఇటుకలను) ప్రత్యేక మంత్రాలుతో అమర్చుతామని, ఇలా పేర్చిన ఇటుకలన్నీ గరుడ పక్షి ఆకారాన్ని సంతరించుకుంటాయని యాజులు వివరించారు. ఈ యాగంలో సమస్త దేవతలను ఆహ్వానించి వివిధ హోమ ద్రవ్యాలతో వారికి హవిస్సు భాగాన్ని అందిస్తామన్నారు. ఎంతో విశేషమైన సర్వ పృష్ఠ ఆప్తో ర్యామ యాగాన్ని చైత్ర బహుళ అమావాస్య రోజున ప్రారంభించడం వల్ల ఎంతో శక్తివంతంగా మారుతుందని కోరికలన్నీ ఈడేరుతాయని యాజులు వివరించారు. సమస్త మానవాళి సుఖశాంతులతో ఉంటారని,వారి కోరికలన్నీ సిద్ధిస్తాయని, ముఖ్యంగా తమిళనాడులో ఏ పనైనా అమావాస్య నాడే ప్రారంభించి విజయ



వంతంగా ముగిస్తారన్నారు. సమస్త దేవతలకు కూడా హవిస్సు కేటాయించబడుతుందన్నారు. సుమారు 10 రోజుల పాటు జరిగే ఈ యాగంలో వివిధ కార్యక్రమాలు, క్రతువులు ఉంటాయని, యాగాన్ని వీక్షించి,జన్మ ధన్యం చేసుకొని, ముక్తి పొందాలని యాజులు భక్తులకు తెలియజేశారు.

# యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి

### శిక్షణ పొందిన విద్యార్థులకు స్కిల్ ఇండియా శిక్షణా ధ్రువ పత్రాల పంపిణీ

**రావులపాలెం, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు,ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కిల్ ఇండియా సౌజన్యంతో రావులపాలెం బాయ్స్ హైస్కూల్ లో నిర్వహించిన సౌర విద్యుత్ వినియోగ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మదూర్ లతో కలిసి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు శిక్షణా ధ్రువ పత్రాలను మరియు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం కృషి



చేస్తోందని పేర్కొన్నారు.వివిధ పథకాల ద్వారా యువతకు అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాలు కల్పిస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు సంజీవ్,ఆకుల రామకృష్ణ,కె వి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడండి : ఆప్తా



**కోనసీమ బ్యూరో, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త )**

రాష్ట్రం లో జి ఓ 117 కు ప్రత్యామ్నంగా తెస్తున్న మార్పులో భాగంగా ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాల ను 1 మరియు 2 తరగతుల తో ఏర్పాటు చేసి, అందులో 1:30 ఉపాధ్యాయ మరియు విద్యార్థి నిష్పత్తి ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం లో ఇప్పుడు ఏర్పడే అనేక రకాల ప్రాథమిక పాఠశాల లో ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాల ల సంఖ్య అధికం. అందులో 20 నుండి 30 మధ్యలో నమోదు కల పాఠశాల ల సంఖ్య ఎక్కువ. అందువలన రాష్ట్రం లో ఏకోపాధ్యాయ పాఠశాల ల సంఖ్య ఎక్కువ అయ్యే ప్రమాదం ఏర్పడుతూ ఉంది. తరువాత కాలం లో ఏకోపాధ్యాయ పాఠశాల లు జీరో ఎన్రోల్మెంట్ తో మూత పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని గతములో ఉదాహరణలు చాలా ఉన్నాయి.ఈ ప్రమాదం రాకుండా ఉండాలి అంటే ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాల లో కూడా 1:20 ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రకారం పోస్టులు కేటాయింపు జరగాలని ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఆప్టా ,కోనసీమ అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షాన్వాజ్ హుస్సేన్లు వ్రాత పూర్వకంగా మానవ వనరులు శాఖ మంత్రి నారా లోకేష్ , ప్రాథమిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్కు తెలియజేశారు. అదేవిధంగా మోడల్ ప్రైమరీ పాఠశాల యందు ప్రధానోపాధ్యాయుడు గా సర్ఫస్ గా ఉన్న స్కూల్ అసిస్టెంట్ లను నియమించటం కంటే వారిని ప్రాథమికోన్నత పాఠశాల నియమించి వారి యొక్క విషయ పరిజ్ఞానం విద్యార్థులకు అందించిన ప్రయోజనం ఉంటుందన్నారు.ఆదర్శ ప్రాథమిక పాఠశాల లకు ప్రధానోపాధ్యాయుడు గా సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్ కల్పించి నియమించాలి అని వారు డిమాండ్చేశారు.

# అంతరాష్ట్ర నేరస్తులు అరెస్ట్..
# 40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం : ఎస్పీ బి కృష్ణారావు

**కోనసీమ బ్యూరో, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

అమలాపురం పట్టణం, కురసాల వారి వీధిలో ఒక డాబా ఇంటిలో జనవరి 12న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపు బోల్ట్ తీసి ఇంటిలోనికి ప్రవేశించి యజమాని గదిలో నిద్రిస్తున్న సమయంలో బీరువాలోని బంగారు నగలు, నగదు దొంగలించా రని జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు తెలిపారు. దీనిపై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు లో భాగంగా ముగ్గురు ముద్దాయిలనుఅరెస్ట్ చేశామని ఎస్పీ చెప్పారు. నరసరావు పేట మండలం, వమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు ,రాజుపాలెం మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా కు చెందిన కాట్ల కిషోర్ బాబు లు ఇంటి తలుపుల టవర్ బోల్ట్ ను తీసి లేదా ఐరన్ రాడ్ తో తలుపు గెడను తీసి నేరం చేయడం




లో వీరు మంచి నేర్పర్లు... ఈ ముగ్గుర్ని నరసాపురం వద్ద ఆదివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 40 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి బి కృష్ణారావు తెలిపారు. 400 గ్రాములు బంగారం, 500 గ్రాములు వెండి,ఆరు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, అమలాపురం టౌన్ స్టేషన్ లో మూడు కేసులు తూర్పుగోదావరి రెండు, ఏలూరు లో మూడు, గుడివాడలో ఒకటి, నంద్యాల రెండు, కడప ఒకటి, కర్నూల్ ఒకటి, అనంతపురం ఒకటి వెస్ట్ గోదావరి ఒకటి అన్నమయ్య జిల్లాలో ఒక కేసు నమోదయిందని ఎస్పీ చెప్పారు. సుమారు 13నేరాల్లో ముద్దాయిలుగా వున్నారన్నారు. వీటితో పాటు మరో నాలుగు కేసుల్లో నిందితులని ఆయన తెలిపారు. అమలాపురం కురసాల వారి వీధిలో 2024 ఒక దొంగతనం, అమలాపురం పట్నం గాంధీ నగర్ లో 2023లో మరొక దొంగతనం చేశారన్నారు. ఈ కేసును అమలాపురం, డి. యస్ .పి, టి.యస్.ఆర్. కే ప్రసాద్, పట్టణ సీఐ పి. వీరబాబు, అమలాపురం టౌన్ క్రైమ్ సీఐ ఎం. గజేంద్ర, పట్టణ ఎస్ ఐ కిషోర్ బాబు సిబ్బందిని ఎస్.పి బి.కృష్ణారావు అభినందించారు.

# సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలి : జమ్మలమడక



**కాకినాడ రూరల్ , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు తక్షణం అమలు చేయాలని వైకాపారాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి డిమాండ్ చేశారు.ఒక ప్రకటన లో జమ్మలమడక మీడియాతో మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 11 నెలలు కావస్తుందని అధికారం లోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం పథకాల అమలు చేయలేక ఢీలాపడిందని ఎద్దేవా చేశారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని ,పిల్లల చదువుకు ఇబ్బం దులు తలెత్తకుండా వైసీపీ ప్రభుత్వంలో అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి అమ్మవడి పథకాన్ని ప్రవేశ పెట్టి పిల్లలు బాగా చదవాలని లక్ష్యం తో ప్రవేశ పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. తల్లికి వందనం పథకం అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అధికార పార్టీపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని జమ్మలమడక అన్నారు.

# ర్యాలి,శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు

**కోనసీమ బ్యూరో, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో ఆదివారం వేకువజాము నుండి భక్తులు గ్రామస్థులు శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని, ముడుపులు,మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం సిరిమానోత్సవం, తీర్థం, ఊయల సేవ, అత్యంత వైభవంగా నిర్వహించినట్లు .కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు,మజ్జిగ, ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.



# రెట్టించిన ఉత్సాహం..కిక్కిరిసిన సమావేశం

**గోపాలపురం, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎవరూ ఎవరికి భయపడాల్సిన పని లేదని రాష్ట్ర మాజీ హెూంమంత్రి, నియోజకవర్గ ఇన్చార్జ్ తానేటి వనిత అన్నారు. గోపాలపురంలో మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షులు వెలగ శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వనితతో పాటు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలు పాల్గొని మాట్లాడుతూ కార్యకర్తలకు నూతన ఉత్తేజం కలిగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు పాల్గొన్నారు. దింతో సభా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వనితా మాట్లాడుతూ ఇటీవల కాలంలో కూటమి నాయకులు వైసీపీను నామ



రూపాలు లేకుండా చేస్తామని ప్రగాల్భాలు పలుకుతున్నారని, అటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. భూమ్యాకాశాలు ఒకటైనా, సూర్యచంద్రులు ఏకమైన వైసీపీను, వైఎస్ జగన్ను టచ్ చెయ్యలేరన్నారు. చెల్లుబోయిన వేణుగోపాల్ మాట్లాడుతూరాజకీయాలు అంటేనే ప్రజా సేవని దివంగత నేత వైఎస్సార్ నిరూపించారని అన్నారు. కార్యకర్తకు ఆపదొస్తే తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైసీపీ విజయానికి కష్టించాలని కార్యకర్తలకు చెల్లుబోయిన సూచించారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని గెలిచిన వారందరూ గొప్పోళ్లు, ఓడిన వాళ్ళందరూ చెడ్డోళ్ళు కాదన్నారు. వైసీపీ ఓడిపోయినందుకు కార్యకర్తలేవరు నిరూత్సాహ పడొద్దని, రాబోయే రోజుల్లో వైసీపీదే అధికారమని ధీమా కల్పించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చ లేకపోయరని విమర్శించారు. ఈ సందర్భంగా అనుబంధ విభాగాల్లో పదవులు చేపట్టిన వారందరికి అభినందనలు తెలిపారు. అదేవిధంగా పహాల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళి గా కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ విస్తృత స్థాయి సమావేశాన్ని భారీగా విజయవంతం చేసినందుకు ప్రతి కార్యకర్తలు, నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు లలిత, సీనియర్ నాయకులు ఇళ్ల భాస్కరరావు, కూసం రామ్మోహన్ రెడ్డి, సాలి వేణు, ఏస్కె వలీ, అన్సర్ బాషా తదితర నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష గులాబీల పుష్పార్చన



**అమలాపురం, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త )**

మండలంలోని లూటుకుర్రు గ్రామం బోనం వారి మెరకలో వేంచేసియున్న గ్రామదేవత శ్రీ పళ్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారి సన్నిధిలో ఆదివారం పలు పూజలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలచే సామూహిక అష్టోత్తర శతకలశ పూజ,సామూహిక కుంకుమార్చన,వివిధ పుష్పలార్చనలు,లక్ష గులాబీలతో పుష్పార్చ న,విశేష మహనివేదన కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరిపించారు.ఈదరాడకు చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాధ శర్మ పర్యవేక్షణలో వేద పండితులుచే గణపతి, మహాకాళి, లక్ష్మి, సరస్వతి, ఆదిమూల శాంతి హెూమాలు, పూర్ణా హుతి, నీరాజన మంత్ర పుష్పం పండిత సత్కారం తదితర పూజా కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపించారు.అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## వైసిపి కొవ్వొత్తుల ర్యాలీ

**అమలాపురం, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త )**

ఉగ్రవాదం పై వైసీపీ పోరులో బాగంగా అమలాపురం లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమలాపురం అసెంబ్లీ నియోజక వైసిపి ఇంచార్జ్ పినిపే శ్రీకాంత్ ఆద్వర్యంలో హై స్కూల్ సెంటర్ నుంచి గడియారం స్థంభం సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం ఉక్కు పిడికలి బిగించాలని, రాక్షసులను వేరు వేయాలని ఈ సందర్భంగా శ్రీకాంత్ అన్నారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణ రావు,మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి,వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసం –వు,ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి,దంగేటి రాంబాబు, వంటెద్దు వెంకన్నాయుడు,సుదా గణపతి,గుత్తుల చిరంజీవి, కేతా భాను తేజ,చీకట్ల కిషోర్ గుమ్మల్ల సురేష్,తోరం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పవరంలో అంగరంగ వైభవంగా నేరెళ్ళమ్మ జాతర

**కాకినాడ రూరల్ , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో గ్రామ దేవత నేరేళ్ళమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా గ్రామస్తులు నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శనివారం రాత్రి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నానాజీకి ఘన స్వాగతం పలికారు. కన్నులు పండుగగా మిరుమిట్లు కొలిపే బాణాసంచా కాల్చారు. గ్రామంలోని పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు , ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం బాలు రైడర్స్, హరిని సౌండ్స్ వారిచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమం యువతను ఉర్రూతలూగించింది. పుల్ల వారి ఆడపడుచు గా పూజలందుకుంటున్న నేరెళ్లమ్మ తల్లిని ఆదివారం ఉదయం నుంచి గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి ఆశీస్సులు తీసుకున్నారు.కమిటీ సభ్యులు భారీ ఎత్తున మాంసాహారాలతో భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఆదివారం ఉదయం నేరెళ్ళమ్మ ఉత్సవాలలో భాగంగా గంప కొట్టు కార్య క్రమానికి గ్రామం లోని యువత పాల్గొని సందడి చేశారు.



# గండేపల్లి ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం..చైర్మన్ గా గుర్రాల శేఖర్



**గండేపల్లి , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం జరిగాయి. 9 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో చైర్మన్ గా గుర్రాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముకూరి శ్రీను లను ఎన్నుకున్నారు. అనంతరం వీరంతా గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్ బొల్లంరెడ్డి రామకృష్ణ, గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యలమాటి కాశి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే,తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండల సభ్యులు జ్యోతుల నెహ్రూ ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఏకగ్రీవంగా ఎన్నికైన గండేపల్లి ఫిషర్మెన్ సొసైటీ చైర్మన్ గుర్రాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముకూరి శ్రీను, సభ్యులుగా కోడెల్లి గంగరాజు, దొడ్డి భూషణం,గంధం వెంకటేశులు,గుర్రం సుందర్రావు,ముప్పిడి శాంతారావు,బొట్ట అభిమన్యుడు,ధార చంద్రావులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం చైర్మన్ శేఖర్ మాట్లాడుతూ గండేపల్లి ఫిసరమెన్ సొసైటీ మరింత అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యే నెహ్రూ సహకారంతో ముందుకు తీసుకెళ్తానని ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీ లను, మత్స్యకారులకు అందించే ఆదరణ పథకాలను తీసుకొస్తానని అన్నారు. కార్యక్రమంలో దారా కాటయ్య, బొట్ట చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులో రోడ్ల మెటల్..తరలించేది బండ రాళ్లు!..ఈ తికమక అధికారులకెరుక

**రౌతులపూడి , ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని ములగపూడి సర్వే నంబర్ 1, ఎస్ పైడిపాల సర్వే నంబర్లు 15,1, తిరుపతమ్మ పేట సర్వే నంబర్ 90, రాఘవపట్నం సర్వేనెంబర్ 252, ఉప్పంపాలెం సర్వే నంబర్లు 1,256,చిన మల్లాపురం139లో నల్ల రాతి కొండలు ఉన్నాయి. ఈ కొండల నుండి నల్లరాయి త్రవి వ్యాపారం చేసుకోవడానికి అరకొర విస్తీర్ణం తో లీజ్ కోసం భూగర్భ గనుల శాఖకు దరఖాస్తు చేస్తారు. ఈ దరఖాస్తులో రోడ్డు మెటల్ సైజ్ అని గుత్తేదారులు పేర్కొంటారు.40 ఎం ఎం,20 ఎం ఎం, 12 ఎం ఎం, చిప్స్ వంటి సైజులు రోడ్డుమెటల్ లో ఉపయోగిస్తారు. ఈ సైజులు రోడ్డుమెటల్ తో పాటు గృహ నిర్మాణాలకు ఉపయోగిస్తారు. అలా కాకుండా భారీ బండరాళ్లను యదేచ్ఛగా రవాణా చేస్తూ గుత్తేదారులు సొమ్ములు చేసుకుంటున్నారు. రిగ్ బ్లాస్టింగ్ తో కొండలను పిండి చేస్తున్నారు.



# తిరుమల అవగాహన సదస్సుకు భారీగా హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 27 ( ప్రభాతవార్త ) :**


కాతేరులో తిరుమల విద్యాసంస్థల ప్రాంగణం లో ఆదివారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి అనూహ్య స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఈ సదస్సుకు సుమారు 15 వేల మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన పిల్లలు నిలబడాలంటే స్కూల్ స్థాయినుండే ఐఐటి, నీట్ పరీక్షలకు సంబంధించిన సిలబస్ ను వారికి అందించాలి అప్పుడే వారు పరీక్షలలో ఎటువంటి ఒత్తిడి లేకుండా వ్రాయగలుగుతారన్నారు, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు దూరంగా ఉంచాలని సూచించారు. చిన్నవయస్సునుండే పిల్లలు సోషల్ మీడియాకి అలవాటుపడి తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని అన్నారు. తమ పిల్లలు భవిష్యత్తులో ఐఐటి మరియు ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి కళాశాలలలో



విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయినుండే ఐఐటి, మెడికల్ ఫౌండేషన్ అవసరం పై విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజనిదేవి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంటుందని ముఖ్యంగా పిల్లల ఎదుగుదల, మంచి నడవడిక, అభివృద్ధిలో తల్లిపాత్ర వెలకట్టలేనిదని, ప్రతి తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను వారికి అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు. పిల్లలు తమ తల్లిదండ్రులను అనుకరిస్తారని, తల్లిదండ్రులే వారికి రోల్ మోడల్ గా ఉండాలని, ప్రతి తల్లి తమ పిల్లలను సరైన మార్గంలో పెంచినట్లయితే సమాజమంతా ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉంటుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ కు ఎక్కువగా అలవాటు పడ్డారని వారికి పుస్తకాలతో కన్నా మొబైల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడిపితే కలిగే నష్టం గురించి తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు. ఈ సదస్సులో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి. సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి. శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల బుచ్చిబాబు, ఎవిన్వి సత్యనారాయణ (నాని మాస్టారు), విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# డిజిటల్ సంబంధాలు తాత్కాలికమే!

కొందరు అప్పుడే పరిచయమైన వ్యక్తితో స్నేహంగా మాట్లాడతారు. ఆ తరువాత కొనసాగించరు. కొందరు తన అభిప్రాయాలతో ఏకీభవించేవారితోనే మాటలు కలుపుతారు. ఇద్దరి మధ్య స్నేహం గట్టిపడేలోపే వారిని పక్కన పెట్టేస్తారు. ఇటువంటి స్వల్పకాలిక డిజిటల్ సంబంధాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.



మనసుకు నచ్చినవారు దూరంకావడం, వాళ్లతో ఏర్పడిన సంఘర్షణ, కోపం నుంచి తప్పించుకోవడానికి ఇటువంటివి తాత్కాలిక స్నేహాలు ఆశ్రయిస్తారు. మనసులోని ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి కూడా ఈ బంధంలోకి వెళతారు. పరిచయమైన తర్వాత ఒకరికొకరు అవతలివారికి నచ్చేలా సందేశాలను మార్పిడి చేసుకోవడం, రెండుమూడు రోజులపాటు మీమ్స్‌ను పంచుకోవడం వరకూ ఇది ఉంటుంది. సమాచార రూపంలో చిన్న చిన్న సంభాషలూ ఉంటాయి. మనసుకు తాత్కాలిక సంతోషాన్ని అందిస్తుంది. ఇందులో అంతగా గాఢత ఉండదు. ఎంత త్వరగా ఈ బంధం ఏర్పడుతుందో అంతే త్వరగా ముగిసిపోతుంది. దీనివల్ల మనసుపై ప్రభావం కూడా తక్కువగా ఉంటుంది. మరోరకంలో దీర్ఘకాలిక సంభాషణలు సాగుతాయి. ఇరువురి అభిప్రాయాలు ఒకరికొకరు పంచుకుంటారు. అయితే ఎక్కువకాలం ఇది నిలుస్తుందనే లోపు చిన్న చిన్న తేడాలతో బంధానికి తెర పడుతుంది. దీన్నుంచి బయటకొచ్చిన తర్వాత ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఒంటరితనాన్ని దగ్గర చేస్తుంది. దీంతో వెంటనే మరొకరితో స్నేహం మొదలుపెట్టడానికి ఎదురుచూస్తారు. అవతలివ్యక్తితో నిజమైన బంధాన్ని ఏర్పరచుకోవాలంటే ఆలోచించి అడుగులు వేయాలి. అవతలివారి ప్రవర్తనలో స్థిరత్వం, సంభాషణలో మృదుత్వం వంటివి గమనించాలి. అవతలి వారి ప్రవర్తన మర్యాదపూర్వకంగా ఉండాలి. మన అభిప్రాయాలకు విలువనివ్వాలి. అలాకాకపోతే వెంటనే వెనకడుగు వేయడం మంచిది. మనకంటూ సరిహద్దులను నిర్దేశించుకోవడం, ఏం కావాలో నిర్ణయించుకోవాల వంటి వాటికి ప్రాధాన్యతనివ్వాలి. అప్పుడే మంచి బంధం దొరుకుతుంది. ◆

# చదువుకోవడానికి చక్కని చోటు

పిల్లలు – ఇష్టపడితేనే ఏ పని అయినా బాగా చేయగలరనే ఉద్దేశంతో అమ్మానాన్నలు చాలా వరకు అన్నీ వాళ్లకు నచ్చినట్లే ఉండేలా చూసుకుంటారు. అది తినే కంచమైనా పడుకునే మంచమైనా! మామూలుగా వాడుకునే ఈ వస్తువుల్లోనే అంత శ్రద్ధ చూపిస్తే –చదువు విషయంలో ఇంకెంత ఆలోచిస్తారు. అందుకు పరిష్కారం చూపిస్తూనే హోంవర్కులు చేసుకోవడానికీ, ఇష్టమైనవి చదువుకోవడానికీ వీలుగా రకరకాల స్టడీ టేబుళ్లు, రీడింగ్ నూక్స్‌లాంటివెన్నో వచ్చాయి. తక్కువ స్థలంలోనే ప్రత్యేకంగా కనిపించే ఈ రీడింగ్ నూక్స్‌లో ఇప్పుడు బోలెడన్ని వెరైటీలొచ్చి చిన్నారుల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. బుజ్జాయిలకు చిన్నతనం నుంచే పుస్తకాలు చదివే అలవాటు చేయాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం మంచి మంచి పుస్తకాలు కొనివ్వడేమ కాదు, పిల్లలు దగ్గర ప్రశాంతంగా కూర్చుని చదువుకునేలా తగిన ఏర్పాట్లు చేయాల్సిందే. ఉన్న చిన్న ఇంట్లోనే ఆ సౌకర్యం కావాలంటే ఈ రీడింగ్ నూక్స్‌ను ప్రయత్నించొచ్చు. ఖాళీ సమయాల్లో నచ్చిన పుస్తకాలు చదువు కోవాలన్న కాలక్షేపానికి పత్రికలు, పజిల్ బుక్స్ లాంటివి తిరిగేయాలన్నా అందుకు ఇవి సరిగ్గా సరిపోతాయి. ఇంకా పరీక్షలప్పుడు వీటిల్లో కూర్చుని ఏకగ్రతతో చదువుకోవచ్చు. ఎన్నెన్నో ఆకారాల్లో ఆకట్టుకునే వీటి లోపల పుస్తకాలు పెట్టుకోవడానికి అరలూ, కూర్చోవడానికి మెత్తడి పరుపుల్లాంటివ అందమైన అమరికల్లోఉంటాయి.

హాల్లో కిటికి దగ్గర ఇంట్లో, ఓ మూలకో రెండు గదుల మధ్య ఉన్న ఖాళీ స్థలంలోనో, మెట్లకిందనో.. ఇలా ఎక్కడైనా ఈ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇంటీరియర్‌కు తగ్గట్టుగా ఉన్న ఆ కొంచెం స్థలంలోనే చదువుకోవడానికి, పుస్తకాలు పెట్టుకోవడానికి సరిపోయేలా తీర్చిదిద్దుకోచ్చు. ఆహ్లాదకరంగా కనిపించడానికి నచ్చిన బొమ్మల థీముల్లో వాటికి పెయింటింగ్స్ వేసుకోవచ్చు. ఇలా ముందుగానో ఇంటి గోడలకు కలిపి కట్టుకోవడమే కాదు విడిగా ఈ రీడింగ్ నూక్స్ పెటప్స్ కూడా



దొరుకుతున్నాయి. రకరకాల బొమ్మల ఆకార్లోని వీటిల్లో చిన్నారులు మెచ్చి దాన్ని తెచ్చుకుని కావల్సిన చోట పెట్టుకోవచ్చు. ఏ మాత్రం ఏమాత్రం సమయం దొరికిన నచ్చిన పుస్తకం పట్టుకుని అందులో కూర్చుని హాయిగా చదువుకుంటూ ఉహాల్లోకి వెళ్లిపోతారు. అంతేనా.. ఇంటికి కొత్తగా అందాన్ని తెచ్చిన రీడింగ్ నూక్స్‌ను చూసిన అతిథులూ సూపర్ ఐడియా మా పిల్లలకు ఇలాంటి సెటప్ ఏర్పాటు చేయిస్తాం అంటూ మీ అభిరుచిన కాపీ కొట్టేసినా ఆశ్చర్య పోనక్కరలేదు. ◆

# ఆమ్ పన్నా

వేసవిలో శరీరాన్ని చల్లబరచే స్వాదిష్ట పానీయం ఆమ్ పన్నా దీన్ని సులభంగా తయారుచేసుకోవచ్చు. మామిడి గుజ్జుతో తయారయ్యే ఈ పానీయం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రస్తుతం పుల్లని పచ్చి మామిడి కాయలు లభ్యమవుతున్నాయి. వీటిలో విటమన్ సి అధికంగా ఉంటుంది. వీటితో చేసిన ఆమ్ పన్నా తాగితే వేసవి తాపం తీరుతుంది. ఒక చెంచా జీలకర్రను తీసుకుని దోరగా వేయించి చల్లార్చాలి. పది పుదీనా ఆకులు, పావు చెంచా మిరియాలు, రెండు చెంచాల బెల్లపుపొడి,



తగినంత ఉప్పును ఒక మూకుడులో వేసి వేయించాలి. జీలకర్ర సహా వీటన్నింటిని మిక్సీలో మెత్తగా పొడి చేసి పెట్టుకోవాలి. రెండు మీడియంసైజు మామిడికాయలను తీసుకుని వాటిని ప్రెషర్‌కుక్కర్‌లో మెత్తగా ఉడికించాలి. ఈ మామిడి కాయల తొక్కలను తీసి లోపల గుజ్జును తీయాలి. ముందుగా చేసుకున్న పొడిని ఈ గుజ్జును మిక్సీలో వేసి బాగా తిప్పాలి. దీనికి ఒక కంటైనర్‌లో భద్రపరచుకోవాలి. ఇది పదిరోజుల దాకా పాడవదు. ఈ మిశ్రమాన్ని గ్లాసులో సగం వేసి చల్లటి నీళ్లలో కలుపుకోవాలి. సోడాలో కలుపుకున్నా బాగుంటుంది. కేవలం మామిడి రుచి మాత్రమే కావాకునుకొనే వారు పుదీనా ఆకులు వేయాల్సిన అవసరం లేదు. ◆

**ఆధ్యాత్మికం**

# దేవుని చూడాలా?

ఒక వ్యక్తి జ్ఞానిగా పేరు పొందిన ధ్యానిని, జ్ఞానిని దర్శించి 'స్వామీ! నేను దేవుని చూడాలని తహతహలాడుతున్నాను. ఆయన నాకు దర్శనం ఇవ్వటం లేదు' అని అన్నాడు. ఆ జ్ఞాని దేవుడు రావాలంటే నీవు పోవాలి, ఆయన వస్తేనీవు ఉండవు. అది సంగతి' అన్నాడు. కొంచం అర్థమయేట్టు చెప్పు స్వామీ' అన్నాడు ఆ వ్యక్తి. 'నేను' అన్నది నీలో పోతే ఆయన వస్తాడు. లేదా దేవుడు వస్తే 'నేను' అనే స్పృహ నీకుండదు' అన్నాడు జ్ఞాని ఆ వ్యక్తి కొంత ఆలోచనలో పడ్డాడు. జ్ఞాని చెబుతున్నది చూచాయగా అర్థమవు తున్నదని అన్నాడు. 'అయినా స్వామీ! ఆయన వచ్చినప్పుడు 'నేను' ఉండకపోతే ఆయన పోయిన తరాతైనా ఆయన్ని వచ్చిపోయినట్టు నాకు తెలుస్తుందా?' అన్నాడు. 'తెలుస్తుంది బాగా' అన్నాడు జ్ఞాని. అది ఎలా సాధ్యం? అని ప్రశ్నించాడు ఆ వ్యక్తి. ఎలా అని చెప్పటం కష్టమే కానీ ఒక చిన్న ఉదాహరణ ద్వారా చెబుతాను. నీవు ఒక నగరానికి వెళ్లి ఒక లాడ్జిలో గది తీసుకుని నిద్రించావు. ఉదయాన కాలకృత్యాలు తీర్చుకుని, ఫలహారం చేసి, గది తాళం మేనేజర్‌కు ఇచ్చి ఏదో పనిపై బయటికి వెళ్లి తిరిగి సాయంత్రం గదికి వచ్చావు. గది అంతా శుభ్రంగా ఉంది. పడక బాగా సర్ది ఉంది. స్నానపు గదిలో ఫినాయిల్ వాసన ఇంకా వస్తూ ఉంది.

నీకు ఏమి అర్థమవుతుంది? నీవు గదిలో లేని సమయంలో ఎవరో వచ్చి అంతా శుభ్రం చేసి పోయాడని తెలుస్తుంది. అలాగే దేవుడు నీలోకి వచ్చినప్పుడు నీవు (నీ అహం) ఉండకపోవచ్చు. కానీ ఆయన పోయి, నీ అహం మేల్కొన్నప్పుడు ఆయన వచ్చిపోయిన గుర్తులుగా నీ ముఖం ఎంతో వర్చస్సుతో వెలిగిపోతుంటుంది. నీలోని ప్రతి అణువులో ఆనందం తొణికిసలాడుతుంటుంది. నీ హృదయం స్వచ్ఛమైన ప్రేమతో స్పందిస్తూ ఉంటుంది. నీ దేహం యావత్తు సుగంధాన్ని వెదజల్లుతుంటుంది అన్నాడు జ్ఞాని.

- రాచమడుగు శ్రీనివాసులు

# కొలెస్ట్రాల్ తగ్గించే గ్రీన్‌బీన్స్

గ్రీన్ బీన్స్ ప్రత్యేక వంటకాల్లోనే కాదు రోజు తినే డైట్‌లోనూ వేసుకోవాలంటున్నారు పోషకాహార నిపుణులు. పచ్చని కూరగాయల్లో పోషకాలు పుష్కలంగా ఉండే గ్రీన్ బీన్స్ కూడా ఒకటి. వీటినే స్ట్రింగ్ బీన్స్, స్నాప్ బీన్స్ అని కూడా అంటారు. వీటిలో విటమిన్ ఏ, సి, కె, ఫోలిక్ యాసిడ్, మాంగనీస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు... శరీరానికి హానికారక మైన ఫ్రీరాడికల్స్‌ని తగ్గిస్తాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. గ్రీన్ బీన్స్‌లో ఉండే ఫైబర్, పొటాషియం, ఫోలేట్లు హైపర్టెన్షన్‌ను నియంత్రిస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గించి గుండెనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. ◆

# తినడానికీ ఓ పద్ధతి!

ఇంటర్వ్యూలో కూర్చునే విధానం, హావభావాలు గమనించుకోండి అని చెప్పడం విన్నారా? మాటలే కాదు. ముఖ కవళికలు మన గురించి బోలెడు విషయాలు చెప్పేస్తాయి. అయితే తినే తీరూ మన వ్యక్తిత్వాన్ని బయటపెడుతుందని తెలుసా?

ఒక్కో ముద్దనీ ఆస్వాదిస్తూ నెమ్మదిగా తింటారా? పనినీ మీరలాగే నెమ్మదిగా చేస్తారన్న భావన పక్కవారిలో ఉంటుం దట. ఇక వేగంగా తినేవారు. మల్టీటాస్కర్లే. చకచకా పని చేయడమే కాదు. .గడువుకన్నా ముందు పని ముగిస్తారట. కాకపోతే పనిలో పడి వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతారు అంటారు నిపుణులు.

అన్నం మధ్యలోనే ఉండాలి.కర్రీ రంగు మారకూడదు. ఇలా ప్రతిదీ పట్టించుకునేవారు అన్నీ ప్రణాళిక ప్రకారం సాగాలి అనుకుంటారట. ఇలాంటివారు చుట్టుపక్కల ప్రదేశాన్నీ శుభ్రంగా ఉంచుకుంటారట. ఇక ఇది తినను, అది వద్దని వంకలు పెడుతోంటే మిమ్మల్ని రిస్క్ తీసుకోనివారిగానే పరిగణిస్తారు. వీళ్లెప్పుడూ ఓటమి భయంతో కొత్తవే ప్రయత్నించరట. కంఫర్ట్‌జోన్ నుంచి బయటికి రాకపోతే విజయాలెలా సాధిస్తారు మరి?



కొందరు ఇంకా చిన్నపిల్లల్లానే ఎంత పెద్ద ప్లేట్ అయినా ఇవ్వనీ..చుట్టూ మెతుకులు పడాల్సిందే! కానీ వాళ్ల పక్కనుంటే సమయమే తెలియదట. పనినీ, చుట్టుపక్కల వాళ్లనీ ప్రేమిస్తారట. అయితే వీటన్నింటిలో పడి తుది గడువులు మర్చిపోవడమే వీరిలో లోపం. శబ్దం చేస్తూ తినేవాళ్లదీ వీరి తరహానే. కాకపోతే పక్కవాళ్లే కాస్త వీరిని ఇష్టపడరు. ఇక కొత్తవి ప్రయత్నించేవారు జీవితంలో సవాళ్లకు ఎదురెళతారు. రిస్క్ తీసుకుంటారు. ◆

# గుంతకల్లు రైల్వే డివిజన్ హై అలర్ట్

## నిఘా విభాగం విస్తృత తనిఖీలు

## సరిహద్దులన్నీ బంద్, భద్రతా దళాలతో గట్టి పహారా

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 27,ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో రైల్వే శాఖ పూర్తిగా అప్రమత్తమైంది. దాడికి కొన్నేళ్ల ముందే కేంద్ర నిఘా వర్గాల సమాచారం మేరకు ఉత్తరాది,దక్షిణాది, తూర్పు,పడమర రాష్ట్రాలకు వెళ్లే రైలు సర్వీసులన్నీ దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్లు డివిజన్, గుంతకల్లు జంక్షన్ మీదుగా వెళ్తాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంతకల్లు రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఈ స్టేషన్లకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరికలు రావడంతో రైల్వే అధికార యంత్రాంగం ప్రయాణికుల రక్షణ, భద్రతలకై సత్వర చర్యలను ముమ్మరం చేసింది. గుంతకల్లు రైల్వే పరిసరాలలో రైల్వే శాఖ తాజాగా చేపడుతున్న చర్యలు ఇటీవల రాష్ట్ర నిఘా విభాగం, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు నిఘా విభాగం అధికారులు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు జంక్షన్ కేంద్రంలో పర్యటించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. స్థానిక రైల్వే జంక్షన్, స్టేషన్‌లలో ముమ్మరంగా రైల్వే సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. గుంతకల్లు రైల్వే స్టేషన్/జంక్షన్‌లో అకస్మాత్తుగా సంభవించే ప్రమాదాలు, ఉగ్రదాడులను,ఆస్తులకు సంబంధించిన నేరాలు,రైళ్లలో చోరీలు, అక్రమ మాదకద్రవ్యాల సరఫరా, పండుగ వేళలో అధిక రద్దీ



రైల్వే జంక్షన్‌లో లగ్గేజీ స్కానర్

సమయంలో విదేశీయుల రాకపోకలపై కదలికలు,మహిళల అక్రమ రవాణా రైల్వే యూనియన్,రాజకీయ పార్టీలు ధర్నాలు,రాస్తారోకోలు జరిగిన పక్షంలో రైల్వే స్టేషన్‌లో ఎలాంటి ప్రాణ,ఆస్తినష్టం వాటిల్లకుండ ఉండేందుకు ఏవిధమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి, ఎలాంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది వంటి కీలకమైన వివరాలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అనంతపురం జిల్లా ఇంటెలిజెన్స్ డిఎస్‌పి రాంబాబు ఆద్వర్యంలో సంబంధిత విభాగాలకు చెందిన సిబ్బందితో నిఘావిభాగం అధికారులు రైల్వే ట్రాక్,రైల్వే స్టేషన్,ప్లాట్ ఫారాలతో పాటు అనుమానస్పద ప్రదేశాలను విస్తృతంగా తిరిగి పరిశీలించారు. అనంతరం అవసరమైన సదుపాయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా చర్చించి ఇందుకు సంబంధించి సమగ్ర నివేదికను కేంద్ర,రాష్ట్రాలకు పంపుతున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. అభిజ్ఞ వర్గాల సమాచారం మేరకు,గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన ముందస్తు సమాచారంతో గుంతకల్లు రైల్వే డివిజన్ పూర్తిగా అప్రమత్తమైంది. ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొని తిప్పి కొట్టేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించినట్లు సమాచారం. గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు, రైల్వే ప్రాంతాలలో ఇకపై గట్టి భద్రత,రక్షణ కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. రైల్వే జంక్షన్‌లో తాజాగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన లగేజీ స్కానర్‌లను, సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు తమతమ లగేజీని స్కానర్ ద్వారా స్కాన్ చేసిన తర్వాతనే రైల్వే స్టేషన్‌లో వెళ్లాల్సి ఉంటుంది. రైల్వే ప్రాంతాలకు, పట్టణానికి మధ్య ఉన్న రహదారులను మూసివేసి సరిహద్దు భద్రతా దళాల సూచనల మేరకు ఎత్తైన సరిహద్దు గోడలను పటిష్టంగా నిర్మించాలని,నిత్యం రేయింబవళ్లు గట్టి భద్రతను పహారా కల్పించనున్నట్లు సమాచారం. రైల్వే స్టేషన్, అనుమానస్పద, సున్నిత ప్రదేశాలు,కార్యాలయాలతో పాటు రైల్వే కాలనీ పరిసర ప్రాంతాలలో తాజాగా సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని రేయింబవళ్లు పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా సెల్‌ను ఏర్పాటు చేశారు. అలాగే అధిక జనసమ్మర్థ ప్రాంతాల్లో అనుమానితుల లగేజీ, పార్సిల్స్‌లను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా స్క్వాడ్ బృందాలతో పాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ప్రత్యేక బృందాలచే విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లలో అధికారులు

## రోజూవారీ సమీక్షలు నిర్వహిస్తున్న ముఖ్యకార్యదర్శి స్మితా సబర్వాల్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిఏర్పాట్లను ముమ్మరం చేసింది. మే 7 నుంచి 31 వరకు జరగనున్న మిస్ పోటీల షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన కార్యక్రమాలు,ఏర్పాటు,వసతి తదితర అంశాలపై టూరిజం,కల్చరల్ శాఖ అధికారులు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ పోటీల్లో పాల్గొనే వారు సందర్శించే అన్ని ప్రదేశాలను పర్యాటక ఉన్నతాధికారులు సందర్శించి ఏర్పాట్లపైన సమీక్షించారు.చౌమహల్లా ప్యాలెస్, రామప్ప, యాదాద్రి, పోచంపల్లిలో పరిశీలన పూర్తి చేశారు. మే6 విదేశాల నుంచి వచ్చే పోటీదారులు, మీడియా ప్రతినిధులు, ప్రోగ్రాం ఆర్గనైజర్లకు స్వాగత ఏర్పాట్లపై టూరిజం,కల్చరల్ మంత్రి జూపల్లి, సెక్రటరీ స్మితా సబర్వాల్‌లు అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు.గద్వాల్ సిల్క్, గొల్లభామ కాటన్, నారాయణపేట వస్త్రాలకు సంబంధించిన స్టాల్స్‌ను పోచంపల్లిలో ఏర్పాటు చేస్తున్నారు.తెలంగాణ హ్యాండ్లూమ్ అనే థీమ్ పెడుతున్నారు.మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే మోడల్స్‌తో చేనేత దుస్తులు ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం స్థానిక,అంతర్జాతీయ డిజైనర్లను ఆహ్వానిస్తోంది.విదేశీ యువతులంతా చేనేత దుస్తులు ధరిస్తే ఆ రంగానికి చేయూతనిచ్చినట్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పోచంపల్లి, గద్వాల, నారాయణ పేట వస్త్రాలతో సరికొత్త డిజైన్లతో దుస్తులు తయారు చేసిధరింపచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు హస్తకళలకు పెద్దపీట వేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ పోటీల్లో జరిగే కార్యక్రమాల్లో రాష్ట్రానికి సంబంధించిన హస్తకళలైన సిద్దిపేట చేర్యాల బొమ్మలపై పెయింటింగ్స్, నిర్మల్ బొమ్మలు,కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ,వంటి కళాకృతులను స్టాళ్లలో ఏర్పాటు చేయనున్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే మోడల్స్‌ను ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడి ప్రాధాన్య తలను వివరించనున్నారు.తద్వారా అంతర్జాతీయంగా ఆ ప్రాంతాలకు గుర్తింపు లభించి టూరిజం వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.దీంతో పాటు మే 15న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోనున్నారు.

అనంతరం పోచంపల్లి వెళ్లే లా టూరిజం శాఖ ప్లానింగ్ లో ఉన్నప్పటికీ కొన్ని మార్పులుచేసే అవకాశం ఉన్నట్లు కన్పి స్తోంది. ఒకేరోజు రెండు చోట్ల పర్యటనలు పెట్టాలా వద్దా అనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సమయాన్ని బట్టి యాదగిరిగుట్టపై ఒక డాక్యుమెంటరీ చేయనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం.


# మత్స్యకారులకు ఆర్థికసాయం రెట్టింపు: ఎపి మంత్రి సవిత



**విజయవాడ, ఏప్రిల్ 27,ప్రభాతవార్తప్రతినిధి:** చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ, మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యమని స్పష్టంచేశారు. ఆదివారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.మొదటి నుంచి టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు మేలు జరుగు తోందన్నారు. గతంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే వారన్నారు మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.గత ఎన్నికల ముందు చేపల వేట నిషేధ సయమంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలను రెట్టింపు చేస్తూ రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.259 కోట్లను అందజేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు లబ్ధిచేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత గుర్తు చేశారు. 2014లో తొలిసారిగా మత్స్యకారులకు ఆర్థికంగా సాయం అందించారన్నారు. 2014- 19 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం ఆనాటి చంద్రబాబు నాయుడి ప్రభుత్వం రూ.788 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆ నిధులతో పాటు వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా అందజేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చేపల వేట సమయంలో ప్రాణాలు కోల్పోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. చేపలవేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 555మత్స్యకార గ్రామాలున్నాయని, ఆయా గ్రామాల అభివృద్ధికి ఎన్నో మోలిక సదుపా యాలు కల్పిస్తున్నామని తెలిపారు. 201924 మధ్య జగన్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిపై చిన్నచూపు చూసిందన్నారు. ఫిష్ ఆంధ్ర అంటూ రూ.300 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క మత్స్యకారుని కుటుంబానికి కూడా ఎటువంటి మేలు జరగలేదని మంత్రి సవిత మండిపడ్డారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29శాతం ఏపీ నుంచే ఉంటోందన్నారు. మత్స్యసంపద ఎగుమతుల్లో 32శాతం ఏపీ నుంచే జరుగుతోందన్నారు.మత్స్యఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు.

# ఇప్పుడేమిస్తారు: ప్రధాని మోడీకి ఎపి సిపిఎం బహిరంగ లేఖ

**విజయవాడ, ఏప్రిల్27,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభం సందర్భంగా మే 2వ తేదీన విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నారు.ఈ సందర్భంగా ఆయనకు భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) బహిరంగ లేఖ రాసింది. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు లేఖను విడుదల చేశారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని 2014 ఎన్నికలకు ముందు మీరు, ఎన్డీఏ పార్టీలు హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణానికి అయ్యే ఆర్థిక వనరులు సమ కూర్చే బాధ్యత కేంద్రప్రభుత్వానిదేనని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొనబడిందని ఈ లేఖలో సీపీఎం ప్రధానికి వివరించింది. 2014లో అమరావతి శంకుస్థాపనకి మీరు విచ్చేసిన సందర్భంలో భారీగా నిధులు ప్రకటిస్తారని అప్పుడు ప్రజలు ఆశించారు. మీరు చెంబుడు నీరు, గుప్పెడు మట్టితో సరిపెట్టి రాష్ట్ర ప్రజల ఆశలను నీరు కార్చారు. సుమారు రూ.50 వేల కోట్లు అవసరమని కోరినా, గత 11సంవత్సరాల కాలంలో రూ.1500 కోట్లు మాత్రమే రాజ ధాని నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించింది. గత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని నీరుగార్చి, మూడు రాజధానుల పేరుతో వివాదాన్ని సృష్టించినా మీరు నోరు విప్పలేదు. కేంద్రం జోక్యం చేసుకోలేదు. హైకోర్టులో రాజధాని నిర్మాణానికి కేంద్రానికి సం బంధం లేదని అఫిడవిట్ దాఖలు చేశారు. 41 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు అమరావతిలో స్థలాలు కేటాయించినా, ఇప్పటివరకు అత్యధిక కార్యాలయాలు పనులు కూడా ప్రారంభించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మిగిల్చారు. 2014 సంవత్సరంలో రాష్ట్రంలో టిడిపి, బిజెపి ప్రభుత్వం రూపొందించిన పూలింగ్ చట్టంనేటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. రైతులు, కూలీలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. చట్టబద్ధమైన హామీలు అమలు కోసం, అమరావతి పరిరక్షణకోసం పోరాడిన వారిపై పెట్టిన కేసులు ఈ నాటికి రద్దుచేయలేదు.కేంద్రంలో మూడోసారి మళ్లీ మీరు అధికారంలోకి వచ్చారు. రాష్ట్రంలో మీరు భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కనీసం ఇప్పుడైనా రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేస్తారని ప్రజలు ఆశించారు. అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, హడ్కో తదితర సంస్థల ద్వారా రూ.31వేల కోట్లు అప్పులు మంజూరు చేయించే ప్రకటనలకే




ప్రధాని మోడీకి ఏపీ సీపీఎం రాసిన బహిరంగ లేఖను విడుదల చేస్తున్న వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు

పరిమితమయ్యారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1400 కోట్లు మాత్రమే గ్రాంటు ఇస్తుందని ప్రకటించారు. మళ్లీ అప్పులు, వడ్డీలతో సహా రాష్ట్రప్రజలే చెల్లించాలి. భవిష్యత్తులో ఇది భారంగా మారుతుంది. అమరావతి నిర్మా ణానికి లక్షకోట్ల రూపాయలు అవసరమవు తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మే రెండో తేదీ ప్రారంభ కార్యక్రమం సందర్భంగా విచ్చేస్తున్న మీరు అప్పులుకాకుండా స్పష్టంగా గ్రాంట్లు ఇస్తూ ప్రకటన చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆరు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు పూర్తి చేయడానికి నిర్దిష్ట చర్యలు ప్రకటించాలి. రాజధాని అమరావతితో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో స్పష్టమైన ప్రకటనచేయాలి. విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కుఏర్పాటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు పైన మీరు స్పందించాలి. రాజధాని అమరావతి, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందాలి.

కనీసం ఈసారైనా నిధులు, అభివృద్ధికి అవసరమైన స్పష్టమైన చర్యలతో రాష్ట్ర ప్రజలు ఆశించిన రీతిలో మీరు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ, అమరావతి ప్రాంత కమిటీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

# పది కాలాలు గుర్తుండే సినిమాను అందించాం

## 'సారంగపాణి జాతకం' సక్సెస్ మీట్‌లో దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ..

**సెన్సిబుల్ డైరెక్టర్** ఇంద్రగంటి మోహనకృష్ణ, నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ సక్సెస్ ఫుల్ కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' . శ్రీదేవీ మూవీస్ బ్యానర్ మీద నిర్మించిన ఈ చిత్రంలో ప్రియదర్శి, రూపా కొడవయూర్ జంటగా నటించారు. ఏప్రిల్ 25న విడుదలైన ఈ సినిమాకి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ఆదివారం (ఏప్రిల్ 27) నాడు ఫన్‌టాస్టిక్ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ , శివలెంక కృష్ణ ప్రసాద్‌తో నేను ఇది వరకు 'సమ్మోహనం', 'జెంటిల్ మెన్' చిత్రాలు చేశాను. ఇప్పుడు 'సారంగపాణి జాతకం' చేశాం. ఈ మూడు చిత్రాలు కూడా గొప్పవే. ప్రేక్షకులు పది కాలాలపాటు గుర్తు పెట్టుకునే సినిమాలు మా కాంబినేషన్‌లో వచ్చాయి. ఈ సినిమాను బ్లాక్ బస్టర్ హిట్ చేయాలని కోరుకుంటున్నాను. ప్రియదర్శి ఈ సినిమాలో అద్భుతంగా నటించారు. వైవా షార్ట్ ఫిల్మ్‌ను మా ఇంట్లో ఎప్పుడూ చూస్తూనే ఉంటాం. మంత్ ఆఫ్ మధు చూసినతరువాత హర్షను మరింత వాడుకోవాలని అనుకున్నాను. రూపా అద్భుతమైన నటి. ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ కానుంది. ఈ చిత్రాన్ని తీసే క్రమంలో తోడ్పడిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అన్నారు.

ప్రియదర్శి మాట్లాడుతూ. 'సారంగపాణి జాతకం' టీంతో పని చేయడం నా అదృష్టం. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన నా గురువు ఇంద్రగంటి మోహనకృష్ణ గారికి థాంక్స్. ఇలాంటి గొప్ప సినిమాలను గత 30 ఏళ్లు నిర్మిస్తూ ఉన్న నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ గారికి థాంక్స్. గొప్ప చిత్రాల లిస్ట్‌లో శివలెంక కృష్ణ ప్రసాద్ గారి పేరు.. ఆయన తీసిన సినిమాల పేర్లు ఉంటాయి.. అందులో ఎక్కడో చోట నా పేరు కూడా ఉంటుందని గర్వంగా ఉంది. రూప అద్భుతంగా నటించారు. వెన్నెల కిషోర్, వైవా హర్షలతో మళ్లీ కలిసి పని చేయాలని ఉంది. మా కోసం మళ్లీ సీక్వెల్ రాయండి (నవ్వుతూ). మాకు అండగా నిలిచిన డైరెక్షన్ టీంకు థాంక్స్. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్. మాకు ఇంతగా సపోర్ట్ చేసిన మీడియాకు థాంక్స్. కోర్ట్ తరువాత మళ్లీ అందమైన సారంగపాణి జాతకం ఓ వరంలా దొరికిందిఅన్నారు.

నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, 'సారంగపాణి జాతకం' సినిమాను ఆదరిస్తున్న మీడియాకి, ప్రేక్షకులకు థాంక్స్. ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి, ఇష్టపడి చేశాం. ఈ సినిమాను థియేటర్లో ఎంజాయ్ చేస్తేనే బాగుంటుంది. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సినిమాను చూస్తే వచ్చే కిక్కు వేరేలా ఉంటుంది. ఈ చిత్రం ముమ్ముందు మరింత పెద్ద విజయాన్ని సాధిస్తుందని నమ్మకంగా ఉంది. మా సినిమా టీజర్‌ను రిలీజ్ చేసిన విజయ్ దేవరకొండకి, ట్రైలర్ రిలీజ్ చేసిన నానికి, సినిమా విడుదల తర్వాత ఫోన్ చేసి అభినందించిన సాయి ధరమ్ తేజ్, శ్రీ విష్ణులకు థాంక్స్. అన్నారు. రూపా కొడవయూర్ మాట్లాడుతూ.. .'సారంగపాణి' చిత్రంలో అందరూ సీనియర్ యాక్టర్లే ఉన్నారు. ఇలాంటి వారందరితో కలిసి పని చేసే అదృష్టం నాకు వచ్చింది. ఇంద్రగంటి గారి డైరెక్షన్ అంటే నాకు చాలా ఇష్టం. నా కల నెరవేరినట్టుగా అనిపిస్తోంది. సెట్‌లో ఇంద్రగంటి గారు అందరినీ ఎంతో గౌరవంగా, ప్రేమగా చూసుకుంటారు. 'సారంగపాణి జాతకం' చిత్రానికి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మైథిలీ పాత్రతో అందరూ కనెక్ట్ అవుతున్నారు. దర్శితో నటించడం ఆనందంగా ఉంది. వెన్నెల కిషోర్, వైవా హర్ష కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమాను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను అని అన్నారు.



శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ. ఇంద్రగంటి మంచి రచయిత, దర్శకులు. దర్శి ఆల్ రౌండర్ నటుడు. రూపా అద్భుతంగా నటించారు. వెన్నెల కిషోర్ స్క్రీన్ మీద కనిపిస్తే చాలు థియేటర్లో అరుపులే. హర్ష నటన అంటే నాకు చాలా ఇష్టం. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన కృష్ణ ప్రసాద్ గారికి థాంక్స్ అన్నారు. వెన్నెల కిషోర్ మాట్లాడుతూ, ఇంద్రగంటి గారి సినిమా అంటే కారెక్టర్ అడగకుండా చేసేయాలి.. శివలెంక సినిమా అంటే కళ్లు మూసుకుని చేసేయాలి అని అన్నారు.

**కోలీవుడ్ స్టార్ సూర్య** కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రెట్రో'. పూజా హెగ్డే కథానాయిక. ఈ చిత్రం, మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. తెలుగునాట ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండటం విశేషం. 'రెట్రో' ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథి, ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, ముందుగా పహల్గాం బాధితులకు నివాళులు. సూర్య అన్న మూవీ ప్రమోషన్ కోసం నేను ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. నటుడిగా సూర్య అన్న అంటే నాకెంతో ఇష్టం. ఆయన సినిమాల ఎంపిక మిగతా నటుల్లో స్ఫూర్తి నింపేలా ఉంటుంది. రెట్రోతో సూర్య అన్న మరో ఘన విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. అగరం ఫౌండేషన్ ద్వారా సూర్య అన్న ఎందరో విద్యార్థులకు అండగా నిలబడుతున్నారు. ఆయన స్ఫూర్తితో నేను కూడా విద్యార్థులకు సాయం చేయాలి అనుకుంటున్నాను. మే 1న విడుదలవుతున్న రెట్రో సినిమాని అందరూ చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. అన్నారు. చిత్ర కథానాయకుడు సూర్య మాట్లాడుతూ, ముందుగా పహల్గాం బాధితులకు నివాళులు. రెట్రో వేడుకకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. కార్తీక్ సుబ్బరాజ్ సినిమాలు ప్రత్యేకంగా ఉంటాయి. రెట్రో ట్రైలర్ మీ అందరికీ నచ్చింది అనుకుంటున్నాను. ప్రకాష్ రాజ్, జోజు జార్జ్, జయరామ్ గారు, నాజర్ గారు లాంటి సీనియర్ నటులతో స్క్రీన్ షేర్ చేసుకోవడం హ్యాపీగా ఉంది. పూజ హెగ్డే నాకంటే ఎక్కువగా సినిమాని ప్రమోట్ చేస్తోంది. మీరు ట్రైలర్‌లో చూసినట్టుగానే.. లవ్, కామెడీ, యాక్షన్, ఇంటెన్సిటీ అన్నీ సినిమాలో ఉంటాయి. మే 1న విడుదలవుతున్న రెట్రో మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాన్ను అన్నారు.

# ఘనంగా 'రెట్రో' ప్రీ రిలీజ్ వేడుక



అతిథి, ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ, "ఇక్కడ చాలామంది సూర్య అభిమానులున్నారు. వారిలో నేను కూడా ఉన్నాను. గజినీ సినిమా చూసి.. ఒక సినిమా ఇలా కూడా ఉంటుందా? ఒక నటుడు ఇంత కష్టపడతారా? అనుకున్నాను. నేను సినీ పరిశ్రమలోకి రావాలి అనుకుంటున్నప్పుడు చూసిన సినిమా అది. సూర్యఎన్నో గొప్ప సినిమాలు చేశారు. ఇప్పుడు రెట్రోతో వస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ మేకింగ్ కొత్తగా ఉంటుంది. ఇలాంటి ట్రైలర్ కట్ నేనెప్పుడూ చూడలేదు. సినిమా కూడా ఇదే స్థాయిలో ఉంటుందని భావిస్తున్నాను. మే 1న విడుదలవుతున్న రెట్రో పెద్ద బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటూ, టీం అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు. ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "తెలుగులో రెట్రో సినిమాని విడుదల చేసే అవకాశమిచ్చిన సూర్యకి ధన్యవాదాలు. మిమ్మల్ని ఈ తరహా సినిమాలో చూడాలని తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ వేడుకకు విచ్చేసిన విజయ్ దేవరకొండకి, సోదరుడు వెంకీ అట్లూరికి థాంక్స్. అన్నారు. చిత్ర సహ నిర్మాత కార్తికేయన్ సంతానం మాట్లాడుతూ, "2 డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ తో కలిసి ఈ సినిమా నిర్మాణంలో భాగం కావడం సంతోషంగా ఉంది. మాటీం అందరికీ ఈ సినిమా ప్రత్యేకమైనది. అందరం ఎంతో కష్టపడి పనిచేశాము. సూర చాలా మంచి మనిషి. ఆయన నుంచి ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నాను. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విజయ్ దేవరకొండకి, వెంకీ అట్లూరికి ధన్యవాదాలు అన్నారు.

# 'హిట్3' లో చాలా ఇంట్రస్టింగ్ క్యారెక్టర్ చేశాను: హీరోయిన్ శ్రీనిధి శెట్టి



**నేచురల్ స్టార్ నాని** హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ కేస్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ చిత్రం, టీజర్, ట్రైలర్ పాటలతో విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మూవీ మే 1న పాన్ ఇండియాగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీనిధి శెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ సినిమాలో మీ క్యారెక్టరైజేషన్ ఎలా ఉండబోతుంది?**

ఇందులో మృదుల అనే పాత్రలో కనిపిస్తాను. అర్జున్ సర్కార్ క్యారెక్టర్ ఎలా ఉంటుందో మీరు టీజర్ ట్రైలర్‌లో ఆల్రెడీ చూశారు. ఇంటెన్స్ వైలెన్స్‌తో కూడిన క్యారెక్టర్ అది. వైలెన్స్‌తో పాటు ఆ క్యారెక్టర్‌లో చాలా యాంగిల్స్ ఉంటాయి. అర్జున్ సర్కార్‌కి డిఫరెంట్‌గా ఉండే క్యారెక్టర్ మృదుల. అర్జున్ సర్కార్ మృదుల మాట తప్పితే ఇంకెవరి మాట కేర్ చేయరు. మృదుల ఇండిపెండెంట్ క్యారెక్టర్. ఆ క్యారెక్టర్ లో కొన్ని లేయర్స్ ఉన్నాయి. చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ అది. మీరు సినిమా చూస్తున్నప్పుడే పూర్తిగా తెలుసుకోవాలి.

**ఈ కథలో మీ పాత్రకు ఎలాంటి ప్రాధాన్యత ఉంటుంది?**

నిజానికి ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్స్‌లో హీరోయిన్ పాత్రకు అంత ప్రాధాన్యత ఉండదు. కానీ డైరెక్టర్ శైలేష్ కొలను బ్రిలియంట్ రైటర్. మీరు హిట్, హిట్ 2 సినిమాలు గమనిస్తే ఒక్కొక్క సినిమాకి హీరోయిన్ క్యారెక్టర్జేషన్లో చాలా ఇంపార్టెన్స్ పెరిగి ఉంటుంది. కథలో హీరోయిన్ క్యారెక్టర్ కూడా బ్లెండ్ అయి ఉంటుంది. హిట్ 3లో కూడా హీరోయిన్ క్యారెక్టర్‌ని ఇంకా బెటర్ చేశారు. కథలో చాలా మంచి కనెక్షన్ ఉంటుంది. కథలో ఎంత ఇంపార్టెంట్ ఉందో సినిమా చూస్తున్నప్పుడు మీకే తెలుస్తుంది.

**నానితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

నాని సినిమాలన్నీ చూశాను. నేచురల్ పెర్ఫార్మర్. ఆయన చాలా గ్రౌండెడ్‌గా ఉంటారు. ఆయనతో వర్క్ చేయడం వెరీ వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్. చాలా కంఫర్ట్ ఇచ్చారు. అలాంటి కంఫర్ట్ జోన్ ఇస్తే పెర్ఫార్మన్స్ కూడా చాలా అద్భుతంగా ఉంటుంది.

**ఈ సినిమాకి మీరే డబ్బింగ్ చెప్పారని విన్నాం?**

అవును. చాలా ఇష్టంగా నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. ఆల్రెడీ నా క్యారెక్టర్ కోసం ఒక డబ్బింగ్ ఆర్టిస్ట్‌తో డబ్బింగ్ చెప్పించారు. అయితే డైరెక్టర్ గారిని నేను రిక్వెస్ట్ చేశాను. నా పాత్రకు నేనే డబ్బింగ్ చేస్తానని అడిగాను. డబ్బింగ్ చెప్పాను. నా వాయిస్ డైరెక్టర్ గారికి నచ్చింది. నేను చేసిన ఫస్ట్ తెలుగు సినిమాకి నా వాయిస్ ఉండడం చాలా ఆనందంగా అనిపించింది. ఓ కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగు అమ్మాయిలానే డబ్బింగ్ చెప్పాను.ఇది మీరు తెలుగులో చేస్తున్న మొదటి సినిమా.

**తొలి సినిమాకి ఏ సర్టిఫికెట్ రావడం ఎలా అనిపిస్తుంది?**

నేను కథవిన్నప్పుడే చాలా వైలెన్స్ యాక్షన్ ఉందనిపించింది. నిజానికి ఈ స్టోరీకి అలాంటి వైలెన్స్ యాక్షన్ కావాలి. ఈ సినిమా జోనర్ అటువంటిది.

**డైరెక్టర్ శిలేష్ కొలను గురించి ?**

నాకు ఇలాంటి ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ యాక్షన్ డ్రామా చేయడం నాకు ఫస్ట్ టైం. డైరెక్టర్‌గారు చాలా సపోర్ట్ చేశారు. ప్రతిదీ వివరంగా ఎక్స్లెయిన్ చేసేవారు. నాకు అన్ని నేర్పించారు. ఆయన చాలా మంచి ప్లానింగ్‌తో షూట్ చేస్తారు. ఆయన భవిష్యత్తులో అద్భుతమైన సినిమాలు చేసి మరెన్నో విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను.

**ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్** పతాకంపై నటి, నిర్మాత సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ఈ చిత్రానికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీని మే 9న విడుదల చేయబోతున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్ ఇలా అన్నీ కూడా ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఇక సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న తరుణంలో ఆదివారం శుభం చిత్రం నుంచి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.'శుభం'ట్రైలర్‌ను గమనిస్తే,ఊర్లోని మహిళలంతా కూడా సీరియల్‌ను చూస్తూ వింతగా ప్రవర్తిస్తుంటారు. దెయ్యం పట్టినట్టుగా మహిళలు ప్రవర్తిస్తుంటే.. వారి నుంచి తప్పించుకునేందుకు ఊర్లో పురుషులంతా కూడా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా సమంత స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చి ట్రైలర్ మీద మరింత ఇంట్రెస్ట్ కలిగించేలా చేశారు.'శుభం' ట్రైలర్‌ను

# 'శుభం' ట్రైలర్ విడుదల



చూస్తే ఈ చిత్రంలో హాస్యం, హార్రర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని రకాల అంశాల్ని జోడించినట్టుగా కనిపిస్తోంది. శుభం మే 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. వివేక్ సాగర్ బీజీఎం స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం ప్రధాన ఆకర్షణ కానుందని తెలుస్తోంది.

# 'యముడు' కొత్త పోస్టర్..

**ప్రస్తుతం మైథలాజికల్ టచ్** ఉన్న చిత్రాలు బ్లాక్ బస్టర్ హిట్లు అవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జగన్నాథ పిక్చర్స్ పతాకంపై జగదీష్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'యముడు'. ధర్మో రక్షతి రక్షితః అనే ఉప శీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన పోస్టర్‌ను మేకర్లు రిలీజ్ చేశారు. ఇది వరకు రిలీజ్ చేసిన యముడు టైటిల్ పోస్టర్, దీపావళి స్పెషల్‌గా రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా మరో పవర్ ఫుల్ పోస్టర్‌ను మేకర్లు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో యముడి రూపంలో జగదీష్ అందరినీ భయపెట్టించేశారు. వెనకాల ఉన్న మహిషాకారం, యముడి చేతికి ఉన్న సంకెళ్లు ఇలా అన్నీ కూడా గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నాయి.



హీరోయిన్‌ను యమపాశంతో కట్టి పడేసిన తీరు, యముడి ఆహార్యంలో హీరో కనిపించిన తీరు చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే అనేలా ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో చిత్రయూనిట్ బిజీగా ఉంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

## 'ఎన్‌సి 24 ది ఎక్స్‌కవేషన్ బిగిన్స్' వీడియో రిలీజ్



**యువసామ్రాట్ నాగ చైతన్య** 'తండేల్' సంచలన విజయం తర్వాత మరో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. బోల్డ్ ఛాయిసెస్, డైనమిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆదరగొట్టె నాగచైతన్య, తన తొలి సూపర్ నేచురల్ థ్రిల్లర్ విరూపాక్షతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన విజనరీ దర్శకుడు కార్తీక్ దండుతో కొలబరేట్ అవుతున్నారు. వీరిద్దరూ కలసి నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ ని చేయబోతున్నారు. ఎన్‌సి24 ఈ జానర్‌ని రీడిఫైన్ చేసే సినిమాటిక్ వండర్. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి (ఎస్‌విసిసి), సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు, బాపినీడు సమర్పిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడానికి తెరవెనుక వున్న రేర్ సీన్స్‌ని ప్రజెంట్ చేస్తూ "ఎన్‌సి24 ది ఎక్స్‌కవేషన్ బిగిన్స్" ఎలక్ట్రిఫైయింగ్ స్పెషల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. సంవత్సరాల తరబడి ఆలోచనల, నెలల తరబడి ఇంటెన్స్ ప్రీప్రొడక్షన్, రోజుల తరబడి కఠినమైన రిహార్సల్స్ వరకు ఈ సినిమాటిక్ వండర్‌కు ప్రాణం పోసే హార్డ్ వర్క్ ని ఈ వీడియో ప్రజెంట్ చేస్తోంది. నాగ చైతన్య తన పాత్ర కోసం ఫిజికల్‌గా, మెంటల్ గా కంప్లీట్ ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. ఈ వీడియోలో గూస్బంప్స్ ఇచ్చే సీన్స్ వున్నాయి. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం వర్క్ చేస్తున్నారు. అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందించగా, నీల్ డి కున్హా డీవోపీగా వర్క్ చేస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్, నవీన్ నూలి ఎడిటర్. భారీస్థాయిలో నిర్మాణం, అద్భుతమైన కథ, టాప్ టెక్నీషియన్స్, నాగ చైతన్య మాజికల్ ప్రెజెన్స్ వంటి అంశాలతో విది24 నాగ చైతన్య కెరీర్‌లో ఒక కీలకమైన మైలురాయి గానే కాదు, మైథికల్ థ్రిల్లర్ జానర్ లో గ్రౌండ్ బ్రేకింగ్ మూవీగా నిలవబోతోంది.

# 'పేషన్' ఫస్ట్ లుక్ లాంచ్

**యంగ్ ట్యాలెంటెడ్** సుధీస్, అంకిత వీరాంగో హీరోయిన్స్ గా అరవింద్ జాషువా దర్శకత్వంలో రూపొందుతున్న ఇంటెన్స్ ఎమోషనల్ లవ్ స్టోరీ 'పేషన్' ఆర్ఐడిఎఎన్‌టి క్రియేషన్ బ్యానర్‌పై నరసింహా యేలే, ఉమేష్ చిక్కు, రాజీవ్ సింగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ ని క్రియేటివ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు.

ఫస్ట్ లుక్ లాంచ్ ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ శేఖర్ కమ్ముల మాట్లాడుతూ,అరవింద్ జాషువా ఆనంద్ సినిమా నుంచి నాకు పరిచయం. అప్పటిలోనే తనలో స్టోరీ టెల్లింగ్ రైటింగ్ క్రియేటర్ ఉన్నాడని అనిపించింది. తను 'పేషన్' అని ఒక నవల రాశారు. అది నేనుచదివాను. చాలా బాగుంది. తను వచ్చిన ఫ్యాషన్ బ్యాక్ గ్రౌండ్ గురించి ఇందులో రాశారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. నిర్మాతలు అందరూ కొత్తవాళ్లు. వీళ్లంతా చాలా ప్యాషన్‌తో సినిమా తీస్తున్నారు. వాళ్ళందరికీ కంగ్రాట్యులేషన్స్. ఈ పోస్టర్ డిజైన్ చాలా బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. కొత్త ఫ్లేవర్‌తో వచ్చిన సినిమాలుని ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ సినిమాని కూడా అంత అద్భుతంగా ఆదరిస్తారని నమ్ముతున్నాను. టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్ అన్నారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ మూవీ పుట్టకముందు నవలగా పబ్లిష్ చేయబడిన ఛాయా పబ్లికేషన్స్‌కి థాంక్యూ. ఈ నవల చదివిన తర్వాత అందరూ ఇన్స్పైర్ అయ్యి మూవీగా తీసుకురావాలనే తపనని అందరూ అర్థం చేసుకున్నారు. శేఖర్ కమ్ముల బ్లెస్సింగ్స్ లేకపోతే ఈ మూవీ అయ్యేది కాదు. ఆయన బిజీ షెడ్యూల్లో ఉన్నప్పుడు కూడా ఈ సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చారు ఈ సినిమా చాలా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ అరవింద్ జాషువా మాట్లాడుతూ, 'పేషన్' సినిమా కాన్వాస్ చాలా పెద్దది. చాలా పెద్ద పెద్ద వాళ్ల పిల్లలు చదివే ఒక ఫ్యాషన్ కాలేజీలో నాలాంటి ఒక సామాన్యుడు చదివితే ఎలా ఉంటుందో ఒరిజినల్‌గా నేను ఫీల్ అయి రాసిన కథ ఇది. శేఖర్ కమ్ముల 'పేషన్' చూసి నాకు సినిమా ఇండస్ట్రీపై గౌరవం పెరిగింది. ఇది ఇంటెన్స్ ఎమోషన్స్‌తో కూడిన లవ్ స్టోరీ. ఇందులో న్యూ టాలెంట్ సుధీస్, అంకిత చాలా పేషన్ తో వర్క్ చేశారు. వాళ్ల పాత్రలు చాలా అద్భుతంగా ఉంటాయి. మిగతా నటీనటులు అందరూ కూడా చాలా చక్కని పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఈ జనరేషన్‌కి కనెక్ట్ అయ్యే కథ ఇది. త్వరలోనే సినిమా థియేటర్స్ లోకి రానుంది. అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.








## మంత్రి సీతక్కను కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ మర్యాదపూర్వకంగా కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆమె మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే కమిషన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కమిషన్ ఛైర్‌పర్సన్ అయిన తర్వాత సీతా దయాకర్‌రెడ్డి కమిషన్ సభ్యులతో కలిసి మంత్రిని మొదటి సారిగా కలవడం తొలిసారిగా కలవడం గమనార్హం.

## రైతు ఉత్పత్తి సంఘాలుగా వ్యవసాయ సహకార సంఘాలు

### రాష్ట్రంలో తొలి విడగా 311 సంఘాలు మార్పు

### మరింత పటిష్టపరిచే దిశగా చర్యలు.. కేంద్రం కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (పీఏసీఎస్‌లు) రైతు ఉత్పత్తి సహకార సంఘాలుగా మార్చాలని కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు తెలంగాణలోని పలు వ్యవసాయ సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా మార్చాలని కేంద్రం నుండి రాష్ట్రానికి ఉత్తర్వులు అందాయి. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉండగా, మొదటి విడతలో 311 సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చనున్నారు. ఒక్కో సంఘంలో దాదాపు 300 మందికి రైతులు సభ్యులుగా చేరి వాటా ధనం చెల్లించి కార్యకలాపాలను కొన సాగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహా కార సంఘాలు అధికంగా ఉండడంతో వాటిని మొత్తం రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చా లని నిర్ణయించింది. ఈ సంఘాలు రైతులకు పంట రుణాలు ఇవ్వడంతోపాటు వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాలు ఇస్తుంది. అంతేగాకుండా రైతులు పండిం చిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సహకారంతో కొనుగోలు చేస్తున్నది. ఎరువులు, విత్తనాల విక్ర యాలు చేపడుతున్నది. ఇవేగాకుండా పెట్రోల్ బంక్‌లు, రైసుమిల్లులు, ఇతర వ్యాపార లావా దేవీలు నిర్వహిస్తుండడంతో వాటిని రైతు ఉత్పత్తి దారుల సంస్థల పరిధిలోకి తీసుక వస్తున్నారు. కేంద్ర ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)తో అవగాహన ఒప్పందాలు చేసే ప్రక్రియను సహకార శాఖ ఆరంభించింది. రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుక రావడానికి, వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనడానికి వారి ఆర్థిక స్థితిగతు లను మెరుగుపర్చడానికి, రైతులకు సాంకేతికను పరిచయం చేయడం, మద్దతు ధరలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2025 నాటికి దేశ వ్యాప్తంగా 10 వేల రైతు ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## రజతోత్సవ వేళ ప్రజలకు కెసిఆర్ సమాధానం చెప్పాలి: ఎమ్మెల్సీ బల్మూరి

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ రజతోత్సవ సంబరాలు జరుపుకుంటున్న వేళ తెలంగాణ సమాజం అడుగుతున్న ప్రశ్నలకు మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పలు ప్రశ్నలు వేశారు. 15 నెలలుగా ప్రతిపక్ష నేతగా ప్రజల్లోకి రాకుండా, చట్టసభలకు వెళ్లకుండా ఫాంహౌజ్ కే పరిమితమై 25 ఏండ్ల పార్టీ పండగ చేసుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ప్రజలకు తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ప్రశ్నలను వేస్తూ మాజీ సిఎంను నిలదీశారు. ఏ నీళ్ల, నిధులు, నియామకాల కోసమైతే తెలంగాణ సమాజం పోరాటం చేసిందో వాటిని పదేళ్లలో ఎందుకు పట్టించుకోలేదో ప్రజలకు చెప్పాలి. పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసినందుకా మీ గులాబీ పండుగా? సమాధానం ఇవ్వాలి. ఇంటికో ఉద్యోగం అన్నాము, కనీసం ఊరికో ఉద్యోగం ఇవ్వలేకపోయామనా? ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి యుద్ధభూములుగా నిలిచిన యూనివర్సిటీల్లో మీ పాలనలో ఒక్క పోస్ట్ కూడా ఎందుకు భర్తీ చేయలేదో చెప్పాలి. పదేళ్లలో బీసీల రిజర్వేషన్లు పెంచకుండా సబ్బండ వర్గాలను ఎందుకు మోసం చేశారో చెప్పాలి? 10 ఏళ్లుగా దళితుడిని సీఎం చేస్తానని దళిత బిడ్డలను ధగా చేసినందుకా? పదేళ్లలో శ్రీ వర్గీకరణను చేయలేక, మోసం చేశామనా? తొలి కేబినెట్ లో మహిళా మంత్రి లేకుండానే పాలన సాగించి నందుకా? డబుల్ బెడ్ రూం ఇండ్లని ఇల్లు పీకి పందిరేసినందుకా? కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టి, ప్రజల నెత్తిన అప్పుల భారం మోపినందుకా? సిరిగల తెలంగాణాను పదేళ్లలో అప్పుల తెలంగాణగా మార్చినందుకా? ముందు తెలంగాణ సమాజానికి అన్నింటికీ సమాధానం చెప్పాలి అని పేర్కొన్నారు.పదేళ్లు ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చిన ప్రజలే ఇప్పుడు ప్రతిపక్ష నేతగా తమ సమస్యలపై పోరాడమని అవకాశం ఇస్తే.. అసెంబ్లీ సైతం రాకుండా చట్టసభలను అవమానిస్తూ ఫాంహౌజుకే ఎందుకు పరిమితం అయ్యారో చెప్పాలి. ప్రజల కోసం 15 నెలలుగా పబ్లిక్ లోకి రాని కేసీఆర్ పార్టీ రజతోత్సవాలకు మాత్రం పరుగులు తీస్తున్నారు. తెలంగాణ కోసం తమ విలువైన ప్రాణాలను బలి దానమిచ్చిన వందలాది మంది అమరవీరుల కుటుంబాలకు ఏం చేశారో చెప్పాలి. ఘనత వహించిన మీ నాయకత్వంలో మీ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని నిరుద్యోగ తెలంగాణ, అప్పుల తెలంగాణ, ఆత్మహత్యల తెలంగాణగా ఎందుకైందో ముందు ప్రజలకు సమాధానం చెప్పాలని వెంకట్ బల్మూరి ప్రశ్నించారు.

# భారత్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** తెలంగాణ గొప్పతనాన్ని చాటే విధంగా భారత్ సమ్మిట్ జరిగిందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం భారత్ సమ్మిట్ ను నిర్వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రపంచానికి తెలియజేయడానికి భారత్ సమ్మిట్ ఓ వేదికగా ఉపయోగపడిందని పేర్కొన్నారు ప్రపంచ శాంతి, ప్రపంచ న్యాయం, వాతావరణం మార్పులు, టెర్రరిజం అంశాలపై లోతైన చర్చలు జరిగాయి.రాహుల్ గాంధీ పాద యాత్రలో తెలుసుకున్న ప్రజల సాధక బాధలను కృష్ణంగా చెప్పారు. అన్యాయం ఎదుర్కొని కొత్త శకాన్ని సృష్టించి శ్రామికుల హక్కులను కాపాడాలని తీర్మానించారు ప్రగతి శీల ప్రభుత్వాలు ఆదివేదికను ఖండించారు.. మీడియా పై దాడులను రాహుల్ గాంధీ గారు ఖండించారు.. సమ్మిట్ వేదికగా లోక్సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారు ప్రగతిశీల పార్టీల చెందిన ప్రతినిధులు.. ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ డిక్లరేషన్ ను ప్రవేశపెట్టారు.. సమ్మిట్ లో ప్రపంచానికి న్యాయం అందించడం థీమ్ కింద 44 పాయింట్ల ఎజెండాను ఆమోదించడం జరిగిందని అన్నారు . స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం,విలువల నిబద్ధతకు సమ్మిట్ తీర్మానం పునరుద్ఘాటిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని రక్షి ంచడం సామాజిక న్యాయం కోసం కృషి చేయడం శాంతి మానవ భద్రత కోసం పనిచేయడం ప్రపంచ సంస్థల సంస్కరించడం వంటి అంశాలపై సమ్మిట్లో తీర్మానం చేయడం జరిగింది. భారత్ సమ్మిట్ కు 100 దేశాలకు పైబడిన ప్రభుత్వ అధినేతలు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలతో కలిపి మొత్తంగా 450 మంది ప్రపంచవ్యాప్తంగా ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ అనుభవాలను పంచుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు అయినా అహింసా సత్యం న్యాయం ప్రజాస్వామ్యం వంటి అంశాలపై సమ్మిట్ లో వందేళ్ళకి పూర్వం దేశ చరిత్ర గురించి ఏర్పాటు చేసిన స్టాల్స్ విదేశీ ప్రతినిధులను ఆకట్టుకున్నాయి ప్రజాస్వామ్య ప్రగతి శీల విధానాలపై వక్తల వివరణ. భవిష్యత్తులో దేశంలో రాబోయే మార్పుల గురించి కాంగ్రెస్ అగ్ర నాయకుల ప్రసంగం యువతను దిశా నిర్దేశం చేసే విధంగా ఉందని ఆయన వివరించారు.

# యువ వికాసానికి బ్యాంక్ అనుసంధానం తప్పనిసరి

### లేదంటే యూనిట్లు మంజూరుకు నో

### రాష్ట్ర సర్కార్ నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మకంగా అమలు చేయతలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమల్లో పారదర్శకత పెంచేందుకు, నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా ఈ పథకం కింద మంజూరు చేసే యూనిట్లకు బ్యాంకు లింకేజీని తప్పనిసరి చేసింది. రాయితీ పోను మిగిలిన వాటా సొమ్మును భరించేందుకు లబ్ధిదారు సిద్ధంగా ఉన్నా, యూనిట్ల మంజూరు చేయకూడదని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారులకు స్పష్టత ఇచ్చింది. క్షేత్ర స్థాయిలో పరిశీలన తరువాత అర్హుల జాబితాను బ్యాంకర్లకు పంపించి, ఆ యూనిట్లకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి చేయాలని తెలిపింది. కాగా యువ వికాసం పథకానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుండి మొత్తం 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేటగిరీ1 కింద రూ.50,000 విలువైన యూనిట్‌కు నూరు శాతం రాయితీ ఉంది. కేటగిరీ 2, 3, 4లలో యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, లబ్ధిదారు వాటాకింద బ్యాంకు రుణం తీసుకోవాల్సి ఉంటుంది. కేటగిరీ 2 కింద యూనిట్ వ్యయం రూ.లక్షలో 10 శాతం, కేటగిరీ 3 కింద రూ.లక్ష నుండి రూ.2 లక్షల వరకు 20 శాతం, కేటగిరీ 4 కింద రూ.2 లక్షలు నుండిరూ.4 లక్షల వరకు 30 శాతం చొప్పున బ్యాంకు లింకేజీ తప్పనిసరి చేసింది.

# పూలే, అంబేద్కర్‌లే నవభారత నిర్మాతలు

### రిటైర్డ్ ఐఐఎస్ అధికారి బిజె రాజు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌లు తుది శ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించారని వారే మన ఆధునిక భారతావని నిర్మాతలని ప్రముఖ అంబేద్కర్ వాది రిటైర్డ్ ఐ ఐ ఎస్ అధికారి జేబీ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో పూలే అంబేద్కర్ జన జాతర సభ జరిగింది. కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ నగర అధ్యక్షులు ఎం దశరథ్ అధ్యక్షతన జరిగిన సభలో జేబి.రాజు మాట్లాడారు. పూలే అంబేద్కర్ లాంటి మహనీయులను భారత దేశంలో ఒక కులానికి పరిమితం చేయటం ద్వారా వారిని అవమానిస్తున్నారని, ఆధునిక భారతానికి నిర్మాతలు అనే విషయాన్ని నేటితరం గ్రహించాలన్నారు. వేల సంవత్సరాల మనుస్మృతి శూద్రులకు విద్యను నిషేధిస్తే, పూలే దంపతులు అందరికీ విద్య కోసం తుది శ్వాస వరకు కృషి చేశారని అన్నారు.

మహిళా సమానత్వం కోసం నాటి ఆటవిక సమాజాన్ని నేటి ఆధునిక సమాజంగా మార్చారని కొనియాడారు. మనువాద సంస్కృతిపై పూలే నడిపిన ఉద్యమాలు సంస్కరణలు భారతదేశం నేటి స్థితికి చేరిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం భారత రాజ్యాంగ నిర్మా తగా మాత్రమే కొలుస్తూ ఆయన అధ్యయన లోతులను విస్మరిస్తు న్నారని చెప్పారు. భూమి జాతీయకరణ జరగాలని, పరిశ్రమలలో కార్మికులకు యాజమాన్య వాటా హక్కు ఉండాలని నాడే ఆయన రాష్ట్రాలు మైనార్టీలు అనే పుస్తకంలో ప్రస్తావించారని చెప్పారు. మహిళా సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లు తీసుకొచ్చి నాటి ప్రభుత్వం అంగీకరించకపోతే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర బీజేపీ సర్కార్ విధానాల వల్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో పౌరులందరికీ హక్కులు కల్పించిన రాజ్యాంగమే కనుమరుగ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజ స్వామ్య దేశాన్ని మతరాజ్యంగా మార్చే కుట్రలు చేస్తున్నారని, దీంతో అట్టడుగు వర్గాలకు ఈపాటి హక్కులు ఉండవన్నారు భారత రాజ్యాంగం భారతదేశ ప్రజలందరికీ గుండెకాయ లాంటిదని దాన్ని రక్షి ంచుకోవడం నేటి తరం కర్తవ్యం కావాలన్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రెండు తలల పాముల దేశ ప్రజలపై విషం చెబుతుందన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టడమే విధానంగా పెట్టుకున్న పార్టీ అని విమర్శించారు. ఉగ్రవాద దాడిని దేశంలో మత కలహాలకు ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్న మనువాద విధానాన్ని ప్రతిఘటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రత వైఫల్యం సరిహద్దుల్లో సరిపడు సైన్యాన్ని రిక్రూట్ చేయకపోవడం వల్ల ఉగ్రదాడి జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం కృపాసాగర్ ఎన్ బాల పేరు గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి బిట్ర సుబ్బారావు సామాజిక కార్యకర్త తెలంగాణ శ్యామ్ కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి మనోహర్ నాయకురాలు బి రేణుక వివిధ సామాజిక ప్రజాసంఘాల నాయకులు కెవిపిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రముఖ అంబేద్కర్‌వాది రిటైర్డ్ ఐఐఎస్ అధికారి జెపి రాజు

## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం: మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 27:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉదయం నుండి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బిఆర్ఎస్ పార్టీ రజ తోత్సవ సభ విజయవంతం అయిందని బిఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే పేర్కొన్నారు.రజతోత్సవ సభ అనగానే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయని పేర్కొన్నారు, కెసిఆర్ వచ్చి నిలదీస్తడు అన గానే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టిందని అన్నారు. అందుకే అడుగు అడుగున పోలీసు ఆంక్షలు, నిర్బంధాలు ప్రయోగించింది దుర్మార్గ సర్కారు అని, సభా స్థలికి కార్యకర్తలు చేరకుండా 10,15 కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ చేశారని ఆరోపించారు.

కరీంనగర్, సిద్దిపేట, హుస్నాబాద్, వరంగల్ సహా అన్ని దారుల్లో వచ్చే వాహనాలను ఎక్కడికక్క డ అడ్డుకున్నారని, ట్రాఫిక్ జాం పేరిట సాక్షాత్తు పోలీసులే దగ్గరుండి వందలాది వాహనాలను తిప్పి పంపారని అన్నారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల నుండి వచ్చే 1000 పైగా వాహనాలను హుస్నాబాద్ దాటాక కొత్తపల్లి నుండి యూటర్న్ చేసి తిరిగి సిద్ధిపేటవైపు మళ్లించారని, ఆర్‌టిఎ అధికారులను అడుగడుగునా పెట్టి వాహనాలు చెక్ చేయించారని, స్కూల్ బస్సులు అద్దెకు ఇచ్చిన వారికి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తెలంగాణ ప్రజలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పటాపంచలు చేశారని తెలిపారు. తండోపతండాలుగా తరలివచ్చి గులాబీ జెండా సత్తా చాటారని వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరం ఇఎన్‌సి భూక్య హరిరామ్ చంచల్‌గూడ జైలుకు తరలింపు

### అక్రమాస్తుల వెలికితీతకు కస్టడీ కోరనున్న ఎసిబి

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి అక్రమాస్తులు కలిగిన కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సి) భూక్య హరిరాంను ఆదివారం తెల్లవారుజామున చంచల్‌గూడ జైలుకు తరలించారు. హరిరాంపై కొంతకాలంగా అందిన ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున షేక్‌పేట్‌లో ఆయన నివసించే నివాసంతో పాటు ఆయన బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించడం తెలిసిందే. మొత్తం 14 చోట్ల ఎసిబి అధికారులు దాడులు చేబట్టగా ఈ సందర్భంగా గజ్వేల్‌తో పాటు ఇతర ప్రాంతాలలో హరిరాంకు భారీగా అక్రమాస్తులను గుర్తించడం విదితమే. ఇందులో వ్యవసాయ పొలంతోపాటు విల్లాలు, ప్లాట్లు, నగలు వున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అక్రమాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంతో ఇందులో పనిచేసిన అధికారుల పాత్రపై విచారణ చేబట్టగా ఇదే సమయంలో ఈఎన్‌సిగా వున్న హరిరాం గోల్‌మాల్‌పై ఎసిబికి ఆధారాలు లభించాయి. ఈ ఆధారాల ను పరిగణలోకి తీసుకున్న ఎసిబి అధికారులు పలు బృందాలుగా విడిపోయి హరిరాంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు చేబట్టారు. హరిరాం భార్య అనిత కూడా నీటి పారుదల శాఖలో డిప్యూటీ ఈఎన్‌సిగా వుండడంతో ఆమెను కూడా ప్రశ్నించారు. కాగా ఎసిబి సోదాలలో హరిరాం వద్ద ఎసిబి అధికారులు ఆశించినంతగా అక్రమాస్తులు లభించలేదని తెలిసింది. హరిరాం అక్రమాస్తులకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు ఆయనను కస్టడీలోకి తీసుకోవా లని ఎసిబి అధికారులు నిర్ణయించారు. హరిరాంను విచారించేందుకు తమకు తగినంత సమయం లభించలేదని, ఆయనను మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సోమవారం నాడు ఎసిబి అధికారులు ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని సమాచారం. హరిరాం అక్రమాస్తుల వి లువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని ఎసిబి అధికారులు భావిస్తున్నారు.

# మావోయిస్టుల అంతమే అంతిమ పంతం

### ఆరురోజుల తర్వాత భద్రతా బలగాల కీలక అడుగు

### బంకర్ గుర్తింపు.. కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

**చర్ల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** మావోయిస్టు అంతమే కేంద్రమంత్రి అమిత్‌షా పంతం.. సానుకూల చర్చలపై మావోయిస్టులు ఇప్పటికే మూడు దఫాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారు.కనీసం నెలరోజులైనా కాల్పుల విరమణ పాటించాలని మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి భూపేష్ చేసిన ప్రకటనపై చత్తీస్‌గఢ్ ప్రభుత్వం మోనం ప్రకటించింది. ఇప్పటికే మావోయిస్టు స్వచ్ఛందంగా లొంగిపోవాలని లేదంటే ఏరివేత షూరు అంటు తమ సందేశాన్ని స్పష్టం చేసారు.

**చర్చలపై నో కామెంట్**

శాంతి చర్చలపై చత్తీస్‌గఢ్ ప్రభుత్వం మోనం దాల్చింది.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మావోయిస్టులతో ఎటువంటి చర్చలు జరపడానికి సుముఖంగా లేకపోడటంతో కేంద్ర ప్రభుత్వ బలగాలు దూకుడును ప్రదర్శిస్తున్నాయి.ఇప్పటికే మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలలో ఎఫ్ఓబి (ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) నిర్మాణాలను చురుగ్గా చేపట్టడంతోపాడు సెర్చ్ ఆపరేషన్‌ను ఉధృతం చేసింది.దండకారణ్యంతోపాటు నేషనల్ పార్క్ ప్రాంతాలను చుట్టుముట్టి భారీ ఆపరేషన్‌లు చేపడ్డటంతో అక్కడ మావోల మనుగడ కష్టతరం కావడంతో నెల రోజుల క్రితమే కర్రిగుట్టలకు మాకాం మార్చారు. కర్రి గుట్టల్లో మావోల పెద్ద సంఖ్యలో ఉన్నారన్న కేంద్ర నిఘా వర్గాల సమాచారం ఆ ప్రాంతాన్ని చుట్టు ముట్టి జల్లెడ పడుతున్నాయి భద్రతా బలగాలు నేటి వారంరోజులు గా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుంది. హెలికాప్టర్ల ద్వారా బిజిల్ రాకెట్ లాంఛర్లను వదులుతూ వారిని చెల్లాచెదురు చేస్తున్నారు.

**కరిగుట్టల్లో మావోయిస్టుల పరేషాన్**

కర్రిగుట్టల్లో వారంరోజులుగా జరుగుతున్న సెర్చ్ ఆపరేషన్ తో మావోల పరేషాన్ లో పడ్డారు.పగలు రాత్రి అనే తేడా లేకుండా జరుగుతున్న కూబింగ్ తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.ముందుగానే ఓ పథకం ప్రకారం అక్కడి గుహల్లో తలదాచుకొని తమకు కావాల్సి న నిత్యవసర వస్తువులను సమకుర్చుకున్న వాటిని వినియోగించుకునేందుకు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుంది. 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో (బ్లాక్ హిల్స్) నల్లని బండరాయి గల గుట్టల్లో దిన దిన గండంగా కాలం వెళ్లదీస్తున్నారు.ఆహర పదార్థాలు వండుకుంటే భద్రతా బలగాల పసిగడతాయని వండుకు తినలేని పరిస్థితి కనీసం గ్రామస్తుల ద్వారా ఆహారం తెప్పించు కుందామన్నా భద్రతా బలగాలు వారిని ఇళ్లకే పరిమితం చేసారు.సెర్చ్ ఆపరేషన్ కొనసాగినన్ని రోజులు గ్రామస్తులు ఎవరూ అడవిలోకి వెళ్లవద్దని హుకుం జారీచెయ్యడంతో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వారంరోజులుగా ఆకాశంలో హెలికాప్టర్ సౌండ్ అడవిలో భద్రతా బలగాల బూట్ల చప్పుళ్లు తప్ప తమకేమి తెలియడంలేదని బాహ్య ప్రపంచంతో సంబందాలు తెగిపోయాయని పాత్రికేయులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

**గుహల్ని ఛేదిస్తున్న భద్రతా బలగాలు**


కర్రిగుట్టలను తమ భద్రతా వలయంలోకి తీసుకున్న బలగాలు సెర్చ్ ఆపరేషన్ పెద్ద సవాల్ గా మారింది నిప్పులు చిమ్మే ఎండలో సుమారు ఎనిమిది వందల అడుగుల దూరం నిటారుగా ఉన్న గుట్టలకు ఎక్కడం జవాన్లకు పెను భారంగా మారింది.ఐదురోజుల పాటు సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలలో 50 మందికి పైగా జవాన్లకు ఎండవేడిమికి వడదెబ్బ తగిలి కుప్పకూలినట్లు తెలిసింది.వీరి హెలికాప్టర్ ద్వారా బీజాపూర్ హాస్పటల్ తరలించి వైద్య చికిత్సలు అందించినట్లు సమాచారం మరికొంత మంది అంబులెన్స్ భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించినట్లు తెలిసింది. బాంబు స్క్వాడ్ డాగ్ స్క్వాడ్ బృందాల ద్వారా మందుపాతరలను గుర్తించి వెలికితీస్తూ ముందుకు సాగుతున్నారు.ఈ క్రమంలో శనివారం రాత్రి మావోల దాగిఉన్న భారీ గుహను గుర్తించాయి. కర్రిగుట్టల్లో మావోల జాడ కనిపెట్టి వారిపై పైచేయి సాదించే వరకు కూబింగ్ నిరంతరం కొనసాగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం.

# సన్నాలదే హవా

### రికార్డు స్థాయిలో 65 శాతం సాగు

### ఉత్తర తెలంగాణలో అధికం .. బోనస్‌తో రైతుల ఆసక్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** తెలంగాణలో సన్న రకాల వరి హవా కొనసాగుతోంది. ప్రస్తుత యాసంగి సీజనులో గతంలో ఎన్నడూ లేని విధంగా సన్న రకాలకు చెందిన వరి నాట్లను వేసేందుకే రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాష్ట్రంలో సన్న రకాల సాగు జోరందుకుంది. రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో సాగవుతున్న వరిలో 65 శాతం మేర సన్న రకాలే ఉన్నట్లు వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ ఇస్తుండటంతో రైతులు ఆ దిశగా మళ్లారు. రాష్ట్రంలో వానాకాలం వరి పంటకు సంబంధించి 23 లక్షల టన్నుల సన్న రకాలకు చెందిన ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున 1,154 కోట్ల రూపాయల మేర రైతులకు బోనస్‌గా చెల్లించింది. ఈ నేపథ్యంలో ఇటీవల వరకూ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాసంగిలో 106 శాతం మేర 52 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 41 లక్షల ఎకరాలకే పరిమితమైన వరి నాట్లు, ఈ సారి దానికి కంటే అదనంగా మరో 11 లక్షల ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. బోనస్‌తో పాటు, ప్రధానంగా సాగు నీరు అందుబాటులో ఉండటం, వాతావరణం కూడా అనుకూలించడంతో సన్నాలపై రైతులు దృష్టిసారించారు. ఇప్పటి వరకూ సాగైన వరి నాట్లలో 65 శాతం మేర అంటే రికార్డు స్థాయిలో దాదాపు 34 లక్షల ఎకరాల్లో సన్నా రకాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రాష్ట్రంలో సాధారణంగా వానాకాలం సీజనులో సాగయ్యే వరిలో 38 శాతం వరకు, రబీలో 10–15 శాతం వరకు సన్న రకాలు ఉంటాయి. ఇప్పుడు రికార్డు స్థాయిలో, అది కూడా యాసంగిలో 65 శాతం వరకూ ఇంత భారీ ఎత్తున సన్న రకాలు సాగవడం ఇదే తొలిసారని అంటున్నారు. రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణలో గణనీయంగా కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాలతోపాటు మెదక్, నిజామాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో యాసంగిలో సన్నాల సాగు చాలా ఏళ్లుగా నిలిచిపోయింది. అయితే ఈ అందుకు విరుద్ధంగాగతంలో పండించే దొడ్డు వరి కన్నా, ఈసారి సన్న రకాలనే సాగు చేస్తుండటం గమనార్హం.



# ఎస్సెమ్మెస్.. క్లిక్‌చేస్తే 'బాధితులు'

### రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట సైబర్‌క్రైం కేసు

### అత్యాశలతో బతుకులు ఆవిరి

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఆశలు, అత్యాశలే బతుకులను బజారు కీడుస్తాయి. సులభంగా వచ్చే సొమ్ము కంటే కష్టపడి వచ్చినవాటితో సంతృప్తి ఆనందం...అనేది నానుడి చెప్పిన మాటలే ఇందుకు నిదర్శనం... గత కొంత కాలంగా ఒక ఫోన్ ఎసెమ్మెస్ రూ.లక్షలు, కోట్లు వస్తాయని నమ్మి సర్వం కోల్పోతున్నారు. ఏళ్ల తరబడి సంపాదించిదంతా చిన్నపాటి ప్రలోభ ఆశ లొంగి బాధితులుగా మారుతున్నారు. సాధారణ ఉద్యోగులు,ఉన్నతస్థాయి విద్యనభ్యసించేవారే ప్రధానంగా ఉంటున్నారు. లాటరీ, రీచార్జిలు, ఆఫర్‌లంటూ మభ్యపెట్టే సైబర్‌నేరాల వలలో చిక్కి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీనికి కట్టుబడి లేదా..అంటే లేదని చెప్పాలి... మన అప్రమత్తమే మన భద్రత అని పోలీసులు సైతం ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. రూ.కోట్లలో చేతులు మారినా..రికవరీ మాత్రం అంతంతే.

**బలహీనతలు..అవసరాలే వారి మోసాలు..**

సామన్య, మధ్యతరగతి కుటుంబంలో ఎన్నో ఆశలు, మరెన్నో ఉన్నతస్థాయి ఆలోచనలు, అమాయకత్వంతో సైబర్ నేరస్తులు విసిరే తీపిమాటలు, జనంలో ఆనోటా..ఈనోటా వినే కబుర్లతో సరైందని నమ్మి మోసపోతున్నారు. ఫోన్‌కు వచ్చే మెస్సెజ్‌లన్ని నిజాలు కావని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఏదో ఒక ఎసెమ్మెస్ డబ్బులు ఎలా తీసుకవస్తాయనేవి ఒకసారైనా ఆలోచించారా? అని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఆశలు ఉండాలే కానీ... అత్యాశలు జీవితానికి పెను ముప్పుగా మారుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డబ్బులు ఉచితంగా రావని ప్రజలు మానసికంగా నిర్ణయించుకునేంత వరకు నేరాలను ఆపలేమని సైబర్‌నిపుణులు చెప్తున్నారు.గత నెలలో హైదరాబాద్‌లో ఉంటున్న ఉన్నతవిద్యవంతుడు అయిన ప్రముఖ వైద్యుడు కూడా సైబర్ దాడుకి బాధితుడిగా మారాడు. అయితే ఇతనికి తెలియని నూతన సాంకేతికరంగంపై సరైన అవగాహన లేకపోవడం, డిజిటల్ అరెస్ట్‌లే ప్రధానకారణమని ఫిర్యాదుకాపిలో వివరించాడు. అంతేకాకుండా యువత ఆలోచనలకు అనుగుణంగా వచ్చిన ఎస్ఎంఎస్‌లకు స్పందించడం అనురించడం చేయడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

ఇందులో మహిళలు సైతం ఉన్నారని, లాటరీలు, గిఫ్ట్‌కూపన్‌లకు తలొగ్గి అడిగనదంతా డేటాను ఇచ్చేస్తున్నారని పోలీసుల విచారణలో వెల్లడవుతున్నాయి. ఇలా ఎన్నో రకాలుగా సైబర్‌దాడులు జరుగుతున్నాయి.

**వేలల్లో సైబర్‌క్రైం కేసులు..**

హైదరాబాద్‌తో పాటు సిద్దిపేట, నల్గొండ, యాదగిరిగుట్ట, కరీంనగర్‌తో పాటు ఆయా జిల్లాల్లో సైతం సైబర్ క్రైం కేసులు నమోదవుతున్నాయి. రాష్టస్థాయిలో ఈ ఏడాది సుమారు మూడు వేలకు పైబడే కేసులు ఉన్నాయని సైబర్ క్రైం ఓ పోలీస్ అధికారి తెలిపారు. ముఖ్యంగా రాజదానిలో మరింత అధికంగా ఉన్నాయి. రూ.2వేల నుంచి కోట్ల వరకు నిమిషాల్లో బ్యాంకు ఖాతాలను లూటి చేస్తున్నారు నేరస్తులు. బ్యాంక్ వివరాలు ఎవరికి చెప్పకూడదని, డౌట్‌లు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఖాతా వివరాలు, పిన్‌నెంబర్లు,ఆధార్, పాన్‌కార్డులు షేర్ చేయరాదని పోలీసులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఆన్లైన్ లావాదేవాల్లో పలు జాగ్రత్తలు పాటించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. నకిలీఖాతాలను గమనించాలని పేర్కొంటున్నారు.



# శాంభవికి డబుల్ స్వర్ణం


**న్యూఢిల్లీ:** 23వ కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో శాంభవి డబుల్ స్వర్ణం సాధించింది. ఈ షూటింగ్ ఛాంపియన్‌షిప్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌ను గెలుచుకునే మార్గంలో మహారాష్ట్రకు చెందిన శాంభవి క్షీ రసాగర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేతలు, ఒలింపిక్ ఫైనలిస్టులు మరియు జాతీయ ఛాంపియన్‌లను ఓడించింది. గత సంవత్సరం లిమాలో జరిగిన జూనియర్ వరల్డ్స్‌లో ఐదవ స్థానంలో నిలిచిన 16 ఏళ్ల ఆమె 633.5 పాయింట్లతో అర్హతలో అగ్రస్థానంలో నిలిచింది, 24షాట్‌ల ఫైనల్‌లో తన చివరి షాట్‌తో అద్భుతమైన 10.8తో ముగించి, పారిస్ ఒలింపిక్ ఫైనలిస్ట్ హర్యానాకు చెందిన రమితను అధిగమించింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మెహులి ఘోష్ కాంస్య పతకం గెలుచుకుంది. కర్ణి సింగ్‌లో స్టార్, జూనియర్ మహిళల ఈవెంట్‌లో రజతం, యూత్ మహిళల పోటీలో రెండవ స్వర్ణం సాధించడంలో సఫలీకృతమైంది. అలాగే మెహులి, రమిత, ఇటీవల జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన అనన్య నాయుడు, జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత శ్రేయా అగర్వాల్ వంటి వారితో పాటు నిలిచింది. 24షాట్ల నిర్ణయాత్మక షాట్‌లో చివరి రెండు షాట్‌లకు వెళ్లేసరికి, రమిత 0.1 ఆధిక్యంలో ఉంది. ఆ తర్వాత ఇద్దరు షూటర్లు తమ 23 వ షాట్‌కు ఒకేలాంటి 10.2 సెకన్లు కొట్టారు, కానీ ఆ తర్వాత శాంభవి చివరి షాట్ ఒలింపియన్‌ను 252.1 పాయింట్లతో విజేత 252.9 పాయింట్లతో చాలా తక్కువ లక్ష్యాన్ని ఉంచింది. అయితే 22వ షాట్ తర్వాత మెహులి 231.0తో నిష్క్రమించాడు. దీంతో రమిత శాంభవిపై ఒక విజయం సాధించి, తదుపరి జూనియర్ మహిళల ఫైనల్‌లో ఆమెపై 1.5 ఎక్కువ తేడాతో గెలిచింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాన్య మిట్టల్ మూడవ స్థానంలో నిలిచింది. శాంభవికి అది ఏమాత్రం అడ్డుకాకుండా, దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తూ, ఆమె మరోసారి యువతుల విభాగంలో కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఈసారి కర్ణాటకకు చెందిన నిధి మిట్టల్‌ను 253.6 పాయింట్లతో ఓడించింది. నిధి 1.8 పాయింట్లతో వెనుకబడి ఉండగా, మధ్యప్రదేశ్‌కు చెందిన గౌతమి భానోట్ మూడవ స్థానంలో నిలిచింది. సీనియర్ అర్హత రంగం మొత్తం 411 మంది షూటర్లను ఆకర్షించింది.

## ఏషియన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్..
# భారత్‌కు 43 పతకాలు పక్కా




**న్యూఢిల్లీ:** ఏషియన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతయువబాక్సర్లు దుమ్మురేపుతున్నారు. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ టోర్నీలో ఏకంగా 43 పతకాలు పక్కా చేసుకున్నారు. జోర్డాన్‌లో జరుగుతున్న వేర్వేరు కేటగిరీల్లో మరో నలుగురు బాక్సరు సెమీఫైనల్ బెర్తులు ఖరారు చేసుకోవడం వల్ల పతకాల సంఖ్య 43కు చేరుకుంది. అండర్15లో 25 పతకాలు, అండర్17లో 18 పతకాలు భారత్ సొంతం చేసుకోనుంది. బాలుర అండర్17 క్వార్టర్స్‌లో అమన్ సివాచ్, జిద్రాచ్ జేమ్ (ఫిలిప్పిన్స్)పై అలవోకగా గెలువగా, దేవాంశ్(80కి), అబ్దుల్లా అల్‌దబాస్‌ను చిత్తు చేశాడు. మరోవైపు బాలికల అండర్17 కేటగిరీలో సిమ్రన్‌జీత్‌కౌర్ 50తో అల్హసనత్‌పై గెలువగా, హిమాంశి, ఫరాబును ఓడించి ముందంజ వేసింది. అండర్17 బాలుర విభాగంలో అమన్ సివాచ్ (63 కిలోలు) మరియు దేవాన్ష్ (80 కిలోలు) ముందు వరుసలో నిలిచారు, ఇద్దరూ క్వార్టర్ ఫైనల్స్ పోటీల చివరి సెట్‌లో ఫిలిప్పిన్స్ మరియు జోర్డాన్‌కు చెందిన ప్రత్యర్థులపై రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్ (ఆర్ఎస్‌సి) విజయాలను సాధించారు. బాలికల విభాగంలో, సిమ్రాన్‌జీత్ కౌర్ (60 కిలోలు) జోర్డాన్‌కు చెందిన అయా అల్హసనాత్‌పై 50 తేడాతో విజయం సాధించగా, హిమాన్షి (70 కిలోలు) పాలస్తీనాకు చెందిన ఫరా అబౌ లైలాపై తొలి రౌండ్‌లోనే తన పోటీని ముగించింది. పురుషుల యు 17 క్వార్టర్ ఫైనల్స్, 60 కేజీలు విభాగంలో సాహిల్ దుహాన్ (ఇండియా) అమీరాలీ మెహ్రాబీ (ఐఆర్ఐ) చేతిలో ఓడిపోయింది.

# అనామక ప్లేయర్ చేతిలో జొకోవిచ్ ఓటమి



**న్యూఢిల్లీ:** మాడ్రిడ్ ఓపెన్‌లో సెర్బియా టెన్నిస్ స్టార్ నోవాక్ జొకోవిచ్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. ఫ్రెంచ్ ఓపెన్ సన్నాహకాల్లో ఉన్న సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్‌కు బిగ్ షాక్ తగిలింది. మాడ్రిడ్ ఓపెన్‌లో అతను తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. పురుషుల సింగిల్స్‌లో నొవాక్ జకోవిచ్ 3-6, 4-6 తేడాతో వరుస సెట్లలో మాటొ ఆర్నాల్డి (ఇటలీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. కెరీర్‌లో 100వ ఏటీపీ టైటిల్‌పై కన్నేసిన నొవాక్ జకోవిచ్ 32 అవనసవర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుని మాటియో అర్నాల్డి చేతిలో అనూహ్యంగా పరాజయం చెందాడు. తన కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జొకోవిచ్ అనామక ప్లేయర్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మాటియోతో పోరును వరుస సెట్లలో చేజార్చుకున్న జొకోవిచ్ 32 సార్లు అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఆర్నాల్డీతో ఆడటం జకోవిచ్‌కు ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో నొవాక్ జకోవిచ్‌కు ఇది వరుసగా మూడో పరాజయం. మాడ్రిడ్ ఓపెన్ ముందుకు మియామి ఫైనల్, మాంటె కార్లో మాస్టర్స్‌లో ప్రిక్వార్టర్స్‌లోనూ జకోవిచ్ ఓటమిపాలయ్యాడు. మే 25న ఫ్రెంచ్ ఓపెన్‌కు తెరలేవనున్న విషయం తెలిసిందే. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిలే లక్ష్యంగా జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్ బరిలోకి దిగుతున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో జకోవిచ్‌కు నిరాశే ఎదురైంది. అసాధారణ ప్రదర్శనతో సెమీఫైనల్ చేరిన ఈ సెర్బియా స్టార్ గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. జర్మనీ స్టార్ అలెగ్జాండ్ జ్వెరెవ్‌తో జరిగిన సెమీఫైనల్లో గాయం కారణంగా మధ్యలోనే వైదొలిగాడు. గాయం నుంచి కోలుకున్న జకోవిచ్ ఏటీపీ టోర్నీల్లో బరిలోకి దిగాడు. కానీ వరుసగా మూడు టోర్నీల్లోనూ అతను ఓటమిపాలయ్యాడు. కీలక ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జకోవిచ్ పేలవ ఫామ్ అతన్ని ఫ్యాన్స్‌ను కలవరపెడుతోంది.






# పవర్‌ప్లేలో అత్యధిక సిక్స్‌లు

## టాప్ 10లో రాజస్థాన్ రాయల్స్, చివరి స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18లో మ్యాచ్‌లు సగానికి పైగా అయిపోయాయి. ఈ ఐపీఎల్‌లో 74 మ్యాచ్‌లకు గాను ఇప్పటివరకు జరిగిన 46 మ్యాచ్‌ల్లో పవర్‌ప్లేలో ఏ జట్టు అత్యధిక సిక్సర్లు కొట్టిన ఘనతను సాధించిందో చూస్తే ఫ్లాప్‌గా నిరూపితమైన జట్టు అగ్రస్థానంలో నిలిచింది. ఈ లిస్ట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చివరి స్థానంలో, అత్యధిక సిక్సర్లు కొట్టిన మొదటి జట్టుగా రాజస్థాన్ రాయల్స్ నిలిచింది. ఈ సీజన్‌లో బ్యాటింగ్‌లో అత్యంత బలహీనంగా కనిపించిన రాజస్థాన్ పవర్ ప్లేలో 37 సిక్సర్లు కొట్టింది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ కూడా అద్భుతంగా రాణించారు. దూకుడు బ్యాటింగ్ కారణంగా, జట్టు పవర్ ప్లేలో 29 సిక్సర్లు కొట్టగలిగింది. దీంతో లిస్ట్‌లో రెండవ జట్టుగా మారింది. ఐదుసార్లు ఛాంపియన్స్ అయిన ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2025 కి మంచి ఆరంభాన్ని ఇవ్వలేదు. వరుస పరాజయాల కారణంగా చాలా విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు ఫామ్‌లోకి వచ్చింది. ముంబై ప్రస్తుతం పవర్‌ప్లేలో అత్యధిక సిక్సర్లు కొట్టిన మూడవ జట్టుగా నిలిచింది. ముంబై ఓపెనర్లు తొలి ఆరు ఓవర్లలో 26 సిక్సర్లు బాదారు. ఈ జాబితాలో పంజాబ్ కింగ్స్ నాల్గవ స్థానంలో ఉంది. ప్రస్తుత సీజన్‌లో పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూడా అద్భుతంగా ప్రదర్శన ఇస్తున్నారు. దీంతో, పవర్ ప్లేలో అత్యధిక సిక్సర్లు కొట్టిన నాల్గవ జట్టుగా నిలిచింది. రిషబ్ పంత్ నేతృత్వంలోని లక్నో సూపర్ జెయింట్స్ పవర్‌ప్లేలో 20 కి పైగా సిక్సర్లు కొట్టింది. ఈ ఓపెనింగ్ జోడీ తన పవర్ హిట్టింగ్ బ్యాటింగ్‌తో జట్టుకు చాలా మ్యాచ్‌ల్లో మంచి ఆరంభాన్ని అందించింది. దీని కారణంగా, పవర్‌ప్లేలో లక్నో తన పేరు మీద 23 సిక్సర్లను నమోదు చేసుకోగలిగింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు సాధించి, ప్లేఆఫ్స్‌కు తన వాదనను బలపరిచింది. అయితే, పవర్ ప్లేలో సిక్సర్లు కొట్టడంలో మాత్రం విఫలమైంది. 21 సిక్సర్లతో ఆరో స్థానంలో నిలిచింది. గుజరాత్ టైటాన్స్ బలమైన ప్రదర్శన కనబరిచింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆరు గెలిచి పాయింట్ల పట్టికలో మొదటి స్థానంలో ఉంది. కానీ, పవర్ ప్లేలో బ్యాటర్స్ 17 సిక్సర్లు మాత్రమే కొట్టగలిగారు. ఈ సీజన్‌లో సంచలనం సృష్టించిన ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు పవర్‌ప్లేలో సిక్సర్లు కొట్టడంలో రాణించలేకపోయారు. పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో ఉన్న ఈ జట్టు 15 సిక్సర్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ వంటి భయంకరమైన ఓపెనర్లు ఉన్నప్పటికీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ పవర్‌ప్లేలో రాణించడంలో విఫలమైంది. ఈ ఇద్దరు ఆటగాళ్ళు వ్యక్తిగతంగా జట్టుకు ప్రయోజనకరంగా నిరూపితమయ్యారు. కానీ, జోడీగా ఏమీ చేయలేకపోయారు. దీని ప్రభావం జట్టు సిక్సర్లు కొట్టడంపై కనిపించింది. పవర్ ప్లేలో 12 సిక్సర్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన నిరాశపరిచింది. ఐదుసార్లు ఛాంపియన్లుగా నిలిచిన ఈ జట్టు 8 మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. దీంతో పాటు, పవర్ ప్లేలో సిక్సర్లు కొట్టే విషయంలోనూ చాలా దారుణంగా ఉంది. మొదటి ఆరు ఓవర్లలో కేవలం ఐదు సిక్సర్లు మాత్రమే కొట్టింది.



## మహిళల ముక్కోణపు వన్డేలో..
# భారత్ శుభారంభం
## 9 వికెట్ల తేడాతో శ్రీలంక చిత్తు

**న్యూఢిల్లీ:** మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో స్వంతగడ్డపై శ్రీలంక ఓటమి పాలవగా, భారత్ శుభారంభం చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా ఆదివారం వర్షం కారణంగా 50 ఓవర్ల మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించి జరిగిన తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై భారత్ అమ్మాయిలు అలవోక విజయం సాధించారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీ ఓవర్లలో 147 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందుంచగా, కేవలం 29.4 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టపోయి 149 పరుగులు చేసింది. స్మృతి మందాన 43 పరుగులు చేసి ఔట్ కాగా, ప్రతీక రావల్ 50 పరుగులు చేసి హాఫ్ సెంచరీతో మెరవగా, హార్లీన్ డియోల్ 48 పరుగులతో నాటౌట్‌గా చక్కటి భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు. శ్రీలంక బౌలర్లలో ఇనోక రణవీర ఒక వికెట్ తీసింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 38.1 ఓవర్ల వద్ద 147 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో ఇండియన్ స్పిన్నర్ స్నేహ్ రాణా 3 వికెట్లు పడగొట్టి లంక పతాన్ని శాసించింది. శ్రీలంక బౌలర్లలో హాసిని పెరారా 46 బంతుల్లో 30 పరుగులు, 4 ఫోర్లు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, కవిషా దిల్హారి 26 బంతుల్లో 25 పరుగులు, 3 ఫోర్లు, అనుష్క సంజీవని 39 బంతుల్లో 22 పరుగులు, 3 ఫోర్లు చేసి రాణించారు. ఇక హర్షిత సమరవిక్రమ 14 పరుగులు, అచ్చిని కుల సూర్య 17 పరుగులు చేసి ఫర్వాలేదనిపించారు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. చమరి ఆటపట్టు 7 పరుగులు, హన్సిమా కరుణరత్నే 4 పరుగులు, నీలాక్షి డి సిల్వా 10 పరుగులు, ప్యూమి బడలేగ్ 2 పరుగులు, మాల్కి మడార 2 పరుగులు చేసి విఫలమయ్యారు. భారత్ బౌలర్లలో చరణి 2 వికెట్లు, దీప్తి శర్మ 2 వికెట్లు, అరుంధతీరెడ్డి ఒక వికెట్ పడగొట్టారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈ నెల 29న కొలంబో వేదికగా దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

# రియల్ ఎస్టేట్ వర్సెస్ బంగారం



**ముంబై, ఏప్రిల్ 27:** రియల్ ఎస్టేట్, బంగారం రెండూ భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పెట్టుబడి ఎంపికలు. ఈ రెండూ భవిష్యత్తులో మంచి ఆదాయాన్ని అందించ గలవు, కానీ 2025లో ఈ రెండింటిలో ఇన్వెస్ట్ చేయడానికి మీకు ఏది సరైనది? రియల్‌ఎస్టేట్, బంగారం మధ్య పోలిక, వాటి ప్రయోజనాలు, నష్టాలు, ఏ పెట్టుబడి ఎప్పుడు ఉత్తమమో తెలుసుకుందాం. రియల్ ఎస్టేట్ అనేది భూమి, ఇళ్లు, లేదా వాణిజ్య ఆస్తులలో పెట్టుబడి పెట్టడం. దీర్ఘకాలంలో ఆస్తి విలువ పెరుగు తుంది, ముఖ్యంగా పట్టణీకరణ, ఆర్థిక వృద్ధి వంటి బెనిఫిట్స్ ఉంటాయి. అద్దె ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చు. పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యతను అందిస్తుంది. పెద్ద మొత్తంలో ప్రారంభ పెట్టుబడి అవసరం. నిర్వహణ ఖర్చులు (మరమ్మత్తులు, పన్నులు) ఎక్కువగా ఉంటాయి. మార్కెట్ అస్థిరత, ఆస్తి అమ్మకం చేయడానికి సమయం పడుతుంది (తక్కువ లిక్విడిటీ). ఎవరికి సరిపోతుంది?: దీర్ఘకాలిక (510 సంవత్సరాలు) పెట్టుబడి లక్ష్యం ఉన్నవారికి, ఎక్కువ మూలధనం ఉన్నవారికి ఇది సరిపోతుంది. బంగారం ఒక సురక్షి తమైన, సాంప్రదాయ పెట్టుబడి ఎంపికగా పరిగణించబడుతుంది. ఆర్థిక అనిశ్చితి ఉన్న సమయంలో సురక్షి తమైన ఆస్తిగా పనిచేస్తుంది. ద్రవ్యోల్బణా నికి వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తుంది. అధిక లిక్విడిటీ కలిగి ఉంటుంది, అంటే సులభంగా కొనుగోలు లేదా అమ్మకం చేయవచ్చు. అద్దె లాంటి స్థిర ఆదాయం అందించదు. బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడతాయి. నిల్వ చేయడానికి దాని భద్రతకు అదనపు ఖర్చులు ఉండవచ్చు. ఎవరికి సరిపోతుంది?: తక్కువ మూల ధనంతో స్వల్పకాలిక స్థిరత్వం కోరుకునే వారికి లేదా ఆర్థిక అస్థిరతలో సురక్షి త పెట్టుబడి కోసం చూసే వారికి బంగారం సరిపోతుంది. రెండింటికీ ఇదే అసలైన తేడా.. ఆదాయాలు: రియల్ ఎస్టేట్ దీర్ఘకాలంలో అధిక ఆదాయా లను ఇవ్వ గలదు, అయితే బంగారం త్వరిత లిక్విడిటీ,స్థిరత్వాన్ని అందిస్తుంది. ప్రమాదం: రియల్ ఎస్టేట్ మార్కెట్ చక్రాల కారణంగా అధిక ప్రమాదం కలిగి ఉంటుంది. బంగారం తక్కువ అస్థిరమై నది, కానీ గ్లోబల్ ధరలపై ఆధారపడు తుంది. ప్రాప్యత: బంగారం తక్కువ మూలధనంతో సులభంగా కొనుగోలు చేయవచ్చు, రియల్ ఎస్టేట్‌కు ఎక్కువ పెట్టుబడి అవసరం. రియల్ ఎస్టేట్, బంగారం మధ్య ఎంపిక మీ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ టేకింగ్, పెట్టుబడి సమయం మీద ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలిక సంపద సృష్టి కోసం రియల్ ఎస్టేట్ ఉత్తమం, స్వల్పకాలిక సురక్షితం వైవిధ్యత కోసం బంగారం మంచి ఎంపిక. ఆదర్శవంతమైన పెట్టుబడి పోర్ట్ ఫోలియోలో ఈ రెండింటినీ సమతుల్యంగా చేర్చడం వల్ల మంచి ఫలితాలు పొంద వచ్చు.

# క్రెడిట్ కార్డు వ్యయం రూ.21.16 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** క్రెడిట్ కార్డు వ్యయం 2025 ఆర్థిక సంవత్సరంలో అనూహ్యంగా పెరిగి రికార్డు స్థాయిలో రూ.21.16 లక్షల కోట్లకు చేరు కుంది. వినియోగదారుల డిమాండ్ డిజిటల్ లావాదేవీలకు పెరుగు తున్న ప్రాధాన్యత కారణంగా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 15శాతం



పెరుగుదలను నమోదు చేసింది. రుణ ఆధారిత వినియోగం అధికం అవుతుండడానికి గల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. పట్టణ, డిజిటల్ పరిజ్ఞానం ఉన్న వినియోగ దారులు విచక్షణా వ్యయం కోసం క్రెడిట్ కార్డు లను వాడుతున్నారు. ముఖ్యంగా ఇ-కామర్స్, ట్రావెల్, డైనింగ్ వంటి రంగాల్లో దీన్ని అధికం గా ఉపయోగిస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై ఆసక్తి చూప దం క్రెడిట్ కార్డు వినియోగా నికి ఆజ్యం పోసింది. మూడింట రెండొం తుల లావాదేవీలు డిజిటల్ రూపంలో జరుగు తున్నాయి. వ్యయాలపెరుగుదల ఆర్థిక వ్యవస్థపై స్థిరమైన విశ్వాసాన్ని సూచిస్తుంది. 2025 మార్చి నాటికి చలామణజలో ఉన్న క్రెడిట్ కార్డుల సంఖ్య 10.98 కోట్లకు చేరింది. ఇది యేడాది క్రితం 10.18 కోట్లుగా ఉండేది. కొత్త కార్డుల జారీ బ్యాంకుల వారీగా భిన్నంగా ఉంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ కార్డ్స్ వంటి ప్రముఖసంస్థలు గణనీయమైనపెరుగుదలను నమోదు చేయగా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఆర్‌బిఎల్ బ్యాంకు వంటి ఇతర సంస్థలు రెగ్యులేటరీ సవాళ్లు, భాగస్వామ్యాల్లో మార్పుల కారణంగా కార్డుల జారీలో క్షీణతను ఎదుర్కొన్నాయి. అన్ సెక్యూర్డ్ రుణాలకు సంబంధించిన రిస్క్‌లను తగ్గించడానికి బ్యాంకులు క్రెడిట్ క్వాలిటీకి ప్రాధాన్యత ఇస్తున్నాయి.

# పాత వాహనాలకు పెట్రోల్ బంద్.. జులై 1 నుంచి అమల్లోకి!

**ముంబై, ఏప్రిల్ 27:** కాలుష్యాన్ని కట్టడి చేసేందేందుకు దిల్లీ ప్రభుత్వం కఠిన చర్యలను తీసుకుంటోంది. అందులో భాగంగానే కాలం చెల్లిన వాహనాలకు ఇంధనం విక్రయించకుండా నిబంధ నలను జారీ చేసింది. అనగా పెట్రోల్ 15 ఏళ్లు, డీజిల్ 10 ఏళ్లు దాటిన వాహనాలకు పెట్రోల్, డీజిల్ లభించదు. ఇది జూలై 1వ తేదీ నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది. ఈ ప్రక్రియను దశల వారీగా అమలు చేయను న్నట్లు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్( సీఏక్యూఎం) తెలిపింది. దిల్లీలో 2025 జూలై 1న, ఎన్‌సీఆర్, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, సోనిపట్‌లలో నవంబర్ 1న నుంచి అమలు కానుంది. 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎన్‌సీఆర్‌లోని మిగిలిన ప్రాంతాల్లో అమల్లోకి వస్తుంది. ఇప్పటికే వాహనాలు వయసును తెలుసుకునేం దుకు పెట్రోల్‌బంకుల్లో ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి వాహనాల నంబర్ ప్లేట్ లను స్కాన్‌చేస్తుంది. ఈ డేటా ‘వాహన్’ డేటా బేస్‌కు లింక్ చేయబడి ఉంటుంది. దీంతో నంబర్ ప్లేట్ స్కాన్ చేయగానే ఆ వాహనానం వివరాలు తెలుస్తాయి. దీంతో కాలం చెల్లిన వెహికల్ అయితే పెట్రోల్ లభించదు. అలాంటి వాహనాలను సీజ్‌చేసి స్క్రాప్‌గా పంపి స్తారు. ఎన్‌సీఆర్ పరిధిలో ఉంటే అన్ని బంకుల్లో ఇలాంటి కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే కోర్టు ఉత్తర్వులు, ఏదైనా చట్టం నుంచి అనుమతి పొందిన వాహనాలకు మాత్రమే ఈ ఆదేశాలు నుంచి మిన హాయింపు ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం 2025 నాటికి ఒక్క దిల్లీలోనే కాలం చెల్లిన పాత వాహనాలు 27.5 లక్షలకు పైగా ఉన్నాయి. దిల్లీలో మొత్తం 477 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ప్రస్తుతానికి 377 బంకుల్లో మాత్రమే ఈ కెమెరాలను అమర్చారు. ఏప్రిల్ చివరి నాటికి మిగిలిన వాటిల్లో అమర్చునట్లు ఇటీవల ఓ సీనియర్ అధికారి తెలిపారు. అలాగే ఎత్తైన భవనాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో తప్పకుండా యాంటీ స్మోగ్ గన్లను అమర్చాలని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 90 శాతం సీఎన్‌జీ బస్సులను దశలవారీగా ఉపసంహరించుకొని, ఎలక్ట్రిక్ బస్సులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.